కార్తీక నృత్యం.. నయన మనోహరం!

కార్తీకమాసం ముగింపు కార్యక్రమం ఒంగోలులో నయన మనోహరంగా సాగింది. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రతిఒక్కరినీ కట్టిపడేశాయి. స్థానిక కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఈ ప్రదర్శన జరిగింది.

6



పమిడిపాడు బ్రాంచి కాలువకు సరిపడా నీరు ఇవ్వటం లేదు

ఇరిగేషన్ అధికారుల వివరణ

దర్శి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పమిడిపాడు బ్రాంచ్ కాలువకు అధికనీరు విడుదల చేయటంలేదని దర్శి ఎన్ఎస్‌పీ ఈఈ పూర్ణచంద్ తెలిపారు. పమిడిపాడు బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద ఎక్కువ నీరు విడుదల చేస్తూ తక్కువనీరు రీడింగ్స్‌లో చూపుతున్నట్లు గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. పమిడిపాడు బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద 250 క్యూసెక్కుల నీరు నిల్వ ఉన్నప్పటికీ ప్రవాహం కదలదని పేర్కొన్నారు. ఆపై విడుదల చేసిన నీరు మాత్రమే కిందకు వెళ్తుందని చెప్పారు. రీడింగ్స్‌లో 650 క్యూసెక్కుల నీరు వెళ్తున్నట్లు చూపుతున్నప్పటికీ వాస్తవంగా 415 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతుందని వివరించారు. ఈవిషయాన్ని గతంలోనే ఉన్నతాధికారులకు వివరించామని చెప్పారు. సాంకేతికపరమైన సమస్యతో రైతులు అపోహపడుతున్నారని వివరించారు. అన్నిప్రాంతాల్లోని ఆయకట్టు భూములకు సక్రమంగా సాగునీరందించటమే తమ లక్ష్యమన్నారు. జిల్లాకు వాటా ప్రకారం నీరు విడుదలచేసే విధంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు కృషి చేస్తామన్నారు.

అవినీతి, అక్రమ వ్యవహారాలతో ఇప్పటికే దారితప్పిన మెప్మాలో తవ్వేకొద్దీ దారుణాలు వెలుగుచూస్తున్నాయి. పైగా ఉన్నతాధికారి ఇష్టారాజ్యంగా శాఖను భ్రష్టుపట్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన దగ్గర పనిచేసిన ఒక ఉద్యోగి తొలుత కేవలం బ్యాంకు చెక్కులు మాత్రమే ఫోర్జరీ చేశాడని ఫిర్యాదు చేసిన పీడీ తాజాగా మరికొన్ని కేసులు పెట్టి తన చేతివాటాన్ని దాచిపెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అధికారి అవినీతిని ఎవరైనా పసిగట్టారంటే వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం, బెదిరించటం షరా మామూలేనని కార్యాలయంలోని ఇతర ఉద్యోగులు చెబుతున్నారు. పీడీ అవినీతి గురించి అందరికీ తెలిసినా ఎవరు నోరు మెదపకుండా భయం గుప్పిట్లో పనిచేస్తున్నామంటూ కొందరు వాపోతున్నారు. తీగలాగితే డొంక కదిలిన చందంగా మెప్మాలో ఒక్కొక్కటీ వెలుగులోకి రావడంతో కీలకంగా వ్యవహరించి రూ.లక్షలు దోచుకున్న వారిలో కలవరం మొదలైంది.



మెప్మాలో దొంగలు పడ్డారు!

అవినీతి బాగోతాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం

- కంప్యూటర్లు, ట్యాబ్‌లు మాయమంటూ కొత్త కథ
- అర్హులైన సభ్యులకు రుణాల మంజూరుకు బేరసారాలు
- వెలుగులోకి వస్తున్న అధికారి వసూళ్ల పర్వం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో ఉలికిపాటు మొదలైంది. ఒకవైపు బోగస్ గ్రూపులతో అవినీతి తవ్వేకొద్దీ బయటకు వస్తోంది. అందులో ఆర్పీల అవినీతికి అండదండగా నిలిచి, అందినకాడికి దండుకున్న ఆ శాఖ అధికారి ఇప్పుడు ఆ బాగోతాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. రెండు రోజుల క్రితం కార్యాలయంలో పనిచేసే కె.సునీల్ తనకు తెలియకుండా బ్యాంకు చెక్కులపై ఫోర్జరీ చేసి, రూ.4.45 లక్షలు కాజేశాడంటూ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టిన విషయం తెలిసిందే. అయితే తనకేమీ తెలియదని, పీడీ శ్రీహరినే ఆ డబ్బులు డ్రా చేసి తీసుకురమన్నాడని సునీల్ వెల్లడించారు. అయితే చేయని తప్పునకు పీడీ తనపై నిందలు వేస్తున్నాడని గుర్తించిన సునిల్ మరికొన్ని వాస్తవాలు బయటపెట్టడంతో మెప్మాలో గుమ్మడి కాయల దొంగలు కలవరపాటుకు గురవుతున్నారు. అయితే పోలీసుల సమక్షంలో సునిల్ రూ.4.45లక్షలు తిరిగి చెల్లించడంతో ఆయన బెయిల్ మంజూరుకు రంగం సిద్ధమైంది. అయితే సునిల్ వాస్తవాలను బయట పెడు తుండడంతో పీడీ శ్రీహరి కార్యాలయంలో కంప్యూటర్లు మిగతా 6లో...

మెప్మాపై విజిలెన్స్ విచారణ కోరిన ఎమ్మెల్యే దామచర్ల

మెప్మాలో జరిగిన అవినీతి బాగోతాలపై లోతుగా విజిలెన్స్ విచారణ జరిపించాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పట్టణాభివృద్ధి పురపాలక శాఖ మంత్రి పి.నారాయణను కోరారు. గురువారం అమరావతిలో మంత్రిని కలిసిన దామచర్ల గత వైసీపీ హయాంలోనూ, ప్రస్తుతం జరిగిన బోగస్ బాగోతంపై విచారణ జరిపించి, అవినీతికి అడ్డుకట్ట వేయాలని, పొదుపు మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, రుణాలు అర్హులైన వారికే చెందేలాగా ప్రత్యేక దృష్టిసారించాలని మంత్రి నారాయణను దామచర్ల కోరారు.

లైనింగ్ పనులు పునఃప్రారంభం

- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, పూర్వస్థితికి లోపలి రోడ్డు
- మొంథా తుఫాన్ కలిగించిన ఆటంకాలను అధిగమించిన యంత్రాంగం
- తీగలేరు వాగులో కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

ఒంగోలు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టులో కీలకమైన టన్నెల్-2 లైనింగ్ పనులకు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. లైనింగ్ చేసే గాంట్రిమిషన్‌ను గురువారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇక ఆ మిషన్ ద్వారా కోతకు గురై ధ్వంసమైన రోడ్డును కూడా మళ్లీ పూర్వస్థితికి అతికష్టంపై తెచ్చారు. మరోవైపు వరదనీరు ముంచెత్తడానికి ప్రధానకారణమైన తీగలేరు వాగులో అక్రమణల తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ ఇతర పనులు కొనసాగుతున్నాయి. గత నెలలో సంభవించిన మొంథా తుఫాన్ జిల్లాను ముంచెత్తిన విషయం విదితమే. దాని వల్ల జిల్లా అంతటా వరద నీరు రోజులు తరబడి ప్రవహించి ఇక్కట్లు కలిగించగా ఆ సమయంలో వచ్చిన వరదనీరు వెలిగొండ పనులకు కూడా బ్రేక్ వేసింది. ప్రధానంగా టన్నెల్-2లో జరుగుతున్న లైనింగ్ పనులు నిలిచిపోయాయి. టన్నెల్ వెలుపల నుంచి వెలిగొండ రిజర్వాయర్‌కు నీరు వెళ్లే ఫీడర్‌కాలువకు ఎగువన సమాంతరంగా తీగలేరు వాగు ప్రవహిస్తోంది. నల్లమలలో కురిసిన వర్షపు నీరు ఆ వాగు ద్వారా ప్రవహిస్తోంది. ఆ నీరు ఫీడర్ కాలువలను దాటి వెళ్ళేందుకు కాలువ 3.50 కి.మీ. వద్ద అండర్ టన్నెల్‌ను ప్రాజెక్టు అధికారులు నిర్మించారు. మొంథా తుఫాన్ సమయంలో నల్లమలలో భారీ వర్షాలు కురిసి ఒక్కసారిగా పెద్ద వరద రావడం, తీగలేరు వాగు అక్రమణలకు గురికావడం, జంగిల్ కారణంగా ప్రవహం ముందుకు సాగక ఫీడర్ కాలువకు 800 మీటర్ల వద్ద భారీ గండి పడింది. దాని ద్వారా వాగు నీరంతా కాలువలోకి రావడంతో పాటు టన్నెల్‌లోకి పోయింది. టన్నెల్ పోడవు 18.80 కి.మీ. కాగా దాదాపు సగం దూరం వరకు 10 అడుగల ఎత్తుమేర వరదనీరు చేరడంతో లోపల పనులు నిలిచిపోయాయి. ప్రాజెక్టులో ఈ పనులు కీలకం కాగా తక్షణం నీటిని బయటకు పంపి ఆ పనులు త్వరితగతిన పునఃప్రారంభించాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. దీంతో ఇటు అధికారయంత్రాంగం, అటు ఏజెన్సీ నిర్వహకులు పది రోజులకుపైగా శ్రమించి చర్యలు చేపట్టడంతో తిరిగి పనులకు మార్గం సుగమనం అయింది. రెండు మూడు రోజుల క్రితం టన్నెల్‌లో ఉన్న వరదనీటిని బయటకు పంపించగలిగినవారు ఈ రెండు మూడు రోజులుగా లోపలికి పూర్తిస్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ, లోపల వరదనీటి ఉధృతితో కోతకు గురై ధ్వంసమైన రోడ్డు పనులపై దృష్టి సారించారు. అలా చర్యలు చేపట్టి టన్నెల్ లోపల లైనింగ్ చేసే గ్యాంట్రి మిషన్-1కు గురువారం మధ్యాహ్నాంకు విద్యుత్ పునరుద్ధరించారు. ధ్వంసమైన రోడ్డును కూడా పూర్వస్థితికి తీసుకవచ్చారు. దీంతో ఆ రోడ్డు ద్వారా యథావిధిగా బయట నుంచి మెటీరియల్ తీసుకెళ్ళే అవకాశం ఏర్పడగా గ్యాంట్రి ద్వారా లైనింగ్ పని తిరిగి ప్రారంభించడానికి వీలు కలిగింది. తదనుగుణంగా లైనింగ్ పనులు పునఃప్రారంభించినట్లు ప్రాజెక్టు ఎస్ఈ అబుత్ సలీం తెలిపారు. పెద్ద స్థాయిలో వరద నీరు ముంచెత్తడానికి ప్రధాన కారణం తీగలేరు వాగులో అక్రమణలు, అడవులలో వలే పెరిగిన చిల్లచెట్లుగా మంత్రి నిమ్మల సందర్శన సమయంలో గుర్తించారు. దీంతో ఆ వాగులో కూడా జంగిల్ తొలగింపుతో పాటు ఆ అక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని మంత్రి రామానాయుడు అధికారులను ఆదేశించారు. దీంతో ఆ పనులపైనా అధికారులు దృష్టిసారించారు. పలుచోట్ల వాగు అక్రమణలకు గురికాగా అధికంగా అక్రమణకు గురై వాగు వెడల్పు తగ్గి ఉన్న ప్రాంతంపై తొలుత దృష్టి సారించారు. డ్రోన్ సర్వే నిర్వహించి అక్రమణలు తొలగింపు పనులు చేపట్టగా అవి కొనసాగుతున్నాయి.



టన్నెల్2లోని లోపలిభాగంలో పూర్వస్థితికి వచ్చిన రోడ్డు

స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి

- ఫోన్ నెంబర్ల ద్వారా అడ్రసులు సేకరిస్తున్న వైనం
- కొంత మంది ఇతర ప్రాంతాల్లో ఉన్నామంటూ సమాధానం
- ఇంకా ఇవ్వాల్సిన 59వేలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్మార్ట్‌కార్డుల పంపిణీని ఈనెలఖరులోపు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ పంపిణీలో పారదర్శకతను పాటించేందుకు నూతన విధానాలను అమలులోకి తెచ్చింది. పాత కార్డుల స్థానంలో స్మార్ట్ రైస్ మిగతా 6లో...



ఫీడర్ కాలువ పనులకు సన్నాహాలు

- మొత్తం 21.60 కి.మీ. లైనింగ్
- మూడుచోట్ల 5.60 కి.మీ. గోడల నిర్మాణం
- ఈ పనులకు రూ.476 కోట్లు మంజూరు
- రూ.375 కోట్ల పనులకు టెండర్లు ఖరారు
- అధికారుల నుంచి అంగీకారపత్రం పొంది సర్వే చేపట్టిన ఏజెన్సీ
- త్వరలో భూమిపూజ... అనంతరం పనుల ప్రారంభానికి సన్నాహాలు



ఫీడర్ కాలువ కట్టపై మిషన్లతో జంగిల్ క్లియరెన్స్ పనులు

ఒంగోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వచ్చేఏడాది వెలిగొండ తొలిదశ పూర్తి చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పెండింగ్ పనులు ముందుకు సాగుతున్నాయి. అందులో అత్యంత కీలకంగా భావిస్తున్న ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అందుకు అవసరమైన సన్నాహాలను ఇటు ప్రాజెక్టు అధికారులు, అటు ఏజెన్సీల వారు చేపడుతున్నారు. ఈ పనులకు రూ.476 కోట్లు మంజూరు చేస్తూ ఈ ఏడాది సెప్టెంబరు 22న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రెండు నెలల వ్యవధిలోనే ఆ పనుల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో భూమిపూజ చేసి పనులు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15లక్షల మందికి తాగునీటి సరఫరా లక్ష్యంగా చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టుకు 10.50 టీఎంసీల డెడ్ స్టోరేజీ, 43 టీఎంసీల నీటి సరఫరా వెరసి 53.50 టీఎంసీల సామర్థ్యం ఉన్న నల్లమల సాగర్ (రిజర్వాయర్) నిర్మాణం చేశారు. మార్కాపురానికి పశ్చిమాన పెద్దారవీడు మండలం గొట్టిపడియ, సంకేసుల గ్రామాల కొండల మధ్య, అర్ధవీడు మండలం కాకర్ల సమీపంలోని కొండల వద్ద అలా మొత్తం మూడు చోట్ల గ్యాపులలో డ్యామ్‌ల నిర్మాణం ద్వారా భారీ రిజర్వాయర్ పూర్తి చేశారు. ఆ రిజర్వాయర్‌కు శ్రీశైలం ఎగువ భాగంలోని కొల్లంవాగు ప్రాంతం నుంచి కృష్ణానది నీటిని తరలించాలి. అందుకోసం కొల్లంవాగు నుంచి దోర్నాల మండలం కొత్తూరు వరకు 18.80 కి.మీ. దూరం ఉండే 9.20 మీటర్లతో ఒకటి, ఏడు మీటర్ల వ్యాసంతో మరోకటి చొప్పున రెండు టన్నెళ్లను తవ్వారు. ఆ టన్నెళ్ళ నుంచి కొత్తూరు వద్ద బయటకు వచ్చేనీరు దాదాపు 21.60 కి.మీ. దూరంలో ఉన్న నల్లమల సాగర్‌కు ఫీడర్‌కాలువ ద్వారా ప్రవహిస్తుంది. ఆ ప్రాంతంలోని కొండల అంచున సుమారు రూ.105 కోట్ల వ్యయంతో దాదాపు 15 ఏళ్ళ క్రితం ఫీడర్ కాలువను తవ్వారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు పూర్తి కాక, నీరు రాకపోగా పలుసార్లు కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావం, వాడకం లేకపోవడం వల్ల ఆ కాలువ అంతా ధ్వంసమైంది. అనేక చోట్ల గండ్లు పడ్డాయి. మట్టికట్టలు కొట్టుకుపోయాయి. కొన్నిచోట్ల పైకి కట్టలు కనిపిస్తున్నా అంతర్గతంగా భారీగా రంధ్రాలు పడ్డాయి. దీంతో మిగతా 6లో...

ఎస్ఎస్ఏ ఏపీసీగా అనిల్‌కుమార్



ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా (ఏపీసీ) ఉదయగిరి ప్రభుత్వడిగ్రీ కళాశాలలో బోటని అధ్యాపకులుగా పనిచేస్తున్న డి.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఆ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడున్నర సంవత్సరాల తర్వాత రెగ్యూలర్ ఏపీసీ నియమితులయ్యారు. 2021 డిసెంబరు నుంచి 2022 జూలై వరకు ఏపీసీగా బి.శ్రీనివాసరావు పనిచేసిన తర్వాత ఇప్పటి వరకు డీఈవోలు ఏపీసీలుగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఏపీసీగా నియమితులైన అనిల్‌కుమార్‌ను ఏడాది పాటు పొరుగు సేవల నిబంధనల మిగతా 6లో...

జిల్లా కోర్టు పీపీగా అజయ్‌బాబు



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా మొలకలపల్లి అజయ్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెంకు చెందిన అజయ్‌బాబు పదవ తరగతి వరకు ఒంగోలు మునిసిపల్ హైస్కూలులో చదవగా ఇంటర్, డిగ్రీ మంగమ్మ కళాశాలలో చదువుకున్నారు. లా డిగ్రీని నెల్లూరు వీఆర్ కాలేజీలో పూర్తిచేశారు. అజయ్‌కుమార్ గతంలో ఏజీపీగా, జీపీగా పనిచేశారు.

మార్ట్ మూతపడే వరకు మెక్కారు!

- మహిళ మార్ట్ మూతపై మూడోసారి విచారణ

7

పెద్దగోగులపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

7

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్టు

హైదరాబాద్ వాసిపై రెండు రాష్ట్రాల్లో 32 కేసులు

7

నయన మనోహరం.. కార్తీక నర్తనం

నృత్యాలతో అలరించిన చిన్నారులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల చిన్నారి మొదలు దాదాపు 50 మంది చిన్నారులు గురువారం రాత్రి ప్రదర్శించిన కార్తీక నర్తనం కార్యక్రమం నయన మనోహరంగా సాగింది. కార్తీక మాసం ముగింపు సందర్భంగా స్థానిక కేశవస్వామిపేట శ్రీ గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో చందూ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఈ కార్తీక నర్తనం కార్యక్రమాన్ని ప్రదర్శించారు. అనేక భక్తిగీతాలకు తాళలయబద్ధంగా వారు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేసింది. ముందుగా జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో విఘ్నేశ్వర ప్రార్థన, గణపతికేత్వం, శివతాండవం, ఆనంద తాండవం, భవమృడహర కీర్తన వంటి దాదాపు 30 భక్తిగీతాలకు చిన్నారులు శ్రీశంతన, యశస్విని, అంకిత, మౌనిక, పి.యశస్వి, గాయత్రి, మిధిల, స్పందన, శరణ్య, రాజశ్రీ తదితర 50 మంది చిన్నారులు నృత్యాలను ప్రదర్శించారు. డాన్స్ అకాడమీ శిక్షకులు త్రోవగుంట చందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల బాలకోటయ్య, అనూషాలు నిర్వాహకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్.శివశంకర్, తూము సుబ్బారావు తదితరులు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు కళలపట్ల ఆసక్తిని తల్లిదండ్రులు పెంపొందించాలని, అప్పుడే వారు భవిష్యత్‌లో మంచి కళాకారులుగా తయారవుతారని, వందలాది మంది చిన్నారులకు గత మూడు దశాబ్దాలుగా నృత్యంలో శిక్షణనిస్తున్న చందూ మాస్టర్ కృషి అభినందనీయమని అన్నారు.





అలరించిన చిన్నారుల నృత్యం

21 నుంచి అక్రిడిటేషన్‌లకు దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు రెండేళ్ల(2026-27) కాలపరిమితికి సమాచార పౌరసంబంధాల శాఖ జారీచేసే నూతన అక్రిడిటేషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు అర్హత కలిగిన జర్నలిస్టులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ ఏడాది నవంబరు 30 నాటికి ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపట్టామన్నారు. జిల్లా నుంచి ప్రచురితమవుతున్న ప్రింట్ మీడియా, జిల్లా నుంచి ప్రసారమవుతున్న ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపర్చాల్సి ఉన్నందున సంబంధిత పత్రాలను పెన్‌డ్రైవ్‌లో పొందుపర్చడంతో పాటు జెరాక్స్‌కాపీలను కూడా సమాచార శాఖ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఈనెల 21 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రామరాజ్యం పేరుతో రాక్షస పాలన సాగిస్తుందని ఆరోపించారు. ప్రతి రోజు మావోయిస్టులను దారుణంగా కాల్చిచంపడమే పనిగా పెట్టుకుందన్నారు. ఆయుధాలు ఉన్నాయనే పేరుతో కేంద్ర బలగాలు అమాయకులైన గిరిజన ప్రజలను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాము చర్చలకు సిద్ధమని ఒక పక్కా వారు ప్రకటనలు చేస్తున్నా కేంద్రప్రభుత్వం మారణకాండను కొనసాగిస్తూనే ఉందని రామకృష్ణ మండిపడ్డారు. గిరిపుత్రులను చర్చలకు పిలిచి వారి సమస్యలపై చర్చించి వాటికి పరిష్కార మార్గం చూపాల్సిన ఉండగా, అందుకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు పూర్తిస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఒక హంతక ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వాదులందరూ ఈ ఘటనలను ఖండించాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎన్‌కౌంటర్లను ఖండించే వారిపై కూడా కేసులు ఉంటాయని, తమ నెక్స్ట్ టార్గెట్ అర్బన్ మావోయిస్టులని పేర్కొనడం దుర్మార్గంగా ఉందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, ఎంఏ సలార్‌లు పాల్గొన్నారు.

మెప్మాలో దొంగలు పడ్డారు!

(5వ పేజీ తరువాయి)

మాయమయ్యాయంటూ కొత్త కథ అల్లినట్లు విమర్శలున్నాయి. దీంతో మెప్మాలో అసలు ఏం జరుగుతుంది? అని అందరూ చర్చించుకుంటున్నారు. ఒకొక్కటిగా అక్రమాలు బయటకు వస్తుండటంతో వాటన్నిటిలోనూ కీలకంగా వ్యవహరించి, విచారణ పేరుతో భారీగా బొక్కేసిన పీడీ ఇప్పుడు 'కార్యాలయంలో వస్తువులు కనిపించడం లేదు. ఫైళ్లు కనిపించడం లేదు. కంప్యూటర్లు పోయాయి. అవన్నీ సునీల్ తీశాడు' అంటూ మరో కేసు నమోదు చేయాలంటూ గురువారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకోవడంతో ఆ శాఖలో కలకలం నెలకొంది.

రుణాల మంజూరుకు పీడీ బేరసారాలు

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం వివిధ రుణాలు మంజూరు చేసి, వారికి తోడ్పాటు అందిస్తుండగా, అవి మాత్రం వారికి చేరడం లేదు. నగరంలోని పలు పొదుపు సంఘాల వారు తమకు రుణాలు మంజూరుచేయాలని దరఖాస్తు చేసుకోగా వారి దరఖాస్తులను కొందరు ఆర్పీలను కోరగా, రుణాల మంజూరు కోసం ఆన్‌లైన్ రిక్వెస్ట్ పెట్టుకున్నారు. అయితే రుణాల మంజూరు అనుమతివ్వాలంటే తన వాటా ఎంతో చెప్పాలని పీడీ నెలరోజులుగా జాప్యం చేస్తున్నారని కొందరు ఆర్పీలు వెల్లడిస్తున్నారు. అందిన సమాచారం మేరకు గురువారం నాటికి ఒక్క ఒంగోలులోనే 40కిపైగా ఒరిజినల్ గ్రూపులకు రుణాలకు అనుమతులు ఇవ్వకుండా కొర్రీలు వేస్తున్న అధికారి బోగస్ రుణాల వ్యవహారంలో ఆగమేఘాలపై దృష్టిసారించడం, అవినీతి ఆర్పీలకు అండదండలు అందిస్తున్నట్లు కొందరు బహిరంగంగానే వెల్లడిస్తున్నారు. నెలరోజులుగా పీడీ లాగిన్‌లో రుణాల మంజూరుకు అనుమతులు ఇవ్వకుండా నిలిపివేయడంతో అర్హులైన పొదుపు సభ్యులు రుణాల కోసం ఎదురు చూస్తున్నారు.

మార్కాపురంలో ఆర్పీల నుంచి వసూలు

మార్కాపురం మెప్మా కార్యాలయంలో గత వైసీపీ హయాంలో ఆర్పీలుగా ఉన్న కొందరు బోగస్ గ్రూపులు సృష్టించి భారీగా దోచేయడంతో పన్నెండు మందిని గత ఎన్నికల సమయంలో తొలగించారు. అయితే వారికి తిరిగి లాగిన్‌లు ఇస్తామని వారి వద్ద నుంచి పీడీ రూ.2.40 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఏడాది కాలంగా వారికి లాగిన్‌లు ఇవ్వకుండా అనధికారంగా ఆర్పీలుగా కొనసాగేందుకు పీడీ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని అక్కడి పొదుపు సభ్యులు వాపోతున్నారు. తొలగించిన ఆర్పీలతోనే విధులకు అనుమతులు ఇవ్వడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చీమకుర్తిలోనూ చేతివాటం

చీమకుర్తిలో మెప్మాలోనూ అవినీతి బాగోతాలు జరిగినట్లు సమాచారం. వీధి వ్యాపారులు, హోటల్స్‌లో పనిచేసే రోజువారీ కార్మికులను ఆసరాగా చేసుకుని వారికి జన్‌ధన్ అకౌంట్లు ఓపెన్ చేయడం ద్వారా రుణాలు ఇప్పిస్తామని చెప్పి వారి ఆధార్ కార్డుల ఆధారంగా బ్యాంకులను బురిడీ కొట్టించి సుమారుగా రూ.60లక్షల వరకు స్వాహా చేసినట్లు సమాచారం. అక్కడ పనిచేసే ఓ మహిళ కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో)కు పీడీ అండదండలు పుష్కలంగా ఉండటంతో సీవో, పీడీ వాటాలు పంచుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఒంగోలులోనూ పలువురు ఆర్పీల నుంచి భారీగానే వసూలు చేసిన పీడీ విచారణ పేరుతో కాలయాపన చేశారు. దీంతో మరి కొన్ని బోగస్ గ్రూపులు కొత్తగా తయారుకావడం ఇపుడు చర్చనీయాంశమైంది. అయితే చేతివాటం, వసూళ్ల పర్వం ఒకొక్కటిగా వెలుగులోకి రావడంతో ఉలికిపాటుకు గురైన పీడీ దానిని కప్పిపుచ్చుకునేందుకు కార్యాలయంలోని కొందరు సిబ్బందిని భయపెట్టి, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆందోళన వెల్లడిస్తున్నారు.

ఫీడర్ కాలువ పనులకు సన్నాహాలు


(5వ పేజీ తరువాయి)

టన్నెళ్ల నుంచి నీటిని బయటకు ఇస్తే ఆ నీరు రిజర్వాయర్‌కు చేరే అవకాశం లేదన్న విషయాన్ని గత ఏడాది అక్టోబరులో ఆ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి నిర్మల రామానాయుడు నేతృత్వంలో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి అధికారులు తెచ్చారు. దీంతో మంత్రి ఆదేశాలతో నిపుణుల బృందాలు పలుమార్లు సందర్శించి అధ్యయనం చేసి చివరకు ఫీడర్ కాలువను ఆధునీకీకరించాలని సిఫార్సు చేశారు. వచ్చే ఏడాది ఆగస్టుకు తొలిదశ పూర్తి చేసి నీరివ్వాలన్న కృతనిశ్చయంతో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ఈ పనులకు ఆమోదం తెలిపి తదనుగుణ చర్యలకు మూడు నెలల క్రితం ఉన్నత స్థాయి సమీక్షలో ఆదేశాలు ఇచ్చారు. దాని ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరు 22న జలవనరులశాఖ ఉన్నతాధికారులు ఫీడర్‌కాలువ ఆధునికీకరణకు రూ.476 కోట్లతో మంజూరు ఉత్తర్వులు ఇచ్చారు. మొత్తం 21.60 కి.మీ. ఫీడర్ కాలువ అడుగు భాగంలో 30 మీటర్ల వెడల్పు, ఇరువైపులా ఏడు మీటర్ల వంతున ఏటవాలుగా లైనింగ్‌తో పాటు గండ్లుపడిన మూడుచోట్ల ఇరువైపులా కలిపి సుమారు 5.60 కి.మీ. కాంక్రీటు గోడలు నిర్మాణం ఈపనులలో ఉన్నాయి. సాధారణంగా ప్రభుత్వం మంజూరు ఉత్తర్వులు ఇచ్చినతర్వాత ఆరు మాసాల నుంచి ఏడాదిలోపు పనులు ప్రారంభిస్తే త్వరగా చేపట్టినట్లు లెక్క. అయితే అందుకు భిన్నంగా ఫీడర్ కాలువ పనులు తక్షణం చేపట్టేలా ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగంచర్యలు చేపట్టింది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.476 కోట్లలో జీఎస్టీ, ఇతర వ్యయాలు పోను రూ.375 కోట్లతో అక్టోబరులో టెండర్లు పిలిచారు. రెండు ప్రధాన కంపెనీలు టెండర్లు దాఖలు చేయగా నిర్మాణ రంగంలో అనుభవం ఉన్న ఎంవీఎల్‌కంపెనీ జాయింట్ వెంచర్‌తో 4.60 శాతం అధిక బిడ్‌తో పనులు దక్కించుకుంది. అన్ని పరిశీలనల అనంతరం సదరు కంపెనీకి పనులకు అప్పగించేందుకు అంగీకారం తెలిపారు. ఆమేరకు వారం క్రితం ఆ కంపెనీకి లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ (అంగీకార పత్రం) అధికారులు ఇచ్చారు. తక్షణం పనులు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఇలా అంగీకార పత్రం ఇచ్చాక టెండర్ అగ్రిమెంట్ ఇటు అధికారులకు, అటు ఏజెన్సీకి మధ్య జరగాలి. కీలకమైన పనులు కనుక ప్రభుత్వ పెద్దల సమక్షంలో భూమిపూజ వంటి కార్యక్రమాలు కూడా ఉంటాయి. అయితే ఆ ప్రక్రియ కొనసాగే లోపుగానే ప్రాథమిక చర్యలు తీసుకోవాలన్న అధికారుల సూచనతో ఏజెన్సీ సంబంధిత పనులపై దృష్టి సారించింది. రెండు రోజులుగా ఫీడర్‌కాలువపై ఉన్న జంగిల్ క్లియరెన్స్‌తో పాటు రాకపోకలకు వీలుగా కట్టలు చదును చేసే పనులు చేపట్టారు. ఎన్ని భాగాలుగా ఏకకాలంలో పనులు చేసే అవకాశాలు ఉన్నాయి? ఎక్కడెక్కడ నుంచి విభాగాల వారీ పనులు చేయవచ్చు? ప్రస్తుతం ఫీడర్ కాలువ పరిస్థితి ఎక్కడ ఎలా ఉంది? తదితర అంశాలపై సర్వే చేస్తున్నారు. త్వరలో ఈ పనులు చేపట్టి సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రాజెక్టుల ఎస్ఈ అబుత్ సలీం చెప్పారు.

అగ్రహారం భూములకు అన్నదాత సుఖీభవ

- ఒకేసారి రైతుల ఖాతాల్లో రూ.10వేలు జమ
- ప్రభుత్వ పెద్దల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన రైతులు

బల్లికురవ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాసు పుస్తకాలు లేకుండా అగ్రహార భూములు సాగు చేస్తున్న రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తూ, రైతుల ఖాతాల్లో నగదు గురువారం ఉదయం నుంచి జమ చేస్తోంది. బల్లికురవ మండలం ముక్తేశ్వరం, చెన్నుపల్లి, భూషాయవారిపాలెం, మక్కెనవారిపాలెం, కొండాయ పాలెం, కొత్తపాలెం గ్రామాల పరిధిలో 880 మంది రైతులు సుమారు 5 వేల ఎకరాల అగ్రహార భూముల ను దశాబ్దాల నుంచి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం మెదట్లో పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించింది. దీంతో రైతులు తమ సమస్యను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. తమకు గతంలో కూడా పెట్టుబడి సాయం ఇచ్చారని వారు అయన దృష్టికి తీసుకుపోయారు.. దీంతో వెంటనే మంత్రి రవికుమార్ కలెక్టర్‌తో మాట్లాడి రైతుల సమస్యను వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం వెంటనే గతంలో అందించిన ఒక విడత ఇప్పుడు అందిస్తున్న రెండో విడత సాయం మొత్తం కలిపి 880 మంది రైతులకు పది వేల చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాలో గురువారం నుంచి నగదు జమచేస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్యను సత్వరమే పరిష్కరించేలా కృషి చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఆరు గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పీఎం కిసాన్ పథకాన్ని కూడా ఆరు గ్రామాల రైతులకు వర్తించేలా ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరుతున్నారు.



డిప్యూటీ సీఎం, మంత్రి రవికుమార్, సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అగ్రహార భూములు సాగుచేస్తున్న రైతులకు కూడా పెట్టుబడిసాయం అందించడంతో గురువారం సాయంత్రం మండలంలోని చెన్నుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రెండు విడతల సాయం ఒకేసారి రూ. 10 వేలు తమకు అందిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి శంకర్, కొండేటి ఇజ్రాయల్, అట్లూరి నాగేశ్వరరావు, గొట్టిపాటి కిషోర్, మండల తెలుగు యువత నాయకులు గంగవరపు కాశీరావు, యాగంటి శ్రీనివాసరావు, దివ్వె రామాంజనేయులు, వెంకట్రావు, గోవిందు, వీరయ్య పాల్గొన్నారు.

చాకుతో పొడిచి గిరిజనుడి హత్య

అవీఇవీ



అంకన్న మృతదేహం

పెద్దదోర్నాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లాడున్న తల్లికి సారా ఎందుకు పోస్తున్నావని అడిగినందుకు చాకుతో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని పెద్దమంతనాల గిరిజనగూడెంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పెద్దమంతనాలకు చెందిన అర్తి నాగన్న అతని అన్న కొడుకైన అర్తి అంకన్న(27)ను చాకుతో పొడవగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అర్తి అంకన్న, అతని తండ్రి రామారావు హనుమాన్ జంక్షన్‌కు వెళ్లి దోమతెర కర్రలు అమ్ముకుని సాయంత్రం ఇంటికి చేరే సరికి అతని అంకన్న భార్య దేవమ్మకు నాగన్న సారా తాగాలని గ్లాసులో పోస్తుండడం అంకన్న చూశాడు. నెలల పిల్లాడితో ఉన్న తన భార్యకు సారా ఎందుకు పోస్తున్నావని నాగన్నను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఘర్షణ పెద్దది కావడంతో నాగన్న విల్లంబుతో దాడి చేయబోగా అంకన్న అంబును విరిచేశాడు. అంతటితో ఆగక తన వద్ద ఉన్న చాకుతో అంకన్న గుండెపై బలంగా పొడవడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. నాగన్న అక్కడ నుంచి పారిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వైద్య చికిత్స నిమిత్తం ఆటోలో దోర్నాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో దోర్నాల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. హత్య విషయం తెలియడంతో మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఎర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్ వైద్యశాలలోని మృతదేహాన్ని పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 14, 17 కబడ్డీ పోటీలలో విద్యార్థులు వి.మహేష్, ఎం.అజయ్ అండర్ 14కు, ఎం.జశ్వంత్ నాయక్, పి.అజయ్, ఎం.వి.రాజశేఖర్ రెడ్డిలు అండర్ 17జట్టుకు ఎంపికై మచిలీపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ఆడతారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.దామోదర్‌రెడ్డి, డి.శ్యామలాదేవి, కె.ఓబులేశును అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గజ్జలకొండ విద్యార్థులు

మార్కాపురం రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని గజ్జలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్యామ్‌శుభాకర్ గురువారం తెలిపారు. విద్యార్థులు ఎం.రుబాస్, జి.అభిలాష్, అండర్-14లో, సూర్యతేజ అండర్-17లో ప్రకాశం జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. మచిలీపట్నంలో జరగబోయే అండర్-14, కర్నూలులో జరిగే అండర్-17 కబడ్డీ పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజారపు అచ్చయ్యను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏపీసీగా అనిల్‌కుమార్

(5వ పేజీ తరువాయి)

కింద డిప్యూటేషన్‌పై పంపారు. ఏపీసీగా అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన ఒంగోలు సమీపంలోని కొప్పోలు నివాసి. 2014లో ఏపీపీఎస్సీ ద్వారా డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా ఎంపికై మొదట ఒంగోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేశారు. అకడమిక్‌గా అనిల్‌కుమార్‌కు మంచి ట్రాక్ రికార్డు ఉంది. తన 12 ఏళ్ల సర్వీసులో ఆరు పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. 8 పేటెంట్ల ఘనత ఆయనదే. ప్రభుత్వ అటానమస్ కళాశాలల క్వశ్చన్ పేపర్ సెట్టరుగా పనిచేశారు. 60కిపైగా జాతీయ, అంతర్జాతీయస్థాయి సెమినార్‌లు, వర్క్‌షాపుల్లో పాల్గొన్న ఘనత అనిల్‌కుమార్‌కు ఉంది.

స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది, గత నెల జిల్లాకు 6,51,820 స్మార్ట్ రైస్ కార్డులు రాగా ఆ కార్డులను మండల కేంద్రాలకు పంపి అక్కడి నుంచి డీలర్లకు సరఫరా చేశారు. డీలర్ల ద్వారా ఆ స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు సుమారు 5.91 లక్షల స్మార్ట్ కార్డులు పంపిణీ చేయగా మరో 59వేల స్మార్ట్‌కార్డులు పంపిణీ జరగలేదు. ఇప్పటికే ఆయా రేషన్‌షాపుల వారీగా జారీచేసిన స్మార్ట్ కార్డుల ఆధారంగా వారి అడ్రసు, ఫోన్ నెంబర్లను సేకరించే పనిలో పడ్డారు. అయితే గత వారం రోజుల్లో అలా సుమారు 4వేల మందిని గుర్తించి వారికి స్మార్ట్ కార్డులు అందజేయగా మరో 59వేల స్మార్ట్‌కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా ఈనెలాఖరులోపు పంపిణీ చేసేందుకు ఆశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. డీలర్ల ద్వారా వారి అడ్రసు, ఫోన్ నెంబర్లు సేకరించి ఫోన్లు చేసేపనిలో పడ్డారు. కొంతమంది ఫోన్‌లో అందుబాటులోకి వచ్చినా తాము మరో చోట ఉంటున్నామని, తాము అక్కడికి వచ్చాక స్మార్ట్ కార్డులు తీసుకుంటామని సమాధానం ఇస్తుండగా మరికొంత మంది సమాచారం లభించడం లేదు. మరోవైపు రేషన్ కార్డు ఒకచోట ఉండి మరోకచోట నివాసం ఉండటంతో తమ స్మార్ట్‌కార్డు ఎక్కడ ఉందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అటువంటి వారికి కూడా సమాచారం అందించి స్మార్ట్ కార్డు ఏ డీలర్ వద్ద ఉందో గుర్తించి అక్కడికి పంపుతున్నారు. ప్రభుత్వం ఈనెలాఖరులోపు స్మార్ట్ కార్డుల పంపిణీని పూర్తి చేయాలని అదేశించడంతో తదనుగుణంగా పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

బ్లేడుతో దాడిచేసిన వ్యక్తిపై కేసు

మార్టూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): బ్లేడుతో దాడిచేసిన వ్యక్తిపై మార్టూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వలపర్ల గ్రామంలో తన్నీరు అంకమ్మరావు అనే వ్యక్తి బ్లేడుతో కుంచాల ఆంజనేయులు అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరిచాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం అంకమ్మరావు మద్యం సేవించి, తనతో సక్రమంగా మాట్లాడడంలేదని బ్లేడుతో ఆంజనేయులు గడ్డంపై, ఛాతీపై గాయపరచారు. ఈ మేరకు ఆంజనేయులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. దీంతో ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం ఆదారంగా, ఆంజనేయులు ఫిర్యాదు మేరకు గురువారం అంకమ్మరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాషా తెలిపారు.

రెస్టారెంట్ల నిర్వాహకులకు 31 నోటీసులు

పంగులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంగులూరులో అనుమతి లేకుండా రెస్టారెంట్లు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులకు ఫుడ్‌సేఫ్టీ అధికారులు 31 నోటీసులు జారీ చేశారు. చీరాల డివిజన్ ఫుడ్ సేఫ్టీ అధికారి పి.ప్రణీత్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పంగులూరులోని రెస్టారెంట్లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. రెస్టారెంట్లలోని వంటశాల, అందులోని వంటపాత్రలు, ఫ్రిజ్‌లో నిల్వఉంచిన పెరుగుతో పాటు ఇతర తినుబండారాల తయారీకి వినియోగించే పదార్థాలను తనిఖీ చేశారు. రెస్టారెంట్లలో పరిశుభ్రత లేదని, ఈగలు, దోమలు గుర్తించామన్నారు. పరిశుభ్రతలేని ప్రదేశాలలో రెస్టారెంట్లు నిర్వహించడం నేరమని చెప్పారు. రెస్టారెంట్ల నిర్వహణకు 14 రోజుల్లో లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకుని లైసెన్స్ లు పొందాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరివెంట డీసీఎంఐ. బాపట్ల ఇన్‌చార్జ్ డీ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

సిగరెట్ బయట కాల్చమన్నందుకు పిడిగుద్దులు

మద్యం మత్తులో హోంగార్డులు డిష్యుం.. డిష్యుం

ఒంగోలు క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : సాగర్ కవచ్ విధులకు వచ్చిన హోంగార్డులు పూటుగా మద్యం సేవించి ముష్టియుద్ధానికి పాల్పడ్డారు. పశ్చిమ ప్రాంతానికి చెందిన ముగ్గురు హోంగార్డులు సాగర్ కవచ్ విధులలో పాల్గొనేందుకు బుధవారం ఒంగోలు వచ్చారు. స్థానిక అన్నపూర్ణ లాడ్జిలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. కనిగిరిలో పనిచేస్తున్న బాలసుబ్రమణ్యం, దోర్నాలకు చెందిన ప్రశాంత్, పెద్దారవీడుకు చెందిన ఎస్కే యాసిన్‌లు రాత్రి ఒకే గదిలో ఉండి పూటుగా మద్యం తాగారు. ప్రశాంత్ అక్కడే సిగరెట్ కాల్చగా బాలసుబ్రమణ్యం అడ్డు చెప్పాడు. సిగిరెట్ బయట తాగాలని గట్టిగా సూచించాడు. దీంతో ఇరువురు మధ్య మాటామాటా పెరిగింది. ప్రశాంత్ బాలసుబ్రమణ్యంపై దాడికి దిగి పిడిగుద్దులు కురిపించాడు. దీంతో బాలసుబ్రమణ్యం అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. ప్రశాంత్‌ను ఒంగోలు తాలూకా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలం పెద్దగోగులపల్లి పంచాయతీ కార్యదర్శి కే జగన్మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజాబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కురిచేడు మండలం వెస్టు వీరాయపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో జగన్మోహన్‌రెడ్డి అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై కనిగిరి డీఎల్‌పీవో విచారణాధికారిగా నియమించారు. ఈ విచారణలో రూ.13,39,810లకు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆ మేరకు జిల్లా పంచాయతీ అధికారికి నివేదికను సమర్పించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిధులను దుర్వినియోగం చేయడంతో జగన్మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన టీచర్లకు సెలవులు మంజూరు

ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన కొత్త టీచర్లకు సెలవులు మంజూరు చేస్తూ పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ సెలవుల నిబంధనల ప్రకారం పాఠశాల విద్యలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, టీచర్లకు 15 సాధారణ సెలవులు, ఐదు ఆప్షనల్ సెలవులు ఏడు ప్రత్యేక సెలవులు అందరికీ వర్తిస్తాయి. మహిళలకు ప్రత్యేకంగా ఐదు ప్రత్యేక సాధారణ సెలవులు ఉన్నాయి. కొత్త టీచర్లు అక్టోబరు 3న విధుల్లో చేరినందున వారికి దామాషా ప్రకారం ఏడు సెలవులు పురుషులకు, ఎనిమిది సెలవులు మహిళా టీచర్లకు వర్తిస్తాయి. 15 సాధారణ సెలవుల్లో నాలుగు, ఆప్షనల్ సెలవుల్లో ఒకటి, ప్రత్యేక సెలవు దినాల్లో రెండు, మహిళా టీచర్లకు ప్రత్యేక సాధారణ సెలవు ఒకటి వర్తిస్తుందని కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2024-25 క్యాలెండర్ సంవత్సరానికి ఈ సెలవులు మాత్రమే కొత్త టీచర్లు వినియోగించాలని కమిషనర్ తెలిపారు. ఈ విషయంలో ఆర్‌జేడీ, డీఈవోలు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యాశాఖలో వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత

అధికారులు.. టీచర్లకు అందుబాటులో ఉండాలని ఆదేశం

ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు ప్రతి పనిదినం రోజు సాయంత్రం తమ కార్యాలయాల్లో ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. వారి సమస్యలపై క్షేత్ర స్థాయిలో అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలన్నారు. సమర్థవంతమైన పరిపాలన, జవాబుదారీతనం పెంపొందించి మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. మండల విద్యాధికారులు సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు, జిల్లా విద్యాధికారులు సాయంత్రం 5గంటల నుంచి ఆరు గంటల వరకు తమ కార్యాలయాల్లో ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి వారి నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

చిన్నకండ్లేరు చెరువుకు మరమ్మతులు చేయండి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



చిన్న కండ్లేరు చెరువును పరిశీలిస్తున్న ప్రసాద్

పుల్లలచెరువు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు చిన్న కండ్లేరు చెరువు లీకేజీతో నీరు బయటకు పోతోందని, వెంటనే మరమ్మతులు చేయించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని చిన్నకండ్లేరు చెరువును రైతు సంఘ సభ్యులతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుకు ఎడమగట్టు కాలువ నుంచి నీరు నిరంతరం లీకు అవుతోందని, దీంతో కట్ట బలహీన పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చెరువుకు ఏదైనా ముప్పు వాటిల్లితే సాగు చేసిన పైర్లతో పాటు తెల్లగట్ల గ్రామం కుడా ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. తాజాగా ప్రభుత్వం రూ.1.20కోట్ల పనులకు ఎస్టిమేషన్ వేసి పంపించిందని, వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సీనియరు నాయకులు దేవండ్ల శ్రీనివాస్, మన్నె సాంబశివరావు, బాణాల రామయ్య, సీపీఐ మండల కార్యదర్శి జీవీ గురునాథం, జానకీరఘు, కోటిరెడ్డి, ఈదెమ్మనాయుడు, వెంకటేశ్వర్లు, ఆనందరావు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

పగలు 8 గంటలు కరెంట్ ఇవ్వాలని రైతుల నిరసన

పుల్లలచెరువు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రివేములలో లోవోల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను వెంటనే పరిష్కరించాలని రైతులు గురువారం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ లోవోల్టేజీతో కరెంటు అప్ అండ్ డౌన్‌గా వచ్చి మోటార్లు తిరగడం లేదన్నారు. పగలు 8 గంటలు కరెంటు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ పగలు, రాత్రి కలిపి 7 గంటలకు మించి సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేయింబవళ్లు పొలాల వద్ద పడిగాపులు కాస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించి, పగలు 8 గంటలు కరెంట్ ఇవ్వాలని పట్టుబట్టారు. కార్యక్రమంలో రైతులు వెంకయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, టీ వెంకటరావు, వెంకటేశ్వర్లు, బిసపోగు యాకోబు, లక్ష్మయ్య, వెంకటరావు, వీరాంజనేయులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు



కార్తీక పుణ్యఫలం.. పోలిస్వర్గం

● నేడు పోలిపాడ్యమి ● నీటిలో దీపాలను వదలనున్న మహిళలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసం గురువారంతో ముగిసింది. నెలరోజులుగా జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం పరిఢవిల్లింది. గ్రామాల మొదలు పట్టణాలతోపాటు ఒంగోలు నగరంలోని శివాలయాలలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, నగరోత్సవాలు, జ్వాలాతోరణాలు జరిగాయి. అంతేకాకుండా ఈ కార్తీకమాసంలో భగినీహస్తభోజనం, సుబ్రహ్మణ్య షష్టి మొదలైన అనేక పండుగలను సైతం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

● తెల్లవారుజాము నుంచే...

కార్తీకమాసం అమావాస్యతో ముగిస్తే మరుసటి రోజైన పాడ్యమి నుంచి మార్గశిరమాసం ప్రారంభం అవుతుంది. ఈ పాడ్యమిని పోలిపాడ్యమిగా పిలుస్తారు. ఆరోజు తెల్లవారుజామునే తమ ఇళ్లదగ్గర లేదా వీలైనవారు దగ్గరలోని చెరువులు, నీటిప్రవాహాలలో అరటిడొప్పలలో దీపాలను వెలిగించి పసుపు, కుంకుమలతో పూజించి వదులుతారు. ఇలాచేస్తేతమ జీవితాలలో అలముకున్న చీకట్లు తొలగిపోతాయని నమ్మకం.

● పోలిపాడ్యమిపై సందేహాలు

పోలిపాడ్యమిని ఎప్పుడు జరుపుకోవాలనే దానిపై ప్రజలకు సందేహాలు కలిగాయి. పాడ్యమి తిథి శుక్రవారం రావటంతో ఆరోజు దీపాలను వదలకూడదని, పోలి అంటే ఇంటి ఆడపడుచుతో సమానమని అటువంటి ఆడపడుచును శుక్రవారం సాగనంపకూడదని ప్రచారాలు జరిగాయి.శుక్రవారమా, లేక శనివారం జరుపుకోవాలా అనే సందేహం నెలకొంది. పోలిపాడ్యమి తిథిని బట్టి జరుపుతారని, దీనికి వారంతో సంబంధం లేదని వేదపండితులు చెబుతున్నారు. అమావాస్య గురువారం ఉదయం 10.30 గంటలతో ముగిసి అప్పటి నుంచి పాడ్యమి తిథి వచ్చింది. పాడ్యమి శుక్రవారం మధ్యాహ్నం 12.45 వరకు ఉంటుంది. అంటే శుక్రవారం సూర్యోదయానికే పాడ్యమి ఉందని, ఆరోజే జరుపుకోవాలని పండితులు స్పష్టం చేస్తున్నారు.

● ఒంగోలు మార్కెట్‌లో సందడి

పోలిపాడ్యమి సందర్భంగా అరటిడొప్పలలో దీపాలు వెలిగించనుండటంతో వారు గురువారం సాయంత్రం నుంచి అరటిడొప్పలు, వత్తులు, నూనె, పూలు, పళ్ల మొదలైనవి కొనుగోలు చేయటానికి మహిళలు రావటంతో ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో సందడి నెలకొంది. లాయర్‌పేట, కొత్తపట్నం బస్టాండు, కొత్తమార్కెట్ సెంటర్, పాతమార్కెట్ సెంటర్, ట్రంకురోడ్డు మొదలైన ప్రాంతాలలో మహిళలు పూజాసామన్లు కొనుగోలు చేశారు.

విద్యార్థినుల పట్ల అనుచిత ప్రవర్తన

ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించిన తల్లిదండ్రులు

విచారణ చేపట్టిన ఎంఈవో

కురిచేడు మండలం కల్లూరు ప్రభుత్వ పాఠశాలలో ఘటన



ప్రభుత్వ పాఠశాల

కురిచేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఎక్కడ పనిచేసినా ఆయన వక్రబుద్ధి మారడంలేదు. 2006లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన అతను ఇప్పటికే అసభ్యప్రవర్తనతో రెండుసార్లు, గృహహింస కేసులో ఒకసారి సస్పెండ్ అయ్యారు. వివరాల్లోకళ్తే...

కురిచేడు మండలం కల్లూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు పమిడిపూల సురేష్ అనే ఉపాధ్యాయుడు అద్దంకి మండలం మణికేశ్వరం నుంచి బదిలీపై వచ్చారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు విద్యార్థినులు మాత్రమే ఉండటంతో తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ఆ పాఠశాలను జనరల్ ప్రాథమిక పాఠశాలలో కలిపారు. ఉపాధ్యాయుడు సురేష్ ఈ ఏడాది విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. గురువారం అతని అసభ్య ప్రవర్తనను ఓ విద్యార్థిని తండ్రి గమనించాడు. అతడు తన కుటుంబసభ్యులతో కలిసి వచ్చి ఉపాధ్యాయుడితో ఘర్షణ పడ్డాడు. హెచ్‌ఎం కలుగజేసుకుని విద్యార్థిని తల్లిదండ్రులకు సర్దిచెప్పి బయటకు పంపారు. ఈవిషయం బయటకు పొక్కడంతో కల్లూరు క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడిని ఎంఈవో విచారణకు పంపారు. ఆయన విద్యార్థినులను విచారించగా, వాస్తవమేనని తేలింది. దీంతో ఎంఈవో వస్రాంనాయక్ ఆ ఉపాధ్యాయుడిని తన కార్యాలయానికి పిలిపించి విచారించారు. ఎస్‌ఐ శివ సైతం సదరు ఉపాధ్యాయుడిని పోలీస్ స్టేషన్‌ను పిలిపించి విచారించారు.

మూడుసార్లు సస్పెండ్

ఉపాధ్యాయుడు సురేష్ ఇప్పటికే మూడుసార్లు సస్పెండ్ అయ్యారు. చీరాల మండలం ఈపూరుపాలెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తనతో సస్పెండ్ అయ్యాడు. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలోనూ ఇదే రీతిన సస్పెండ్ అయ్యాడు. అద్దంకి మండలం మణికేశ్వరంలో గృహహింస కేసులో సస్పెండ్ అయ్యారు. అక్కడ నుంచి కురిచేడుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ కూడా తన తీరు మార్చుకోకుండా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి యత్నించారు. ఈవిషయమై ఎంఈవోను వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిందని, విచారిస్తున్నామని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్టు

హైదరాబాద్ వాసిపై రెండు రాష్ట్రాల్లో 32 కేసులు

ఎర్రగొండపాలెం కేసులో అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ అజయ్‌కుమార్

ఎర్రగొండపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీటింగ్ కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ప్రధానమంత్రి నిరుద్యోగ భృతి రుణాలు మంజూరు చేయిస్తానని ఎర్రగొండపాలెం మండలం అయ్యంబొట్లపల్లికి చెందిన మాదాల సూర్యనారాయణను హైదరాబాద్‌కు చెందిన తోట బాలాజీనాయుడు మోసం చేసినట్లు కేసు నమోదైంది. ఎర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగరాజు ఆ కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 7న అయ్యంబొట్లపల్లికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు మాదాల సూర్యనారాయణకు నిందితుడు తోట బాలాజీనాయుడు ఫోన్‌చేసి తన పేరు సంజయ్‌కుమార్ అని, మీ మండలానికి ప్రధానమంత్రి నిరుద్యోగభృతి రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. తాను విజయవాడ నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పి నమ్మకం కలిగించాడు. దీంతో ఆయన చెప్పిన విధంగా సూర్యనారాయణ రూ.1,29,000ని బాలాజీనాయుడు చెప్పిన అకౌంట్‌కు జమ చేశారు. ఆ తర్వాత మోసపోయినట్లు గ్రహించిన సూర్యనారాయణ మిగిలిన నగదును నేరుగా ముట్టజెబుతానని చెప్పాడు. దీంతో బాలాజీనాయుడు గురువారం ఎర్రగొండపాలెం రాగా పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.1,29,000 స్వాధీనం చేసుకున్నారు. 2009లో ఎన్‌టీఎస్‌లో ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూ అవినీతి కేసులో ఉద్యోగం కోల్పోయినప్పటి నుంచి బాలాజీనాయుడు రెండు రాష్ట్రాలలో రాజకీయ నాయకులకు ఫోన్లు చేసి ఉద్యోగాలు ఇప్పిస్తానని 50 మంది వరకు ఎమ్మెల్యేలను మోసం చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇతనిపై రెండు రాష్ట్రాల్లో 32 చీటింగ్ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఇతను గత నెలలో నెల్లూరు జైలు నుంచి విడుదలయ్యాడని తెలిపారు. సమావేశంలో సీఐ అజయ్‌కుమార్, ఎస్‌ఐ చౌడయ్య పాల్గొన్నారు.

మార్కాపురాన్ని వెంటనే జిల్లాగా ప్రకటించండి

ముఖ్యమంత్రికి జిల్లా సాధన సమితి విజ్ఞప్తి



కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

కంభం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల వాగ్దానంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురం జిల్లాను వెంటనే ప్రకటించాలని జిల్లా సాధన సమితి, పశ్చిమ ప్రకాశం విద్యావంతులు, మేధావులు విజ్ఞప్తి చేశారు. కంభంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి నాగేంద్రుడు మాట్లాడుతూ మార్కాపురం పట్టణ కేంద్రంగా మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, దర్శి, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్లను ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో మార్కాపురాన్ని జిల్లా చేస్తామని ప్రకటించినట్లు తెలిపారు. ఇటీవల మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి దాని ఆధ్వర్యంలో ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిసింది. ప్రజల ఆత్మగౌరవాన్ని పరిగణనలోకి తీసుకొని అందులో భాగంగా ఈనెల 27వ తేదీ గురువారం కంభం రామాలయం వీధి నుంచి కందులాపురం సెంటర్ వరకు భారీ ప్రదర్శన చేసిన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. కార్యక్రమంలో మార్కాపురం జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షులు మీనిగ ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, వాడవల్లి రమణ, షేక్ కలాం, పగడాల పాండు ప్రసంగించారు.

మార్ట్ మూతపడే వరకు మెక్కేశారు..!

మహిళ మార్ట్ మూతపై మూడోసారి విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పొదుపు మహిళల భాగస్వామ్యంతో ఒంగోలులో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ మూతపై విచారణ కొనసాగుతోంది. మార్ట్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై నెల్లూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మెప్మా పీడీ లీలాకుమారి నేతృత్వంలో మెప్మా ఎండీ విచారణకు ఆదేశించగా, ఇప్పటికే రెండుసార్లు విచారణ కొనసాగింది. తొలుత ఆర్పీలు, ఇతర సిబ్బందిని విచారించగా, గురువారం మూడోసారి లీలారాణి విచారణ జరిపారు. మార్ట్ ఏర్పాటు అయినప్పటి నుంచి దాని నిర్వహణ బాధ్యతలు, అలాగే మార్ట్‌లోని సిబ్బంది. మార్ట్ నిర్వహణకు కొనుగోలు చేసిన రశీదులు, చెల్లింపులు, బ్యాంకు ఖాతాలను పరిశీలించారు. మార్ట్‌లో సరుకులు మాయం అవడంతోపాటు నిధులు కూడా దారి మళ్లాయని వారు గుర్తించినట్లు సమాచారం. మార్ట్ నిర్వహణ సమయంలో గతంలో కొంతమంది సీవోలు, ఇతర సిబ్బంది మార్ట్‌లోని సరుకులను తమ గృహ అవసరాలకు తమ ఇళ్లకు తీసుకెళ్లగా, పీడీ శ్రీహరి కూడా ప్రతి నెలా రూ.20వేలు ఖరీదు చేసే నిత్యవసర సరుకులను తన ఇంటికి పైసా చెల్లించకుండా తీసుకెళ్లినట్లు కొందరు సిబ్బంది విచారణ అధికారులకు వెల్లడించినట్లు సమాచారం. ఈ సందర్భంగా విచారణ అధికారులు పలు రికార్డులను, బిల్లులు, బ్యాంకు వివరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

మంత్రిని కోరిన ఎమ్మెల్యే దామచర్ల



మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రాష్ట్ర పట్టణాభివృద్ధి పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. గురువారం అమరావతిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన దామచర్ల నగర అభివృద్ధి కోసం చేపడుతున్న పనుల గురించి వివరించారు. పోతురాజుకాలువ ఆధునికీకరణ, నల్లవాగు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఒంగోలు కార్పొరేషన్‌కు రావాల్సిన నిధులు సుమారు రూ.79 కోట్లు, కాంట్రాక్టర్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు మంత్రికి అందజేశారు. అలాగే పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలన్నారు. ఇదే సమయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని, గతంలోనూ, ప్రస్తుతం జరిగిన బోగస్ గ్రూపుల బాగోతం తేల్చాలని కోరారు.

రైతుల జాడ లేని సహకార వారోత్సవాలు

తూతూమంత్రంగా ముగించిన అధికారులు

ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అఖిల భారత సహకార వారోత్సవాలు తూతూమంత్రంగా జరిగాయి. ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలు నిర్వహించాల్సి ఉండగా దీనికి సంబంధించి ప్రచారం కూడా అంతంత మాత్రంగానే ఉంది. సహకారశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నా రైతులు జాడ కనిపించలేదు. ఆత్మ నిర్భర భారత్ సాధకాలుగా సహకార సంఘాలు అనే ప్రధానాంశంపై ఈవారోత్సవాలను నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. వారం రోజుల పాటు వివిధ సంఘాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించి సొసైటీల పట్ల రైతులకు ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ వారోత్సవాల్లో రైతుల జాడే కనపడలేదు. ప్రచార పోస్టర్లు కేవలం రెండు రోజుల ముందే జిల్లాకు చేరాయి. హడావుడిగా అధికారులు జిల్లా కలెక్టర్‌తో ఆ పోస్టర్లను ఆవిష్కరించారే తప్ప ప్రచారం చేయలేదు. ఈ విషయంలో ప్రభుత్వం కూడా పెద్దగా పట్టించుకున్న దాఖాలాలు లేకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యమైంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 125, 136
చికెన్ విత్ స్కిన్ (కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్ (కిలో)	232.00


బీజేపీలో చేరుతున్న వివిధ మండలాలకు చెందిన నాయకులు

బీజేపీలో పలువురి చేరిక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలుమండలాలకు చెందిన 20 మంది భారతీయ జనతా పార్టీలో చేరారు. గురువారం సాయంత్రం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. ఈసందర్భంగా పార్టీలోచేరిన వారికి పార్టీకండువాలు వేసి కల్యాణ్ చక్రవర్తి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాయపాటి అజయ్, బొద్దులూరి ఆంజనేయులు, సత్యవతి, దండు శ్రీనివాస్, తిరుమల తదితరులు ఉన్నారు.


తహసీల్దార్ నుంచి అవార్డును స్వీకరిస్తున్న వీఆర్వో వెంకటస్వామి

ఉత్తమ వీఆర్వోగా వెంకటస్వామి

సంతనూతలపాడు, నవంబరు(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన సంతనూతలపాడు వీఆర్వో వెంకటస్వామికి గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణరెడ్డి ఉత్తమ వీఆర్వో అవార్డు, ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా రెవెన్యూసిబ్బంది వీఆర్వోకు అభినందనలు తెలిపారు.

స్వామిత్వ సర్వేపై ప్రత్యేక గ్రామసభ

మండలపరిధిలోని ఎం.వేములపాడు గ్రామంలో స్వామిత్వ సర్వే వందశాతం పూర్తి అవడంపై గురువారం గ్రామ సభ నిర్వహించారు. స్వామిత్వ సర్వేకు సంబంధించి గ్రామంలో ఎవరికైన అభ్యంతరాలు ఉంటే తెలియజేస్తే తిరిగి కొలతలు నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి ఎస్.కాశమ్మ తెలిపారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నేతలు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణను వేగవంతం చేసిందని ఈ విధానాలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. రాజశేఖర్ హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో రాజశేఖర్ మాట్లాడారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేదలకు వైద్యసేవలు అందకపోవడంతో పాటు పేద విద్యార్థులకు మెడికల్ విద్య కూడా అందని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సిసింద్రీ బాబు, వి. కోటి, సీహెచ్‌శాంసన్, చంద్రశేఖర్, సచిన్, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కార్మికసంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం. రమేష్ డిమాండ్ చేశారు. కార్మికుల కోసం వసూలు చేసిన వేల కోట్ల రూపాయాల సెస్‌ను ప్రభుత్వం కార్మికుల కోసం ఖర్చు చేయకుండా సూపర్ సిక్స్ వంటి కార్యక్రమాలను మళ్లించడం దుర్మార్గంగా ఉందన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామారావు అధ్యక్షత వహించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతో పాటు సెస్ రూపంలో వసూలు చేసిన నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేశును కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు జి.రమేష్, ఎస్కే హుస్సేన్, ఎన్.శ్రీను, ఎస్కే నాగూర్, భానుమూర్తి, ఎస్కే సుభాని తదితరులు ఉన్నారు.

మోపెడ్‌ను ఢీకొన్న కారు

నాగులుప్పలపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు - చీరాల జాతీయ రహదారిపై ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్నవాగు వద్ద గురువారం ముందు వెళుతున్న మోపెడ్‌ను చెన్నై నుంచి చీరాల వైపు వెళుతున్న కారు ఢీకొంది. దాంతో అమ్మనబ్రోలుగ్రామానికి చెందిన నిమ్మకాయల వ్యాపారి పాశం శ్రీనివాసరావు తీవ్ర గాయాలపాలయ్యారు.స్థానికులు 108 లో క్షతగాత్రుడిని ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు.


దెబ్బతిన్న కారు

ముమ్మరంగా పొగ నాట్లు

ఇప్పటికే 800 హెక్టార్లలో పూర్తి

నారు మూట రూ. 6 నుంచి 7వేలు వెచ్చించి కొనుగోలు

మళ్లీ తుఫాన్ హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లు


ఒంగోలు రూరల్ మండలం ముక్తినూతలపాడులో పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

ఒంగోలు(రూరల్), నవంబరు20(ఆంధ్రజ్యోతి):ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండు పరిధిలో పొగాకు నాట్లు ఊపు అందుకున్నాయి. ఇప్పటికే రైతులు 800 హెక్టార్లలో పూర్తి చేశారు. గత సంవత్సరం ఒంగోలు పొగాకు వే లంకేంద్రం రెండు పరిదిలో 5,150 హెక్టార్లలో పొగాకు వేశారు. ఈసంవత్సరం సాగు తగ్గేపరిస్థితులు కనబడుతున్నాయి. నవంబరు మొదటి వారంనుంచి ప్రారంభించాల్సిన నాట్లు ఈసంవత్సరం మొంథా తుఫాన్‌తో ఆలస్యం అయ్యాయి.వేలంకేంద్రం రెండు పరిధిలోని ఉలిచి, మద్దిరాలపాడు, అమ్మనబ్రోలు, కేశినేనిపాలెం గ్రామాలలో పొగనారుమడులు సాగు చేశారు. మొంథాతుఫాన్ ప్రభావంతో గుండ్లకమ్మకు వరదలు రావడంతో నారుమళ్లుపూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కొందరు రైతులు దొమ్మేరు, రాజమండ్రి నుంచి, మరికొందరు జిల్లా పరిధిలోని చోడవరం, కామేపల్లి నుంచి పొగనారు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పొగనారు మూట రూ. 6వేలునుంచి 7వేలు రూపాయలకు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. ఈ తరుణంలో మళ్లీ తుఫాన్ హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లపరుగెడుతున్నాయి. ఈ ఏడాది పొగాకు బోర్డు ఒక్కో బ్యారన్‌కు 4.75 ఎకరాలు మత్రమే సాగుకు అనుమతి ఇచ్చింది. అయినా వాతావరణ శాఖ హెచ్చరికలతో పాటు అదును దాటిపోతుండటం, ఇంకా పలు చోట్ల భూములు ఆరకపోవడంతో ఈ ఏడాది అనుకున్నదానికంటే పొగాకు సాగు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు : మండలంలోని పలు గ్రామాలలో పొగాకు నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెలలోనే నాట్లు సాగాల్సి ఉండగా మొంథా తుఫాన్ హెచ్చరికలతో రైతాంగం వెనుకంజవేసింది. అనుకున్నట్లుగానే తుఫాన్ ప్రభావంతో ఈ ప్రాంతంలోని నారుమడులు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు దూర ప్రాంతాల నుంచి నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. మరో వైపు సీజన్ దాటిపోవడంతో అద్దంకి, మేదరమెట్ల ప్రాంతాల నుంచి కూలీలను ఒక్కో జతకు రూ. 1,150 చొప్పున చెల్లించి తీసుకొస్తున్నారు.పొగాకు మొక్కలు నాటేందుకు అవసరమైన నీటిని కొందరు వాటర్ ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసి వేస్తున్నారు. దీంతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.


నాగులుప్పలపాడు మండలం చదలవాడలో పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

పుస్తకపఠనం అలవర్చుకోవాలి

- విద్యార్థులకు జేసీ గోపాలకృష్ణ సూచన
- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్నజేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు పుస్తక పఠనాన్ని తమ దైనందిన అలవాటుగా మార్చుకోవాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఒకరోజు అయినా విద్యార్థులు తమ దగ్గరలోని గ్రంథాలయానికి వెళ్లి అక్కడి పుస్తకాలను చదవటం అలవాటుగా చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా నృత్యం, సంగీతం, చిత్రలేఖనం తదితర కళలలో తమకు ఇష్టమైన వాటిని ఎంచుకుని అందులో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. ఈ సందర్భంగా వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీ.వి.శివారెడ్డి, ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంఈవోలు చంద్ర మౌళీశ్వర్, వెంకారెడ్డిలు అన్నారు. గురువారం సంతనూతలపాడు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకుడు కే.సత్యనారాయణ, హెచ్‌ఎం అనంతయ్య, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. రుద్రవరం మండలపరిషత్ పాఠశాలలోనూ గురువారం ముగింపు కార్యక్రమాలు జరిగాయి.

సాగర్ కవచ్‌పై పోలీస్‌శాఖ డెమో

- తీరప్రాంతంలో భద్రతా చర్యలు
- విధులలో 112 మంది సిబ్బంది


రైల్వే స్టేషన్‌లో నిఘాలో పోలీసులు


తీరంలో భద్రతను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తీరం వెంబడి కట్టుదిట్టమైన భద్రతతో ఉగ్రవాదుల దాడులను సంసిద్ధంగా ఎదుర్కొనేందుకు సాగర్ కవచ్ పేరుతో రెండు రోజుల పాటు పోలీసు శాఖ డెమో నిర్వహిస్తోంది. మెరైన్, కోస్టు గార్డులతో పాటుగా జిల్లా పోలీసులు కలిసి తీర ప్రాతంలో భద్రతా వ్యాయామం చేపట్టారు. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డీఎస్పీ నోడల్ అధికారిగా సాగర్ కవచ్ భద్రత ఏర్పాట్లు చూస్తున్నారు. మొత్తం జిల్లాలో ఉన్న తీర ప్రాతంతోపాటుగా , జిల్లా కేంద్రంలో ఉన్న ప్రకాశం భవన్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ డిపో తదితర ముఖ్య కార్యాలయాలపై నిఘా ఉంచి భద్రతా చర్యలు చేపట్టారు. సముద్ర తీరం నుంచి చొరబాటుదారులు చొచ్చుకొని రాకుండా ఉండేందుకు తీసుకునే చర్యలులో భాగంగా డెమోను నిర్వహిస్తున్నారు. దీంతో పాటు ఒంగోలు నగరంలో వాహన తనిఖీలు చేపట్టారు. సాగర్ కవచ్ విధులలో 112 మంది సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్యమైన ప్రాంతాలలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. నగరంలోని పలు ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు.

పేస్కేల్ అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న వీఆర్ఏలు

కొండపి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పే స్కేల్‌కు అర్హులైన వీఆర్ఏలను వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ ఎస్.శీనివాసులకు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ వ్యవస్థలో సుమారు 19,359 మంది గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్నారు. రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం నుంచి చాలా తక్కువ వేతనంతో పనిచేస్తున్నామని రెవెన్యూ డిపార్ట్‌మెంట్లో దిగువ స్థాయిలో పనిచేస్తూ ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి ఉన్నారని డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నామని వారు వినతి పత్రంలో సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని వేతనం పెంచకపోగా డీఏని కూడా ఉపసంహరించి రికవరీ చేశారని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చాక అయినా పే స్కేల్, ప్రమోషన్లు ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కొండపి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరను జిల్లా విద్యాశాఖ అధికారి వర ప్రసాద్ గురువారం ఆకస్మితంగా తనిఖీ చేశారు. వంటగది స్టోర్ రూమ్ బాలుర, బాలికల టాయిలెట్స్, తాగునీటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారమే పిల్లలకు భోజనాలు అందించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. మధ్యాహ్న భోజన పథకంపై తల్లిదండ్రుల ద్వారా ఎటువంటి ఫిర్యాదులూ తమకు రాకూడదన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. దాతల సహాయంతో ఏర్పాటు చేస్తున్న భోజనం బాగుందని అభినందించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని బూరేపల్లిలో గురువారం ఉదయం గొలుసు దొంగతనం జరిగింది. మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య సమాచారం ప్రకారం పారిశ్రామిక వాడ సమీపంలోని బూరేపల్లి పునరావాస కాలనీకి చెందిన రావిపాటి వెంకటరత్నం ఇంటి ముందు ఉండగా దుండగుడు మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం గురువారం మద్దిపాడు పాత సిండికేట్ బ్యాంకులో ఘనంగా జరిగింది. పూజారి గంగాధర్ పంతులు ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు, శివ, భవానీ స్వాము లు ఈ పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కనమర్లపూడి సుబ్బారావు, శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారిని స్వర్ణలత

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి జి.స్వర్ణలత అన్నారు. గురువారం పెద్దకొత్తపల్లి, నేలటూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రధానంగా పంటను ఆశించే వివిధరకాల తెగుళ్లలో భూమి ద్వారా ఆశించేవి ముఖ్యమైనవని, శిలీంద్రాలు, బ్యాక్టీరియా, నులిపురుగుల నుంచి సంక్రమిస్తాయని అన్నారు. ఇవి పప్పుధాన్యాలు, నూనెగింజలు, పత్తి, కూరగాయలను ఆశించి పంట దిగుబడిపై ప్రభావం చూపుతాయన్నారు. రైతులు పంటమార్పిడి విధానాన్ని పాటించాలని, శనగలో ఎండుతెగులు తట్టుకునే రకాలను సాగు చేయాలని ఆమె అన్నారు. మండలంలో అర్హత కలిగిన రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు వారి బ్యాంకు ఖాతాలలో జమచేయటం జరిగిందని, ఇంకా జమ కానివారు గ్రామ సచివాలయంలోని వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏఈవో పి.శేషయ్య, వీఏ విజయరత్న, ఎంపీఈవో లక్ష్మి, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు విద్యార్థుల ఎంపిక

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీకి మద్దిపాడు కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి తెలిపారు. చంద్రగిరిలో జరిగే టోర్నమెంట్‌కు వెళ్తున్న విద్యార్థులను ఆయన గురువారం అభినందించారు. రూ. 12 వేల విలువైన స్పోర్ట్స్ పరికరాలు, టీ షర్టులు పిన్నింటి చారిటీ తరఫున ఉమ్మలనేని కిషోర్, కల్యాణీలు అందజేశారు. కార్యక్రమంలో పీడీ వనజ, సౌజన్య, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.


ఇంటి పట్టాను అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

జీవనాధారం లేని మహిళకు ఇంటి పట్టా మంజూరు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భర్తను కోల్పోయి ఎలాంటి జీవనాధారం లేని కుటుంబానికి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆసరా ఇచ్చారు. దర్శి మండలం తూర్పువీరాయపాలెంకు చెందిన మాలపాటి స్వప్నకు జేసీ అండగా నిలిచారు. ఈనెల 17వతేదీన కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో స్వప్న తన బాధను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు విన్నవించుకుంది. దీనిపై స్పందించిన జేసీ గోపాలకృష్ణ అదే రోజు ఈ విషయంపై దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇతర రెవెన్యూ అధికారులతో మాట్లాడి వెంటనే 25 కిలోల బియ్యం, రెండు కేజీల కందిపప్పు, రెండు కేజీల వంటనూనెతో పాటు మరి కొంత ఆర్థికసహాయాన్ని అందజేశారు. మరో వైపు స్వప్నకు ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. ఆ ఇంటి స్థలం పట్టాను గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో స్వప్నకు జేసీ గోపాలకృష్ణ అందజేశారు. పక్కా ఇల్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు సూచించారు. మరో వైపు భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో ఇబ్బందులు పడుతున్న స్వప్నకు వితంతు పెన్షన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జీవనాధారం కోల్పోయిన తనకు ప్రభుత్వం తరుపున అండగా నిలిచిన జేసీ గోపాలకృష్ణకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



వర్క్‌షాపునకు హాజరైన విద్యార్థులు

పేస్‌లో విద్యుత్‌వాహనాలపై సాంకేతిక వర్క్‌షాపు

ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం విద్యార్థులకు విద్యుత్ వాహనాలపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాంకేతిక వర్క్‌షాపు గురువారం ముగిసింది. ఈ వర్క్‌షాపునకు రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న హైదరాబాద్ హెచ్‌ఐఈఈఎం పవరింగ్ ఇంజనీర్స్ ప్రైవేటు లిమిటెడ్ టెక్నికల్ మేనేజర్ మంజునాథ్ కులకర్ణి విద్యుత్ వాహనాల టెక్నాలజీ, అప్లికేషన్స్‌పై విద్యార్థులకు వివరించారు. విద్యుత్ వాహనాల నిర్మాణం, ఈవీ పవర్ ట్రైన్ ఆర్కిటెక్చర్, మోటార్ అండ్ కంట్రోలర్ టెక్నాలజీ, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాల గురించి వివరించారు. ప్రాక్టికల్ సెషన్‌లో విద్యార్థులకు ఈవీ మోడల్ అనాలసిస్, కమ్యూనికేషన్, నైపుణ్యాలను పెంపొందించారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, విభాగాధిపతి నాగరాజు, కో ఆర్డినేటర్ సౌజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పశుసంపదను అభివృద్ధి చేసుకోవాలి

ఒంగోలు(రూరల్)నవంబరు20(ఆంధ్రజ్యోతి): పశుజాతిని అభివృద్ధి పరిచాలని పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ ఎస్ .జయచంద్ర అన్నారు. మండలంలోని సర్వేరెడ్డిపాలెంలో గురువారం పశువులలో గర్భకోశ వ్యాధులపై ఉచితపశు వైద్య శిబిరం జరిగింది. 32 పశువులకు గర్భకోశ పరీక్షలు,52 పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. ఏడీఏ బి.బసవశంకరరావు, యరజర్ల పశువైద్యాధికారి వై.భూపాల్ , ఉలిచి పశువైద్యాధికారి ఐ.ప్రతిమ, డీఎల్‌డీవో ఉప్పుటూరి ఆషా, నాయకులు గుండపనేని శ్రీనివాసులు,మక్కెన శ్రీనివాసరావు గ్రామరైతులు పాల్గొన్నారు.

పశువుల పెంపకం ద్వారా సిరుల పంట

మద్దిపాడు :పశువుల పెంపకం ద్వారా రైతులు మంచి ఆదాయాన్ని పొందవచ్చని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.కిషోర్ కుమార్ అన్నారు. గురువారం నందిపాడు గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు.

అంతర్‌జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎంపికయిన బాలికలతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఒంగోలు(రూరల్), నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం ముక్తినూతలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు అంతర్ జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యారు. కనిగిరి మండలం కంచర్ల వారిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో అండర్17, అండర్ 14 బాలికల జిల్లాస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలలో అండర్ 17కు బి.అనూష, అండర్ 14 విభాగంలో ఎం.పల్లవి ప్రతిభ కనబరిచారు. అండర్ 17కి ఎంపికయిన క్రీడాకారిణి అనూష ఈనెల21 నుంచి పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో పాల్గొంటారు. అండర్ 14కి ఎంపికయిన పల్లవి ఈనెల 22నుంచి మచిలీపట్నంలో జరిగే పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎంపికయిన బాలికలను పాఠశాల హెచ్‌ఎం దేవసేన, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, రామాంజి బాబు అభినందించారు.

ఉపాధి పనులతో అభివృద్ధి చేసుకోవాలి

ఒంగోలు(రూరల్), నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామిపనులతో దశరాజుపల్లి గ్రామస్థులు గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఏపీవో నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని దశరాజుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గురువారం సమావేశం జరిగింది. ఈసమావేశంలో గ్రామానికి సంబంధించి చేయాల్సిన పలు పనులను గుర్తించారు. గ్రామసర్పంచ్ పులిచర్ల శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ మాలంపాటి యానాదినాయుడు, పంచాయతీ కార్యదర్శి గరువర్దిని తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై అభ్యంతరాలు ఉంటే తెలపాలి

నాగులుప్పలపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేపై అభ్యంతరాలుంటే ప్రజలు గ్రామసభల్లో తెలియజేయాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు.స్వామిత్వ సర్వే గ్రామ సభలను చదలవాడ, బి.నిడమానూరు గ్రామాలలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ రెండు నెలలుగా సచివాలయ సిబ్బంది గ్రామాల్లో స్వామిత్వ సర్వే చేశారన్నారు. స్వామిత్వ సర్వే ద్వారా ప్రతి ఇంటి,స్థల యజమానులకు శాశ్వత స్థల హక్కును కల్పిస్తామని చెప్పారు. 9(2) నోటీసు అందుకొన్న వారు స్వామిత్వ సర్వేలో తమకు సంబంధించిన స్థలాలపై ఏమైనా అభ్యంతరాలుంటే గ్రామసభల్లో తెలియజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం పలువురికి నోటీసులను అందజేశారు.

ఉద్యోగ నియామక పత్రం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర శివారులోని నారాచి రెస్టారెంట్‌లో 2023లో జరిగిన మొలతోటి వెంకటరావు హత్యకేసులో హతుడి కుమారుడు నరహరికి ప్రభుత్వ ఉద్యోగం, భార్యకు ఎస్సీ ఎస్టీ మంత్లీ పెన్షన్ ఉత్తర్వులను కలెక్టర్ పీ రాజాబాబు గురువారం అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం ఉత్తర్వులను అందజేశారు.

రెండోసారి టీడీపీ మండల అధ్యక్షుడిగా బోనేని



కొమరోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్‌ను రాష్ట్ర పార్టీ నిర్మించింది. మండలంలో గత 5 సంవత్సరాలుగా పార్టీని బలోపేతం చేసి ప్రజల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసిన బోనేనికి మరలా పార్టీ అధ్యక్ష పదవిని ఇవ్వడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆశీస్సులతో కొమరోలు మండల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, వారి సహకారంతోనే మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేశామన్నారు. రెండవ సారి నన్ను మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు.

గానుగపెంటలో నీటి సమస్య

- నాలుగురోజులకోసారి అరకొర సరఫరా
- అల్లాడుతున్న స్థానికులు

తర్లుపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గానుగపెంటలో తీవ్ర మంచినీటి సమస్య నెలకొంది. గ్రామంలో ఉన్న డీప్ బోర్లు ఇంకిపోవడంతోపాటు సాగర్ జలాలు 4 రోజులకు ఒక సారి వస్తుండడంతో ప్రజలు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఎక్కువగా పశు పోషణ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నీటి సమస్య తలెత్తడంతో పశువులకు కూడా పొలాల్లోనే నీరు పెట్టాల్సిన పరిస్థితి నెలకుందని పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న డీపు బోర్లు రెండు నెలల నుంచి మరమ్మతులకు గురయ్యాయి. బోర్లకు మరమ్మతులు చేయించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామానికి సరఫరా అయ్యే సాగర్ జలాలు కూడా నాలుగు రోజులకు ఒకసారి ఒక గంటపాటు వస్తాయి. దీంతో గ్రామస్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సాగర్ జలాలను నింపిన ఓవర్ హెడ్ ట్యాంక్ గత సంవత్సరం నుంచి శుభ్రం చేయకపోవడంతో సరఫరా అయ్యే నీరు కూడా మలినాలతో వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న డీప్ బోర్లకు మరమ్మతులు చేయించి ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మరమ్మతులు చేయించి సాగర్ జలాలు రోజు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గానుగపెంటలోని హెడ్ ట్యాంక్



మంచి నీటి కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు



మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి వెంకటేశ్వరావు

పశువుల వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

కొనకనమిట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పశు పోషకులు పశువులలో వచ్చే వ్యాధులను ముందుగా గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు సంవర్థక శాఖ వైద్యాధికారి వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని కాట్రగుంట గ్రామంలో గురువారం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులు ముఖ్యంగా వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకొని వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా గొర్రెలు, మేకల పెంపకంలో యాజమాన్య పద్ధతులను వివరించారు. నట్టల నివారణ ప్రాధాన్యతను వివరించారు. పశుపోషకుల కోసం ఉపాధి పథకంలో మినీగోకులాలు, నీటి తొట్టిలను నిర్మించుకోవాలని సూచించారు. వరదలు, విపత్తులులలో పశువులు చనిపోతే గతంలో ఉన్న రూ.37,500 నష్టపరిహారాన్ని ప్రస్తుతం రూ.50వేలకు పెంచినట్లు చెప్పారు. సంచార పశు ఆరోగ్య సేవావాహనం, పశు బీమాతో పాటు 50శాతం రాయితీతిలో పశువులకు దానాను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు రాఘవయ్య, సహాయసంచాలకులు వేణు, గొట్లగట్టు పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి, జిల్లా నోడల్ అధికారి భరత్, పలువురు సిబ్బంది, పోషకులు పాల్గొన్నారు.

ఇష్టకామేశ్వరి గూడేనికి సోలార్ పంపుసెట్ ఏర్పాటు

నిధులు అందజేసిన రాష్ట్ర సమాచార కమిషనర్ సునీల్

పెద్ద దోర్నాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల అభ్యున్నతికి తనవంతు సాయంగా రూ.55వేలను రాష్ట్ర సమాచార కమిషనర్ డా.చావలి సునీల్ అందజేసినట్లు తహసీల్దార్ అశోక్ కుమార్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీన ఇష్టకామేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు సునీల్ రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా గూడెం వాసులు తమకు సోలార్ మిషన్ పాడయిందని వానాకాలం పని చేయక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, చెలిమ నీళ్ల తాగుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన ఎంత ఖర్చు అవుతుందో తనకు తెలియజేయాలని అటవీ శాఖాధికారులకు సూచించారు. అంచనా వ్యయం రూ.55వేలు నిర్ణయించి కమిషనర్‌కు తెలియజెప్పడంతో ఆ సొమ్మును అందజేశారని, దీంతో గూడెంలో పనులు ప్రారంభించినట్లు తహసీల్దారు తెలిపారు. చెంచు గిరిజనులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారని తహసీల్దార్ చెప్పారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెద్దదోర్నాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మినుములో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జవహర లాల్ నాయక్ అన్నారు. మండలంలోని చిన్నదోర్నాల, చిన్నగుడిపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మినుమును పరిశీలించిన ఆయన పంటలో రసం పీల్చే పురుగు ఆశించడం గమనించారు. నివారణ చర్యల్లో భాగంగా వేప గింజల కషాయం 5శాతం, లేదా వేప నూనె 5మి.లీ.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రొఫినోఫాస్ 1.5మి.లీ. లేదా అస్ఫేట్ 1గ్రా. లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా పొగాకు సాగు చేయ రాదని మినుము, బొబ్బర్లు, కొర్ర, జొన్న తదితర అపరాలు విత్తుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ పార్వతీ, వీహెచ్ఏ శిరీష ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి మహాయజ్ఞం

గిద్దలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రిమాత దేవాలయంలో గురువారం గాయత్రి మహాయజ్ఞంను వైభవంగా నిర్వహించారు. భక్తులు సామూహికంగా గాయత్రి యజ్ఞంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా విశ్రాంత తెలుగు ఆచార్యులు సూరం నారాయణరెడ్డి మాట్లాడుతూ సంపద సుఖాన్ని ఇవ్వదని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక, సేవా భావాలు పెంచుకున్నప్పుడే మనిషికి శాశ్వత ఆనందం దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో రామక్రిష్ణ మఠం అధ్యక్షుడు పి.హనుమంతరెడ్డి, గాయత్రి పరివార్ ప్రతినిధులు లక్ష్మీప్రసూన, విజయ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నగర సంకీర్తన

పట్టణంలోని ప్రేమసుధా మందిరం ఆవరణలో భగవాన్ సత్యసాయి శతవర్ష జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 2వ రోజు గురువారం తెల్లవారు జామున 5గంటలకు భక్తులు ప్రధాన వీధుల్లో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సాయి గాయత్రి మంత్రాన్ని సామూహికంగా నామసంకీర్తన చేశారు. సంగీత విభావరి కార్యక్రమం అందరినీ అలరించింది. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



గిద్దలూరులో విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు



రాచర్లలో బహుమతులను అందజేస్తున్న అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. మున్సిపల్ కమిషనర్ డీబీఎస్ నారాయణరావు, ఎంఈవో రాందాస్ నాయక్, వినియోగదారుల సంఘం నాయకుడు వై.మల్లిక్, విశ్రాంత ఉపసంచాలకులు డాక్టర్ ఏ.వీరారెడ్డి, అధ్యాపకులు శేషకుమార్, సామాజిక కార్యకర్త విజయలక్ష్మి పాల్గొని వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డీవీ సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో వారం రోజులుగా ఘనంగా జరిగిన గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. గురువారం పాటలు, కళలపై పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పిల్లలకు చదువుతోపాటు వివిధ రకాల పుస్తకాలను చదివించడం ద్వారా మరింత విజ్ఞానం అలవడుతుందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అశ్వనీకుమార్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి స్వరూపారెడ్డి, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్ పాల్గొన్నారు.

రాచర్ల : పుస్తకాలను చదవడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం బహుమతులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వలన విజ్ఞానం, మేధాశక్తి పెరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కోటేశ్వరరావు, ఎంఈవో-1 షేక్ మొయినుద్దీన్, ప్రధానోపాధ్యాయుడు బీఎల్ రామనాయక్, ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రశేఖర్, గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు షాపుల్లో చోరీ

కొరవడిన పోలీస్ నిఘా

కంభం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిత్యం ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే ప్రాంతంలో బుధవారం రాత్రి మూడు షాపుల్లో షట్టర్లను పగులగొట్టి రెండు దుకాణాల్లో చోరీ చేశారు. రెండు చోట్ల రూ.10వేలకుపైగా నగదును అపహరించారు. వివరాలలోకి వెళితే.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సాయిబాలాజీ ట్రేడర్స్, నారాయణ ఏజెన్సీస్, టెక్స్‌మో మోటార్ షాప్, నంది పైపుల షాపుల తాళాలను పగులగొట్టిన దొంగలు షట్టర్లను ధ్వంసం చేసి నారాయణ ఏజెన్సీ షాపులలో రూ.5వేల నగదు మల్లికార్జున ఎలక్ట్రికల్ షాపులో కౌంటర్‌లో దాచిన రూ.6వేల నగదును ఎత్తుకెళ్లారు. మూడవ షాపు షట్టర్‌ను పైకి ఎత్తేందుకు చేతకాక వెళ్లినట్లు తెలుస్తుంది. రాత్రి, పగలు దొంగతనం చేయడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాపుల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపుల షట్టర్ తాళాలు పగులగొట్టి చోరీ చేసింది దొంగలా లేకా తాగుబోతులా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కారణం ఈ షాపులకు ఎదురుగా మద్యం దుకాణం ఉంది. అది రాత్రి 10 గంటల వరకు తెరిచే ఉంటుంది. తాగిన వాళ్లే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో షాప్ షట్టర్‌ను పగులగొట్టిన దొంగలు

కొరవడిన పోలీసుల నిఘా

ఇటీవల కాలంలో కంభం పట్టణంలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. అలాగే ఇంటి బయట కానీ, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలలో కానీ దొంగతనాలు చేయడమో లేక వాటి టైర్లు విప్పదీసి తీసుకెళ్లడమో, వాహనాలలో పెట్రోల్ తీయడం ఎక్కువైంది. కారణం రాత్రి 11గంటల తర్వాత తాగుబోతుల వీరంగం, ద్విచక్ర వాహనదారుల హైస్పీడ్ రేసులతో ప్రజలు, ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. పోలీసులు సాయం త్రం వేళ ఏదో ఒక సెంటర్‌లో అరగంట వాహనాల తనిఖీలో హడావుడి చేసి వెళ్లిపోతుండడంతో చీకటి పడ్డాక తాగుబోతులకు, దొంగలకు అడ్డు లేకుండా పోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి 11గంటల తర్వాత బస్టాండు, మెయిన్ బజారు, వైజంక్షన్, టీ, బడ్డీకొట్ల సమీపాల్లో తిరుగుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పైకి ఎత్తి ఉన్న షట్టర్



జాబ్ మేళానుద్దేశించి మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

జాబ్ మేళాతో యువతకు ఉపాధి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళాతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీలో గురువారం జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా జాబ్ మేళాలను నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ఈ మేళాలో ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించాలని 10 కంపెనీల ప్రతినిధులను ఆయన కోరారు. 157 మంది నిరుద్యోగులు పాల్గొనగా, 74 మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధరనాయుడు, ఏపీఎస్ ఎస్‌డీసీ విజయకుమారి, నందన్‌బాబు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, నాయకులు

మార్కాపురం రూరల్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో ఇంటి పన్నులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని ఎంపీడీవో ఏ బాలచెన్నయ్య చెన్నయ్య తెలిపారు. మండలంలోని రాయవరం గ్రామ సచివాలయంలో ఇంటి పన్నుల ఆన్‌లైన్ చెల్లింపు పోస్టర్‌ను టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులను డిజిటల్ పేమెంట్‌లో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకుడు కాకర్ల శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి పెద్దిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపిన వ్యక్తికి 100 రోజుల జైలు

గిద్దలూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి భరత్‌చంద్ర 100 రోజుల జైలు శిక్షతోపాటు రూ.15వేలు జరిమానా విధించారు. గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ తనిఖీ చేస్తున్న సమయంలో షేక్ షరీఫ్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతుండగా అతనిని కోర్టులో హాజరుపరచగా గురువారం న్యాయాధికారి భరత్‌చంద్ర తీర్పు చెప్పారు. మద్యం తాగి వాహనం నడుపడం ద్వారా ప్రమాదాలు జరిగినపుడు తీవ్ర నష్టం జరుగుతుందని ఈసందర్భంగా సీఐ సురేష్ తెలిపారు.

టీడీపీ మాజీ కౌన్సిలర్ ఆంజనేయులు మృతి



ఆంజనేయులు

మార్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మార్కాపురానికి చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ చెప్పల్లి ఆంజనేయులు గురువారం ఉదయం మృతి చెందారు. కొన్నాళ్లుగా ఈయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో ఈయన 2014 నుంచి 2019 వరకు 20వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆంజనేయులు మృతిపట్ల ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. పట్టణంలోని పలువురు సీనియర్ టీపీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు మృతి



వెంకటేశ్వర్లు

ఎర్రగొండపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మండల మాజీ ఎంపీపీ గోపిదేశి వెంకటేశ్వర్లు బుధవారం అర్ధరాత్రి గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని స్వగృహానికి గురువారం తీసుకురాగా పలువురు ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలను పూర్తి చేశారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

మార్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రారంభించాలని భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డీకేఎం రఫీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు పలు హామీలు ఇచ్చిందన్నారు. కానీ వాటిని అమలు చేయడంలేదన్నారు. పశ్చిమ ప్రాంతంలో ఉచిత ఇసుక అమలు కావడంలేదన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఏవో రవీంద్రారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అన్వర్, నాయకులు ఆవులయ్య, రూబెన్, రాజు, సుబ్బరాయుడు, చెన్నకేశవులు, సింగరయ్య, థామస్, ఖాజావలి, జెర్మియా, నర్సింహులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. మెప్మా కార్యాలయంలో వార్డు శానిటేషన్, సెక్రటరీ, ఇమ్యూనిటీస్, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ, శానిటరీ మేస్త్రీలకు, సామర్థ్యాల పెంపుపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ మార్కాపురాన్ని తీర్చిదిద్దాలంటే అందరూ చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందించాలన్నారు. ఘన, తడిపొడి హానికర ప్లాస్టిక్ వ్యర్థాలు వేరు చేసి అవగాహన కల్పించాలన్నారు. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

నేడు కరెంట్ సరఫరా నిలిపివేత

దర్శి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని గాంధీనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సచన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్, బాలాజీ వెంచర్, ఎల్‌పీ రోడ్డు, కెజీజీ స్కూల్‌రోడ్డు, టీచర్స్ కాలనీ, కొత్తరెడ్డిపాలెం హ్యాపీహోమ్స్ తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

వెలిగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. స్థానిక గ్రంథపాలకుడు ఆలా భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో దాస్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వారం రోజులుగా కస్తూర్బా పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు గ్రంథపాలకుడు భాస్కర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాపతి, వెంకటేశ్వర్లు, మేరి, సుబ్బమ్మ, ధనలక్ష్మి, రజిత, అనిత పాల్గొన్నారు.

చిల్లచెట్ల తొలగింపు

దొనకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దొనకొండ పంచాయతీలో రోడ్లకిరువైపులా పెరిగిన చిల్లచెట్లను టీడీపీ మండల అధ్యక్షుడు మోది అంజనేయులు సొంత నిధులతో తొలగించే కార్యక్రమం చేపట్టారు. దర్శి వెళ్లే ప్రధాన రహదారి నుంచి ఒబ్బాపురం ఎస్సీ కాలనీకి వెళ్లే మట్టిరోడ్డు, అడ్డరోడ్డు సమీపంలోని ఎస్టీ కాలనీలోని రహదారులను చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్స్‌కవేటర్‌తో అంజనేయులు దగ్గరుండి చిల్లచెట్లను తొలగింపజేశారు.

నేడు దొనకొండలో ప్రజాదర్బార్

దొనకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మోడి అంజనేయులు తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాదర్బార్ జరుగుతుందన్నారు.

పేస్కేల్ అమలుచేయాలి

పామూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు గురువారం వీఆర్ఏ సంఘం మండల కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే వీఆర్ఏలకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రసూల్‌బీ, షేక్ మస్తాన్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రాంప్రసాద్‌కు ఉద్యోగోన్నతి

పీసీపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సింగంపల్లి రాంప్రసాద్‌కు ఉద్యోగోన్నతి లభించింది. డిప్యూటీ ఎంపీడీవోగా ప్రమోషన్ ఇస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఉద్యోగోన్నతి పొందిన రాంప్రసాద్‌ను ఎంపీడీవో జీవీ కృష్ణారావు, మండల పరిషత్ పరిపాలనాధికారి ప్రభాకరశర్మ, పీసీపల్లి డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మండల నాయకులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వన సంరక్షణతోనే భావితరాలకు ప్రాణవాయువు లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక కంభం రోడ్డులోని కనిగిరి నగరవనంలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ సమతులంగా ఉండి సకాలంలో వర్షాలు కురవాలంటే మొక్కలను ఎక్కువగా నాటాలన్నారు. చెట్ల ద్వారానే మానవుడికి తగినంతం ఆక్సిజన్ లభిస్తుందని చెప్పారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఏర్పాటుచేసిన పార్కు ఎంతో ఆహ్లాదంగా ఉందన్నారు. పార్కును సందర్శించే వారికి సౌకర్యాల కల్పనతో పాటు నగరవనం అభివృద్ధికి మరింత చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నగరవనంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌డీఎఫ్‌వో పి.శ్రీనివాసరావు, కనిగిరి ఎఫ్ఆర్‌వో పరమేశ్వరరెడ్డి, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, విద్యుత్ డీఈ ఉమాకాంత్, తహసీల్దార్ జయలక్ష్మి, ఎస్ఐ టి.శ్రీరాం, టీడీపీ మండల అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, సుబ్రమణ్యం, వెంకటరెడ్డి, సామిల్ అహ్మద్, కనిగిరి, పీసీపల్లి, పామూరు, గుడిపాటిపల్లి, అంబవరం, డీజీపేట ఫారెస్ట్ డీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



నగరవనంలో మొక్కనాటి మట్టిపోస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సాగర్ కాలువలను పరిశీలించిన ఎస్ఈ వరలక్ష్మి

దర్శి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల నీటి సరఫరాను ఒంగోలు ఎన్ఎస్‌పీ ఎస్ఈ వరలక్ష్మి గురువారం పరిశీలించారు. సాగునీటి పంపిణీలో వివక్ష శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈసందర్భంగా సాగర్ కాలువలకు విడుదలవుతున్న నీటి పరిమాణాన్ని పరిశీలించారు. పమిడిపాడు బ్రాంచ్ కాలువ(పీబీసీ) హెడ్ వద్ద నమోదవుతున్న రీడింగ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగర్ కాలువలకు నీటి పరిమాణం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చివరి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందేలా ఒంగోలు బ్రాంచ్ కాలువకు నీటి పరిమాణం పెంచుతామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సాగర్ కాలువలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్ఎస్‌పీ ఎస్ఈ వరలక్ష్మి

పన్నుల వసూలులో లక్ష్యాన్ని పూర్తిచేయాలి

» డీపీవో వెంకటేశ్వరరావు

ముండ్లమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూలులో లక్ష్యాన్ని పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని శంకరాపురం, పులిపాడు గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను వసూలును సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. క్లాప్ మిత్రలు తమకు కేటాయించిన ఇళ్లను నిత్యం సందర్శించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. పులిపాడులో జరిగిన గ్రామ సభలో డీపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వామిత్వ సర్వే పారదర్శకంగా ఉండాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శ్రీదేవి, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మండలపు వెంకటరావు, సర్పంచ్‌లు కూరపాటి నారాయణస్వామి మహేశ్వరి, ముక్కమళ్ల శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సహీనా బేగం తదితరులు పాల్గొన్నారు.



పులిపాడు గ్రామ సభలో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

పేదలకు అండగా ప్రభుత్వం

» బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు అందజేత

కనిగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ప్రజాప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరి మండలం పునుగోడు గ్రామానికి చెందిన తోకల చిననరసయ్య గత మార్చిలో ప్రమాదవశాత్తు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో షాక్‌కు గురై మృతి చెందారు. మృతుని కుటుంబానికి గురువారం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదంలో మరణించటం దురదృష్టకరమన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడి ఇచ్చిన హామీ మేరకు రూ.5 లక్షలు మంజూర చేసిందని చెప్పారు. గతంలో కూడా కనిగిరి ప్రాంతంలో విద్యార్థులు విద్యుత్ షాక్‌కు గురైన సందర్భాల్లో వారి కుటుంబాలకు ప్రభుత్వం తరుపున ఎక్స్‌గ్రేషియా అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ ఆర్.ఉమాకాంత్, టీడీపీ నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, కొండా కృష్ణారెడ్డి, పట్టాణాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, విద్యుత్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

దిగజారిన మొక్కజొన్న ధరలు

» పెరిగిన పెట్టుబడులు

» తగ్గిన దిగుబడులు

ముండ్లమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది అధికంగా మొక్కజొన్న సాగుచేశారు. దిగుబడులు రాకపోగా, ధర కూడా పతనమవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత వారం రోజులుగా ముమ్మరంగా కోతలు, నూర్పిళ్ళు జరుగుతున్నాయి. కొంతమంది రైతులు వెంటనే వ్యాపారస్తులకు అమ్మి పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చాలని ఆతృతతో దళారులు అడిగిన కాడికి విక్రయిస్తున్నారు. క్వింటా రూ.1700 నుంచి రూ.1750కి కొనుగోలు చేస్తున్నారు. దళారులు రంగప్రవేశం చేసి ఇంకా ధర దిగజారుతుందని భయపెడుతుండటంతో వారు అడిగిన కాడికి అమ్ముతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటా రూ.2400 పలుకుతుంది. మండలంలో పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, ముండ్లమూరు, కెల్లంపల్లి, చింతలపూడి, వేముల, వేములబండ, కమ్మవారిపాలెం, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, నాయుడుపాలెం, సుంకరవారిపాలెం, మారెళ్ళ, పోలవరం, శంకరాపురం, సింగనపాలెం, లక్ష్మీనగర్, రెడ్డినగర్, పులిపాడు గ్రామాల్లో ఎక్కువమంది మొక్కజొన్న సాగు చేశారు. ఎకరానికి 25 క్వింటాళ్ళ నుంచి 30 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది.

దీంతో రైతు పడిన కష్టానికి ఏ మాత్రం పైసా కూడా మిగిలే పరిస్థితి కన్పించటం లేదు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలుచేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మొక్కజొన్నను కాటా వేస్తున్న కూలీలు

బాస్కెట్‌బాల్ పోటీలకు పామూరు విద్యార్థుల ఎంపిక

పామూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన స్థానిక సెయింట్ మార్క్ విద్యార్థులను సీఐ ఎం.శ్రీనివాసరావు అభినందించారు. కందుకూరులో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ -14, అండర్-17 బాలబాలికల జిల్లా జట్లను ఎంపికచేశారు. అండర్ -17 విభాగంలో షేక్ దావుద్ ఇస్మాయిల్, అండర్ - 14లో షేక్ ఆయేషాతస్లీమ్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా గురువారం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాసరావును సెయింట్ మార్క్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.జయకుమార్, విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను సీఐ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ శ్రీనివాసరావు



జాతీయస్థాయి జల సంరక్షణ అవార్డు అందుకున్న రాజశేఖరరాజును అభినందిస్తున్న కలెక్టర్ రాజాబాబు, పాల్గొన్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

రాజశేఖరరాజును అభినందించిన కలెక్టర్

దర్శి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జలసంరక్షణ అవార్డు అందుకున్న డాక్టర్ పోదిలి రాజశేఖరరాజును కలెక్టర్ రాజాబాబు గురువారం అభినందించారు. డాక్టర్ రాజశేఖరరాజు ఈనెల 18న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతులమీదుగా ఢిల్లీలో ఈఅవార్డును అందుకున్నారు. ఈనేపథ్యంలో రాజశేఖరరాజు జిల్లా కలెక్టర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజశేఖరరాజును అభినందించారు. 20 ఏళ్ల పాటు నీటి వనరుల సంరక్షణకు చేసిన కృషిని ఆయన అభినందించారు. ఈఅవార్డు అందుకోవటం ద్వారా జిల్లాకు ఎంతో గౌరవం పెరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేంపాడులో ద్విచక్ర వాహనం చోరీ

ముండ్లమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన గోపనబోయిన నారాయణకు చెందిన ద్విచక్ర వాహనం బుధవారం రాత్రి చోరీకి గురైంది. ఇంటిముందు ఉంచిన వాహనం గురువారం ఉదయం లేచిచూడగా కనిపించలేదు. బాధితుడు నారాయణస్వామి ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే కాలనీకి చెందిన ఆదిశేషుకు చెందిన మోటారుసైకిల్ కూడా చోరీకి గురైంది.

జలవనరులను సంరక్షించుకోవాలి

దర్శి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు జలవనరులను సంరక్షించుకోవాలని ఏవో కెరాధ సూచించారు. మండలంలోని దర్శి, బొట్లపాలెం గ్రామాల్లో గురువారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను సాగు చేసుకోవాలని కోరారు. భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో రాణించిన మల్లంపేట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొనకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కౌశల్ క్విజ్ పోటీల్లో మండలంలోని మల్లంపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల కౌశల్‌క్విజ్ నిర్వాహకులు 6,7,8 తరగతులకు చెందిన జిల్లాలోని 400 పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీ పరీక్ష నిర్వహించారు. ఈపోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైన 20 పాఠశాలలకు చెందిన విద్యార్థుల్లో మల్లంపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు ఉన్నారు. వీరు ఈనెల 27న కౌశల్ క్విజ్ రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలో పాల్గొంటారని హెచ్‌ఎం పి.ఆనంద్‌బాబు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ఆనంద్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

శివనామ స్మరణతో మార్మోగిన కాశీ విశ్వేశ్వర స్వామి

ముండ్లమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో వేంచేసి ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయం భక్తులతో పోటెత్తింది. కార్తీక మాసం గురువారంతో ముగియటంతో నందీశ్వరునికి, కాశీ విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయం మారుమ్రోగింది. భక్తులకు అర్చకులు ప్రసాద్ తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా, మండలంలోని మారెళ్ళ గ్రామంలో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి పడి భజన కన్నుల పండువగా నిర్వహించారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

పీసీపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా రీసైక్లింగ్ సులభతరమవుతుందని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. గురువారం మండలంలోని పెదఅలవలపాడులో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తలను వేర్వేరు డబ్బాలలో వేయాలన్నారు. చెత్తను పారిశుధ్య కార్మికులు చెత్తసంపద కేంద్రాలకు తరలించి రీసైక్లింగ్ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు వగ్గంపల్లి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పామూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని వగ్గంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో ముగ్గురు విద్యార్థులు, అండర్ 14 విభాగంలో ఇద్దరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 12న కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 23న కర్నూల్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. అండర్ 17 బాలికల విభాగంలో బి.నాగ స్పందన, ఎస్.మహాలక్ష్మి, బాలుర విభాగంలో షేక్ మహమ్మద్ షమి ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం వెంకటనరసరాజు, వ్యాయమ ఉపాధ్యాయుడు ఎం.నరసింహారావు, ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య అభినందించారు.

విద్యార్థులతోనే దేశ భవిష్యత్తు

పామూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని ఎంఈవో పెద్దిరెడ్డి కోటిరెడ్డి అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీసీడీఎస్, స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎంఈవో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు అనిత, అమల, నారాయణమ్మ, భాగ్యలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

» ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ

కనిగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ అన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో గురువారం ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాలకార్మిక నిర్మూలన, సమానత్వం తెలిపే హక్కులను భారత రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. ఆయా హక్కులను ఎవరైన భంగం కల్గిస్తే శిక్షార్హులౌతారని తెలిపారు.

హక్కులకు భంగం కల్గించే సందర్భం చోటు చేసుకున్నప్పుడు 1098కి ఫోన్ చేయాలని పార్వతమ్మ సూచించారు. కార్యక్రమంలో లింగారెడ్డిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం బి.కోటిరెడ్డి, స్కూల్ అసిస్టెంట్ జె.అశోక్‌కుమార్, అంగన్‌వాడీ వర్కర్ సరస్వతి, హెల్పర్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ





శక్తిస్వరూపిణి..బగళాముఖి

పిట్లలవానిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో అమావాస్య హోమ పూజా కార్యక్రమాలను గురువారం ఘనంగా చేపట్టారు. 82వ అమావాస్య దివ్యహోమ కార్యక్రమాన్ని 9 మంది వేద పండితులు నిర్వహించారు. కార్తిక మాస అమావాస్య సందర్భంగా బగళాముఖి అమ్మవారు శక్తి స్వరూపిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రజా గొంతుకై.. పరిష్కారమై..

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'..ఫలితాలు

- వినుకొండలోని గాయత్రి నగర్, కొట్నాల్ల వీధికి మహర్దశ
- రూ.63.60 లక్షల వ్యయంతో రహదారులు, కాలువల నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



గాయత్రినగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరించిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు (పాత చిత్రం)

(వినుకొండ, ఆంధ్రజ్యోతి)

వినుకొండ పట్టణంలోని గాయత్రినగర్, కొట్నాల్ల వాసులను ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం లభించింది. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ వారి గొంతుకగా మారి పాలకులు, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లింది. 'అక్షరం అండగా పరిష్కారమే అజెండా' పేరిట ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అధ్యక్షతన సదస్సులు నిర్వహించింది. ఈ సదస్సుల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తాము ఎదుర్కొంటున్న సమస్యలను చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మునిసిపల్ అధికారులు, కౌన్సిలర్లు విన్నారు. సదస్సులో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రోడ్లు లేవన్నారు.. కొత్త సిమెంట్ రోడ్లు వచ్చాయి. డ్రెయినేజీ సమస్యా పరిష్కారమైంది. సుదీర్ఘ కాలంగా అయా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం (మిగతా 6వ పేజీలో)

అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..



గాయత్రినగర్‌లో కాలువ కట్ట గ్రావెల్ రోడ్డు



రూ.17.60 లక్షలతో ప్రగతి పనులు

రూ.45 లక్షలతో రహదారుల నిర్మాణం

కొత్తగా ఏర్పాటైన గాయత్రి నగర్ కాలనీలో గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్ట లేదు. తమ గోడును ఆంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలు వినిపించారు. జీవీ ఆంజేయులు స్థానిక వీధుల్లో పర్యటించారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేశారు. సాగర్ కాలవ కట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మించాలని కోరారు. రూ.45 లక్షల వ్యయంతో రెండు వీధుల్లో సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఈ రహదారులను జీవీ ఆంజనేయులు ప్రారంభించనున్నారు.

నాడు.. గాయత్రినగ్‌లో గ్రావెల్ రోడ్లు





నేడు నిర్మించిన సిమెంట్ రోడ్డు

కొట్నాల్ల వీధి వైసీపీ పాలనలో ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. తాగునీటి పైపులైన్ కోసం సిమెంట్ రోడ్డు పగల గొట్టి వదిలేశారు. మురుగు కాలువలు లేక అక్కడి ప్రజలు ఇక్కట్లు పడ్డారు. ఈ వీధిలో పేద ముస్లిం మైనార్టీ వర్గాలు నివశిస్తున్నాయి. ఇచ్చిన మాటకు కట్టుబడిన జీవీ కొట్నాల్ల వీధి అభివృద్ధికి బాటలు వేశారు. రూ.17.60 లక్షల వ్యయంతో ఆ ప్రాంత వాసులు కోరిన ప్రగతి పనులను చేపట్టి పూర్తి చేయించారు.



అధ్వాన స్థితిలో కొట్నాల్ల వీధి



సీసీ రోడ్డు, మురుగు కాలువలు

ఎస్సీ,ఎస్టీలకు న్యాయం చేయాలి

నిఘా కమిటీ సమావేశంలో కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలపై దాడులు, నేరాలు జరిగితే యంత్రాంగం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లా స్థాయి పర్యవేక్షణ, నిఘా కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు అత్యాచార నిరోధక చట్టం పక్కాగా అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న ఎస్సీ, ఎస్టీల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జీవో 95 ఆధారంగా బాధితులకు తక్షణమే సహాయ చర్యలు అందించాలన్నారు. గడిచిన రెండేళ్ళల్లో 152 కేసుల్లో బాధితులకు రూ.1.44 కోట్లు చెల్లించామన్నారు 29 కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, మరో 265 కేసులు కోర్టుపరిధిలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సఫాయి కర్మచారుల రహిత సమాజం నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, కమిటీ కన్వీనర్ రాజదెబోరా, సభ్యులు బి.పోతురాజు, భగవాన్‌దాసు, వెంకటప్రసాద్, సాల్మన్, డి.ఇమానీయేలు, యు.సుధాకర్ పాల్గొన్నారు.

ఆంజనేయునికి కదళి ఫలార్చన

శింగరకొండలో 10 వేల పండ్లతో పూజ



అద్దంకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి వారికి గురువారం కదళి ఫలార్చన వైభవంగా జరిగింది. అమావాస్య సందర్భంగా 10 వేల అరటి పండ్లతో పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ దాతలుగా అద్దంకికి చెందిన కొత్తమాసు రమేష్‌బాబు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మనాయుడు పాల్గొన్నారు.

డీసీసీబీ అక్రమాలపై చర్యలు?

- నేడో, రేపో సస్పెన్షన్లకు ఆదేశాలు
- కలెక్టరేట్‌కు చేరిన విచారణ నివేదిక

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లో జరిగిన అక్రమాలపై వేటుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే విచారణ నివేదిక పాలకవర్గంతో పాటు కలెక్టరేట్‌కు చేరినట్లు సమాచారం. దాంతో నేడో, రేపో భోక్తలపై చర్యలకు ఆదేశాలు జారీ అయ్యే అవకాశం ఉందని బ్యాంకు వర్గాలు తెలిపాయి. వైసీపీ హయాంలో జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు శాఖల్లో రూ.కోట్లలో అక్రమాలు వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. మూడు వారాలుగా నాబార్డు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేసి నివేదికలను అందజేశారు. జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు బాధ్యతలు తీసుకున్న అనతికాలంలోనే సీఈవోగా వ్యవహరిస్తున్న టీ కృష్ణవేణిని తప్పించి ఇన్‌చార్జిగా అజయ్‌కిశోర్‌ను నియమించారు. ఆయనను కూడా తప్పించి జీఎమ్‌గా వ్యవహరిస్తున్న వీవీఎస్ ఫణికుమార్‌ను ఇన్‌చార్జి సీఈవోగా నియమించారు. ఈ పరిణామాలు బ్యాంకు వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో గురువారం బ్యాంకు కీలక అధికారులపై వేటు వేశారన్న ప్రచారం జోరందుకుంది. అయితే అటువంటిది లేదని, త్వరలోనే పూర్తి స్థాయిలో చర్యలుంటాయని మక్కెన స్పష్టం చేశారు.

ఈ-క్రాప్.. కొలిక్కి

- ఎట్టకేలకు ఖరీఫ్ సీజన్ నమోదు పూర్తి
- మూడు సార్లు గడువు పెంచి.. సుదీర్ఘంగా ప్రక్రియ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ పూర్తయినట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. ఖరీఫ్ సీజన్ నమోదుకు ప్రభుత్వం తొలుత ప్రకటించిన గడువు సెప్టెంబరు 30 కాగా, తర్వాత దానిని అక్టోబరు 25 వరకు పొడిగించింది. అదే సమయంలో మొంథా తుఫాన్‌తో నమోదు ప్రక్రియ నవంబరు రెండో వారం వరకు కొనసాగింది. గతంలో ఈ-క్రాప్ నమోదు అనేది కేవలం సాగు విస్తీర్ణానికే పరిమితమయ్యేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం తొలిసారి వ్యవసాయ భూమితో పాటు ఖాళీగా ఉంటున్న బీడు భూములు, ఇళ్ల స్థలాలు, గ్రామ కంఠాలు ఇలా ప్రతి భూమిని సర్వే నెంబర్ల ఆధారంగా యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఈ-క్రాప్‌లో 2,75,000 ఎకరాలు సాగు విస్తీర్ణం నమోదు కాగా, మొత్తం భూముల వివరాలు 7,85,000 ఎకరాలుగా రికార్డుల్లో నమోదైంది. ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం


సంతమాగులూరు మండల పరిధిలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

3,10,000 ఎకరాలుగా వ్యవసాయశాఖ అంచనా వేయగా ఈ-క్రాప్ నమోదు వందశాతం జరిగిందని అధికారులు ప్రకటించారు. అయితే అంచనా సాగుకు 35,000 ఎకరాల దూరంలో ఖరీఫ్ ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇంకోవైపు మొంథా తుఫాన్ నష్టం నమోదు సమయంలో ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా కూడా యాప్‌లో ఇచ్చిన ఆప్షన్ మేరకు సాగు వివరాలు నమోదు చేసినట్లు యంత్రాంగం అప్పట్లో చెప్పింది. దాదాపు 2,200 ఎకరాల వరకు నష్టం వివరాలు నమోదు తర్వాతనే ఈ-పంట రికార్డుల్లోకి ఎక్కినట్లు తెలుస్తోంది

ఈ సారైనా పక్కాగా జరిగిందా..

ఈ-క్రాప్ నమోదు అస్తవ్యస్తంగా జరగడం వల్ల దిగుబడులు అమ్ముకునే సమయంలో రైతులకు కడగండ్లు సర్వసాధారణమైపోయింది. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా నమోదు వల్ల సాగు జరిగింది ఓ పంటయితే రికార్డుల్లో మరో పంట దర్శనమివ్వడంతో రైతులు అనేక ప్రయోజనాలకు దూరమైన ఉదంతాలున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి ఈ దఫా పక్కా కచ్చితత్వంతో ఈ-పంట నమోదు జరగాలనే ఆదేశాలు ప్రభుత్వం నుంచి వచ్చాయి.

మున్సిపాల్టీకి.. వాస్తుభయం

- ఉన్న గేట్లు మూసి.. మరో గేటు తెరిచారు


కార్యాలయం తూర్పు వైపు గేటు మూసి ఏర్పాటు చేసిన రేకు

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పురపాలక సంఘానికి వాస్తుభయం పట్టుకుంది. అధికారులు మారిన ప్రతిసారి ఏదో ఒక పనిచేయించి తమకు అనుకూలంగా వాస్తు ఉందని సంతృప్తి పడుతున్నారు. తాజాగా పురపాలక సంఘ కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాలును నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌గా మార్చారు. వాస్తు దోషం అని అప్పటికే మధ్యలో ఉండే గేటును మూసేసి గోడకట్టారు. ఈశాన్యంలో ఉన్న గేటును తెరిచి రోడ్డు వేశారు. అదేవిధంగా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభం రోజు కార్యాలయం లోనికి వచ్చే తూర్పు, పడమర వైపు ఉన్న గేట్లను మూసేశారు. పైగా గేటు కనిపించకుండా రేకులు వెల్డింగ్ చేయించారు. ఈశాన్యం మూలన ఎప్పటి నుంచో మూసి ఉన్న గేటును తెరిచారు. కార్యాలయానికి వచ్చేవారు మూసి ఉన్న గేట్లు చూచి కార్యాలయం పనిచేయడం లేదా అని ఆశ్చర్యపోతున్నారు. ఆ తర్వాత ఆరా తీసి ఈశాన్యం గేటులో నుంచి కార్యాలయంలోకి వెళ్తున్నారు.


కార్యాలయం ఈశాన్యం వైపు తెరిచిన గేటు

మత్స్యకారుల సంక్షేమంపై సర్వే


3 నుంచి మెరైన్ ఫిషరీస్ సెన్సెస్



చీరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఈ నెల 3 నుంచి మెరైన్ ఫిషరీస్ సెన్సెస్-2025 యాప్‌తో సర్వే చేపట్టింది. మత్స్యకార నిరుద్యోగులకే సర్వే బాధ్యతలను అధికారులు అప్పగించారు. ఒక్కో ఇంటికి రూ.50 చొప్పున సర్వేలో పాల్గొన్న వారికి చెల్లిస్తున్నారు. ఈ సర్వేతో క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి మత్స్యకార జనాభాతో పాటు, నిరుద్యోగులు, జీవనస్థితి గతులను పరిశీలించనున్నారు. బాపట్ల, రేపల్లె, కర్లపాలెంలో కొంతభాగం, నిజాంపట్నం, చీరాల, వేటపాలెం, చిన గంజాం మండలాల పరిధిలో 62 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మోటారు బోట్లు 2480, నాటు బోట్లు 250 వరకు ఉన్నాయి. సర్వేఆధారంగా మత్స్యకార జీవన మనుగడకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళిక చేపట్టనున్నాయి.

కోసేద్దాం.. అమ్మేద్దాం..

- దుగ్గిరాల : హార్వెస్టర్‌తో వరి కోత కోసి ధాన్యం పట్టలపై పోస్తున్న చిత్రం


లారీలకు ఎత్తేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

ఏపుగా పెరిగిన వరి కళ్లెదుట ఉండగా.. తుఫాన్ భయం అన్నదాతలను వెంటాడుతోంది. వాతావరణశాఖ హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కోతలతో పాటు అమ్మకానికి సిద్ధమవుతున్నారు. ఏ మాత్రం ఆలస్యం చేసినా వర్షంతో మునిగిపోతామని.. హడావుడి పడుతున్నారు. ఆందోళన అవసరం లేదు.. ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. తుఫాన్ హెచ్చరికలతో రైతులు కోసేసి.. అమ్మేస్తున్నారు. కూలీలతో అయితే ఆలస్యం అవుతుందని యంత్రాలతో ధాన్యం కోసేస్తున్నారు. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని రైతులు ఎగబడి మరీ ధాన్యం కోస్తుండటం.. ఇదే అదనుగా దళారులు, వ్యాపారులు కొనుగోళ్లకు ఎగబడుతున్నారు. అయితే రైతులకు మద్దతు ధర దక్కడంలేదు. అయినా రైతులు కోసేద్దాం.. అమ్మేద్దాం అన్నట్లుగా పరుగులు పెడుతున్నారు.

- తుఫాన్ హెచ్చరికలతో వరి కోతలు
- గట్టెక్కితే చాలన్నట్లుగా రైతన్నల పరుగులు
- యంత్రాల వినియోగం.. కల్లాల్లోనే విక్రయాలు
- మద్దతు రూ.1791.75 కాగా.. రూ.1400కే విక్రయం

తెనాలి,బాపట్ల నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు తుఫాన్ హెచ్చరికలతో.. పొలాల్లో హార్వెస్టర్లు పరుగులు పెడుతున్నాయి. రాత్రి పగలు విరామం లేకుండా కోత కోసేస్తున్నాయి. కోసిన ధాన్యం కల్లాలపై ఆరబెట్టే పనికూడా లేకుండా అన్నదాతలు వ్యాపారులకు అమ్మేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో రెండు, మూడు రోజుల నుంచి ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కృష్ణా పశ్చిమ డెల్టా కింద బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారు. కాగా గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో సుమారు 2.5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో కోతలకు సిద్ధంగా ఉంది. సాధారణ పరిస్థితుల్లో అయితే పూర్తిగా చేలు తడారాక మనుషులతో కోతలుకోసి, పనలు చేలపై ఆరబెట్టి, కుప్పలు వేస్తారు. కానీ వాయుగుండం, తుఫాన్ హెచ్చరి కలతో యంత్రాలతో కోతకోసి అమ్మేసుకుంటున్నారు. తేమ ఎంత ఉన్నా 75 కిలోల బస్తాకు రూ.1350 నుంచి రూ.1450 వరకు చెల్లించి వ్యాపారులు రైతుల నుంచి కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు కూడా ముందు వెనక ఆలోచించకుండా ఎంతోకొంత ధర వస్తుందని అమ్మేసుకునేందుకే ఆసక్తి (మిగతా 6వ పేజీలో)


వేమూరు-చంపాడు మధ్య ఆరబోసిన ధాన్యం

బస్తాకు రూ.200పైగా నష్టం

బాపట్ల జిల్లాలో 75 కిలోల బస్తా ధర రూ.1350 నుంచి రూ.1400 వరకు చెల్లిస్తుంటే, గుంటూరు జిల్లా పరిధిలోని కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో బస్తాకు రూ.1450 వరకు ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఈ ప్రకారం చూస్తే బస్తాకు రూ.200 పైనే రైతులు నష్టపోతున్నారు. తుఫాన్, వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధర విషయంలో ఆలోచించడంలేదు. ఇదే అవకాశంగా రైతుల తొందరను వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

నయన మనోహరం.. కార్తీక నర్తనం

నృత్యాలతో అలరించిన చిన్నారులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల చిన్నారి మొదలు దాదాపు 50 మంది చిన్నారులు గురువారం రాత్రి ప్రదర్శించిన కార్తీక నర్తనం కార్యక్రమం నయన మనోహరంగా సాగింది. కార్తీక మాసం ముగింపు సందర్భంగా స్థానిక కేశవస్వామి పేట శ్రీ గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో చందూ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఈ కార్తీక నర్తనం కార్యక్రమాన్ని ప్రదర్శించారు. అనేక భక్తిగీతాలకు తాళలయబద్ధంగా వారు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేసింది. ముందుగా జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో విఘ్నేశ్వర ప్రార్థన, గణపతికేత్వం, శివతాండవం, ఆనంద తాండవం, భవమృడహర కీర్తన వంటి దాదాపు 30 భక్తిగీతాలకు చిన్నారులు శ్రీశంతన, యశస్విని, అంకిత, మౌనిక, పి.యశస్వి, గాయత్రి, మిధిల, స్పందన, శరణ్య, రాజశ్రీ తదితర 50 మంది చిన్నారులు నృత్యాలను ప్రదర్శించారు. డాన్స్ అకాడమీ శిక్షకులు త్రోవగుంట చందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల బాలకోటయ్య, అనూషాలు నిర్వాహకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్.శివశంకర్, తూము సుబ్బారావు తదితరులు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు కళలపట్ల ఆసక్తిని తల్లిదండ్రులు పెంపొందించాలని, అప్పుడే వారు భవిష్యత్‌లో మంచి కళాకారులుగా తయారవుతారని, వందలాది మంది చిన్నారులకు గత మూడు దశాబ్దాలుగా నృత్యంలో శిక్షణనిస్తున్న చందూ మాస్టర్ కృషి అభినందనీయమని అన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థిని నృత్యభంగిమ



నృత్యం చేస్తున్న చిన్నారులు

చాకుతో పొడిచి గిరిజనుడి హత్య

అవీఇవీ



అంకన్న మృతదేహం

పెద్దదోర్నాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లాడున్న తల్లికి సారా ఎందుకు పోస్తున్నావని అడిగినందుకు చాకుతో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని పెద్దమంతనాల గిరిజనగూడెంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పెద్దమంతనాలకు చెందిన అర్తి నాగన్న అతని అన్న కొడుకైన అర్తి అంకన్న(27)ను చాకుతో పొడవగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అర్తి అంకన్న, అతని తండ్రి రామారావు హనుమాన్ జంక్షన్‌కు వెళ్లి దోమతెర కర్రలు అమ్ముకుని సాయంత్రం ఇంటికి చేరే సరికి అతని అంకన్న భార్య దేవమ్మకు నాగన్న సారా తాగాలని గ్లాసులో పోస్తుండడం అంకన్న చూశాడు. నెలల పిల్లాడితో ఉన్న తన భార్యకు సారా ఎందుకు పోస్తున్నావని నాగన్నను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఘర్షణ పెద్దది కావడంతో నాగన్న విల్లంబుతో దాడి చేయబోగా అంకన్న అంబును విరిచేశాడు. అంతటితో ఆగక తన వద్ద ఉన్న చాకుతో అంకన్న గుండెపై బలంగా పొడవడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. నాగన్న అక్కడ నుంచి పారిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వైద్య చికిత్స నిమిత్తం ఆటోలో దోర్నాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో దోర్నాల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. హత్య విషయం తెలియడంతో మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఎర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్ వైద్యశాలలోని మృతదేహాన్ని పరిశీలించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 14, 17 కబడ్డీ పోటీలలో విద్యార్థులు వి.మహేష్, ఎం.అజయ్ అండర్ 14కు, ఎం.జశ్వంత్ నాయక్, పి.అజయ్, ఎం.వి.రాజశేఖర్ రెడ్డిలు అండర్ 17జట్టుకు ఎంపికై మచిలీపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ఆడతారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.దామోదర్‌రెడ్డి, డి.శ్యామలాదేవి, కె.ఓబులేశును అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గజ్జలకొండ విద్యార్థులు

మార్కాపురం రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని గజ్జలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్యామ్‌శుభాకర్ గురువారం తెలిపారు. విద్యార్థులు ఎం.రుబాస్, జి.అభిలాష్, అండర్-14లో, సూర్యతేజ అండర్-17లో ప్రకాశం జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. మచిలీపట్నంలో జరగబోయే అండర్-14, కర్నూలులో జరిగే అండర్-17 కబడ్డీ పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజారపు అచ్చయ్యను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

21 నుంచి అక్రిడిటేషన్‌లకు దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు రెండేళ్ల(2026-27) కాలపరిమితికి సమాచార పౌరసంబంధాల శాఖ జారీచేసే నూతన అక్రిడిటేషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు అర్హత కలిగిన జర్నలిస్టులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ ఏడాది నవంబరు 30 నాటికి ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపట్టామన్నారు. జిల్లా నుంచి ప్రచురితమవుతున్న ప్రింట్ మీడియా, జిల్లా నుంచి ప్రసారమవుతున్న ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపర్చాల్సి ఉన్నందున సంబంధిత పత్రాలను పెన్‌డ్రైవ్‌లో పొందుపర్చడంతో పాటు జెరాక్స్‌కాపీలను కూడా సమాచార శాఖ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఈనెల 21 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

డ్రైవర్‌కు గాయాలు

మేదరమెట్ల, నవంబరు 20 : జాతీయ రహదారి వెంబడి మేదరమెట్ల ఫైలాన్ వద్ద ముందువెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని లారీ ఢీ కొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. బుధవారం రాత్రి విజయవాడ నుంచి నగరికి ఎక్స్‌కవేటర్‌తో వెళుతున్న లారీ ముందు వెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో లారీ డ్రైవర్ వైపు దెబ్బతినడంతో, లారీ డ్రైవర్ కంభంపాటి వినయ్‌కాంత్‌కు గాయాలయ్యాయి. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని బూరేపల్లిలో గురువారం ఉదయం గొలుసు దొంగతనం జరిగింది. పారిశ్రామిక వాడ సమీపంలోని బూరేపల్లి పునరావాస కాలనీకి చెందిన రావిపాటి వెంకటరత్నం ఇంటి ముందు ఉండగా దుండగుడు మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని గొలుసు లాక్కుని పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కోసేద్దాం.. అమ్మేద్దాం

(5వ పేజీ తరువాయి)

చూపుతున్నారు. 75 కిలోల ధాన్యం బస్తా ఏ గ్రేడ్ అయితే రూ.1791.75గా, కామన్ రకాలకు రూ.1776.75గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. పైగా కొనుగోలు కేంద్రాల్లోనూ తేమ శాతాన్ని బట్టి రేటు నిర్ణయించినా అయినా రైతులు వ్యాపారులకే అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు. కల్లాల్లోని ధాన్యం 27 శాతానికి మించి ఉండటంలేదు. మార్కెటింగ్ 27 శాతం తేమ ఉన్నా రూ.1612.57 చొప్పున ధర చెల్లిస్తున్నది. దీనిపై అవగాహన లేని రైతులు తమ చేతిలో నుంచి ధాన్యం వ్యాపారులకు వెళ్లిపోతే చాలన్నట్లు అక్కడికక్కడే రూ.1400 ధరకే అమ్మేసుకుంటున్నారు. ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని, రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు పెద్దగా ఇబ్బంది పడాల్సిన పనిలేదంటూ మంత్రి మనోహర్ చెప్తున్నారు. పైగా వాట్సప్‌లో 7337359375 అనే నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పెడితే కొనుగోళ్ల ప్రక్రియ సులభతరం చేశామంటున్నా రైతులు ఆగడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో 17 శాతం మాత్రమే తేమ ఉండాలని, అంతకు మించి ఉంటే కొనుగోలు చెయ్యరంటూ వ్యాపారులు కూడా రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని సమాచారం.

ప్రజా గొంతుకై.. పరిష్కారమై!

(5వ పేజీ తరువాయి)

లభించింది. సిమెంట్ రోడ్లను చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇందుకు మునిసిపాల్టీ ఏర్పాట్లు చేసింది. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆంధ్రజ్యోతి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా.. అని సమస్యలను ప్రజా ప్రతినిధులు.. అధికారులకు నివేదించేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రజల గొంతుకైంది. అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజల వద్దకే తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించింది. వినుకొండ మునిసిపాల్టీలోని 23, 31 వార్డుల్లో 'ఆంధ్రజ్యోతి' అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా.. కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆంధ్ర జ్యోతి వేదికగా ప్రజలు సమస్యలపై గళం వినిపించారు. గాయత్రినగర్.. కొట్నాల్ల వీధిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు అర్జీల రూపం తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జీవీ ఆంజనేయులు నడుంకట్టారు. అయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ.63.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు.. మురుగు కాల్వలను నిర్మించారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రామరాజ్యం పేరుతో రాక్షస పాలన సాగిస్తుందని ఆరోపించారు. ప్రతి రోజు మావోయిస్టులను దారుణంగా కాల్చిచంపడమే పనిగా పెట్టుకుందన్నారు. ఆయుధాలు ఉన్నాయనే పేరుతో కేంద్ర బలగాలు అమాయకులైన గిరిజన ప్రజలను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాము చర్చలకు సిద్ధమని ఒక పక్కా వారు ప్రకటనలు చేస్తున్నా కేంద్రప్రభుత్వం మారణకాండను కొనసాగిస్తూనే ఉందని రామకృష్ణ మండిపడ్డారు. గిరిపుత్రులను చర్చలకు పిలిచి వారి సమస్యలపై చర్చించి వాటికి పరిష్కార మార్గం చూపాల్సిన ఉండగా, అందుకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు పూర్తిస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఒక హంతక ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వాదులందరూ ఈ ఘటనలను ఖండించాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎన్‌కౌంటర్లను ఖండించే వారిపై కూడా కేసులు ఉంటాయని, తమ నెక్ట్స్ టార్గెట్ అర్బన్ మావోయిస్టులని పేర్కొనడం దుర్మార్గంగా ఉందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, ఎంఏ సలార్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

రోడ్లపై దుమ్ము లేవకుండా నీటిని చల్లించిన ఎస్ఐ

ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో స్పందన

బల్లికురవ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ నాలుగు రోడ్ల కూడలి నుంచి ప్రతి రోజు గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి డస్టు తోలడంతో రోడ్లపై విపరీతమైన దుమ్ము వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో డస్టు అలర్జీ వచ్చి అనారోగ్యం బారిన పడుతున్నారు ఈ సమస్యను ప్రజలు ఎస్ఐ నాగరాజు దృష్టికి గురువారం మధ్యాహ్నం తీసుకు పోయారు. వెంటనే ఎస్ఐ రాత్రికి ట్యాంకర్‌ను తెప్పించి నాలుగు రోడ్ల వెంబడి నీటిని దగ్గర ఉండి చల్లించే పనులు చేయించారు. మండల టీడీపీ అధ్యక్షులు దూళిపాళ్ల హనుమంతురావు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి రోజు తానే ట్యాంకర్ ద్వారా నీటిని చల్లిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజాసమస్యపై సత్వరమే స్పందించిన ఎస్ఐ నాగరాజుకు, టీడీపీ నేతలకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



నీళ్లు చల్లిస్తున్న ఎస్సై

శింగరకొండ మారుతి భవన్‌కు దుప్పట్లు అందజేత

అద్దంకి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆధ్వర్యంలో నిర్వహించే మారుతి భవన్‌లో 30 గదులలో భక్తుల వసతికి అవసరమైన దుప్పట్లను గురువారం పీడీసీసీ బ్యాంకు మాజీ డెరెక్టర్ సందిరెడ్డి రమేష్, సందిరెడ్డి కొండలరావులు అందజేశారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు చుండూరి మురళి సుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మనాయుడు, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో హుండీల కానుకలను గురువారం లెక్కించారు. మూడు నెలల కాలానికి రూ.39,76,505 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటితోపాటు 60 గ్రాముల బంగారం, 1540 గ్రాముల వెండి, ఇతర దేశాల కరెన్సీ నోట్లు కూడా వచ్చాయి. హుండీల లెక్కింపును కొటప్పకొండ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు, శింగరకొండ అసిస్టెంట్ కమిషనర్ తిమ్మనాయుడు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, సభ్యులు పర్యవేక్షించారు.



దుప్పట్లను అందజేస్తున్న సందిరెడ్డి రమేష్, కొండలరావు

గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

- ఎమ్మెల్యే కొండయ్య సూచన

చీరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలకు అర్హీ దారులు ఈనెల 30లోగా దాఖలు చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో నియోజకవర్గంలో ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.



సూచనలిస్తున్న కొండయ్య

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి



స్టీల్ వాటర్‌బాటిల్స్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

అద్దంకి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. గురువారం అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, గాజులపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లను, గురకాయపాలెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలను స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు పరిశీలించారు. పారిశుద్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌కు బదులు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను వినియోగించాలని సూచించారు.

పింఛన్ సమస్యకు వేగవంతంగా పరిష్కారం

పీజీఆర్ఎస్‌లో మహిళ అర్జీ

దేవాంగపురి(చీరాల), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న పింఛన్ సమస్యలను అధికారులు వేగంగా స్పందించారు. మండల పరిధిలోని దేవాంగపురికి చెందిన ఎర్ర నారాయణ వృద్ధాప్య పింఛన్ దారుడు. అయితే ఆయన ఇటీవల మృతి చెందడంతో స్పౌజ్ పింఛన్‌కు మతుని భార్య పలుమార్లు అర్జీలు చేసుకున్న ఫలితం లేదు. దీంతో ఇటీ వల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా యంత్రాంగం సమస్యకు పరిష్కారం చూపింది. ఆయా సచివాలయ పరిధిలోని సిబ్బందికి ఆదేశాల జారీ చేయడంతో వారి విషయాన్ని పరిశీలించి వెంటనే ఆమెకు పింఛన్ మంజూరు పత్రాని అందజేశారు.



సొమ్ము అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

ఘనంగా పడిపూజ

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం గురువారం మద్దిపాడు పాత సిండికేట్ బ్యాంకులో ఘనంగా జరిగింది. పూజారి గంగాధర్ పంతులు ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు, శివ, భవానీ స్వాములు ఈ పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కనమర్లపూడి సుబ్బారావు, శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు.

పుస్తకాలతో ర్యాలీ



పుస్తకాలతో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):అద్దంకిలో 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అద్దంకి పట్టణంలోని పలు ప్రధాన వీధులలో విద్యార్థులు పుస్తకాలతో ర్యాలీ నిర్వహించారు. అద్దంకిలోని మొత్తం 200 మందికి పైగా విద్యార్థులు గ్రంథాలయం నుండి మున్సిపల్ ఆఫీస్ నుండి పాత బస్టాండ్ సెంటర్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రం ఆ ర్గనైజర్ మన్నం త్రిమూర్తులు, గ్రంథాలయ అధికారిణి వసుంధరదేవి, రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ పి. పేరయ్య, శేషారెడ్డి, సుగుణరావు, బాబురావు, శ్రీనివాసరావు, ఆనంద్, బుజ్జిబాబు, బీ రయ్య, ఆదినారాయణ, అబ్రహం, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో అభివృద్ధి చేసుకోవాలి

ఒంగోలు(రూరల్), నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీపనులతో దశరాజుపల్లి గ్రామస్థులు గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఏపీవో నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని దశరాజుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గురువారం సమావేశం జరిగింది. ఈసమావేశంలో గ్రామానికి సంబంధించి చేయాల్సిన పలు పనులను గుర్తించారు. గ్రామసర్పంచ్ పులిచర్ల శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ మాలంపాటి యానాదినాయుడు, పంచాయతీ కార్యదర్శి గరువర్ధిని తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పొగ నాట్లు

ఇప్పటికే 800 హెక్టార్లలో పూర్తి

నారు మూట రూ. 6 నుంచి 7వేలు వెచ్చించి కొనుగోలు

మళ్లీ తుఫాన్ హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లు



ఒంగోలు రూరల్ మండలం ముక్తినూతలపాడులో పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

ఒంగోలు(రూరల్),నవంబరు20(ఆంధ్రజ్యోతి):ఒంగోలు పొగాకు వేలంకేంద్రం రెండు పరిధిలో పొగాకు నాట్లు ఊపు అందుకున్నాయి. ఇప్పటికే రైతులు 800 హెక్టార్లలో పూర్తి చేశారు. గత సంవత్సరం ఒంగోలు పొగాకు వేలంకేంద్రం రెండు పరిధిలో 5,150 హెక్టార్లలో పొగాకు వేశారు. ఈసంవత్సరం సాగు తగ్గేపరిస్థితులు కనబడుతున్నాయి. నవంబరు మొదటి వారంనుంచి ప్రారంభించాల్సిన నాట్లు ఈసంవత్సరం మొంథా తుఫాన్‌తో ఆలస్యం అయ్యాయి.వేలంకేంద్రం రెండు పరిధిలోని ఉలిచి, మద్దిరాలపాడు, అమ్మనబ్రోలు, కేశినేనిపాలెం గ్రామాలలో పొగనారుమడులు సాగు చేశారు. మొంథాతుఫాన్ ప్రభావంతో గుండ్లకమ్మకు వరదలు రావడంతో నారుమళ్లుపూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కొందరు రైతులు దొమ్మేరు, రాజమండ్రి నుంచి, మరికొందరు జిల్లా పరిధిలోని చోడవరం, కామేపల్లి నుంచి పొగనారు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పొగనారు మూట రూ. 6వేలు నుంచి 7వేలు రూపాయలకు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. ఈ తరుణంలో మళ్లీ తుఫాన్ హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లుపరుగెడుతున్నాయి. ఈ ఏడాది పొగాకు బోర్డు ఒక్కో బ్యారన్‌కు 4.75 ఎకరాలు మాత్రమే సాగుకు అనుమతి ఇచ్చింది. అయినా వాతావరణ శాఖ హెచ్చరికలతో పాటు అదును దాటి పోతుండటం, ఇంకా పలు చోట్ల భూములు ఆరకపోవడంతో ఈ ఏడాది అనుకున్నదానికంటే పొగాకు సాగు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు : మండలంలోని పలుగ్రామాలలో పొగాకు నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెలలోనే నాట్లు సాగాల్సి ఉండగా మొంథా తుఫాన్ హెచ్చరికలతో రైతాంగం వెనుకంజవేసింది. అనుకున్నట్లుగానే తుఫాన్ ప్రభావంతో ఈ ప్రాంతంలోని నారుమడులు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు దూర ప్రాంతాల నుంచి నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. మరో వైపు సీజన్ దాటిపోవడంతో అద్దంకి, మేదరమెట్ల ప్రాంతాల నుంచి కూలీలను ఒక్కో జతకు రూ. 1,150 చొప్పున చెల్లించి తీసుకొస్తున్నారు. పొగాకు మొక్కలు నాటేందుకు అవసరమైన నీటిని కొందరు వాటర్ ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసి వేస్తున్నారు. దీంతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.



నాగులుప్పలపాడు మండలం చదలవాడలో పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

అవీ..ఇవీ..

అర్హులైన ప్రతి రైతుకు పంట రుణం



జెండాను ఎగురవేస్తున్న సంఘం అధ్యక్షుడు రామారావు

బల్లికురవ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకు ద్వారా అర్హత ఉన్న ప్రతి రైతుకు పంటరుణంతో పాటు దీర్ఘకాలిక రుణాలను సకాలంలో అందించేలా కృషి చేస్తామని కొమ్మినేనివారిపాలెం సొసైటీ అధ్యక్షులు కొమ్మాలపాటి రామారావు పేర్కొన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపులో భాగంగా కొమ్మినేనివారిపాలెం సొసైటీ కార్యాలయం వద్ద జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సహకార సంఘం పరిధిలో ఎనిమిది వందల మంది రైతులకు సుమారు రూ. 12 కోట్ల మేర రుణాలను ఇప్పటి వరకు అందించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైన రైతులు రుణాలు పొందాల్సి ఉంటే వెంటనే సంప్రదించాలన్నారు. ఏటా రైతులకు ఇబ్బందులు లేకుండా పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ మండల ఇన్‌చార్జ్ నూతలపాటి శ్రీనివాసరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సభ్యులు దివ్వె రాధ, కీర్తి పాటి శ్రీనివాసరావు, సీఈవో మిరాయాల ఖజారావు, రైతులు పాల్గొన్నారు.

బ్లేడుతో దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

మార్టూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): బ్లేడుతో దాడిచేసిన వ్యక్తిపై మార్టూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వలపర్ల గ్రామంలో తన్నీరు అంకమ్మరావు అనే వ్యక్తి బ్లేడుతో కుంచాల ఆంజనేయులు అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరిచాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం అంకమ్మరావు మద్యం సేవించి, తనతో సక్రమంగా మాట్లాడడంలేదని బ్లేడుతో ఆంజనేయులు గడ్డంపై, ఛాతీపై గాయపరచారు. ఈ మేరకు ఆంజనేయులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. దీంతో ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం ఆదారంగా, ఆంజనేయులు ఫిర్యాదు మేరకు గురువారం అంకమ్మరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

రెస్టారెంట్ల నిర్వాహకులకు నోటీసులు



పంగులూరులో ఫ్రీజ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పంగులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంగులూరులో అనుమతి లేకుండా రెస్టారెంట్లు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులకు ఫుడ్‌సేఫ్టీ అధికారులు 31 నోటీసులు జారీ చేశారు. చీరాల డివిజన్ ఫుడ్ సేఫ్టీ అధికారి పి.ప్రణీత్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పంగులూరులోని రెస్టారెంట్లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. రెస్టారెంట్లలోని వంటశాల, అందులోని వంటపాత్రలు, ఫ్రిజ్‌లో నిల్వఉంచిన పెరుగుతో పాటు ఇతర తినుబండారాల తయారీకి వినియోగించే పదార్థాలను తనిఖీ చేశారు. రెస్టారెంట్లలో పరిశుభ్రత లేదని, ఈగలు, దోమలు గుర్తించామన్నారు. పరిశుభ్రతలేని ప్రదేశాలలో రెస్టారెంట్లు నిర్వహించడం నేరమన్నారు. రెస్టారెంట్ల నిర్వహణకు 14 రోజుల్లో లైసెన్స్‌కు ధరఖాస్తు చేసుకుని లైసెన్స్‌లు పొందాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరివెంట డీసీఎంఐ. బాపట్ల ఇన్‌చార్జ్ డి.ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి

అద్దంకి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణం, మండలంలోని అన్ని దేవాలయాల వద్ద అధికారులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని సీఐ సుబ్బరాజు సూచించారు. ప్రధానంగా భక్తులరద్దీ ఎక్కువగా ఉండే సమయంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యలలో భాగంగా హుండీలను మరింత రక్షణ ఉండే స్థలాలలో ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

అగ్రహారం భూములకు అన్నదాత సుఖీభవ

- ఒకేసారి రైతుల ఖాతాల్లో రూ.10వేలు జమ
- ప్రభుత్వ పెద్దల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన రైతులు



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి రవికుమార్, సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

బల్లికురవ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాసు పుస్తకాలు లేకుండా అగ్రహార భూములు సాగు చేస్తున్న రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తూ, రైతుల ఖాతాల్లో నగదు గురువారం ఉదయం నుంచి జమ చేస్తోంది. బల్లికురవ మండలం ముక్తేశ్వరం, చెన్నుపల్లి, భూషాయవారిపాలెం, మక్కెనవారిపాలెం, కొండాయపాలెం, కొత్తపాలెం గ్రామాల పరిధిలో 880 మంది రైతులు సుమారు 5 వేల ఎకరాల అగ్రహార భూములను దశాబ్దాల నుంచి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం మెదట్లో పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించింది. దీంతో రైతులు తమ సమస్యను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. తమకు గతంలో కూడా పెట్టుబడి సాయం ఇచ్చారని వారు ఆయన దృష్టికి తీసుకుపోయారు.. దీంతో వెంటనే మంత్రి రవికుమార్ కలెక్టర్‌తో మాట్లాడి రైతుల సమస్యను వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం వెంటనే గతంలో అందించిన ఒక విడత ఇప్పుడు అందిస్తున్న రెండో విడత సాయం మొత్తం కలిపి 880 మంది రైతులకు పది వేల చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాలో గురువారం నుంచి నగదు జమచేస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్యను సత్వరమే పరిష్కరించేలా కృషి చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఆరు గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పీఎం కిసాన్ పథకాన్ని కూడా ఆరు గ్రామాల రైతులకు వర్తించేలా ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరుతున్నారు.

చెన్నుపల్లిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అగ్రహార భూములు సాగుచేస్తున్న రైతులకు కూడా పెట్టుబడిసాయం అందించడంతో గురువారం సాయంత్రం మండలంలోని చెన్నుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రపటాలకు పాలాభి షేకం చేశారు. రెండు విడతల సాయం ఒకేసారి రూ. 10 వేలు తమకు అందిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి శంకర్, కొండేటి ఇజ్రాయల్, అట్లూరి నాగేశ్వరరావు, గొట్టిపాటి కిషోర్, మండల తెలుగు యువత నాయకులు గంగవరపు కాశీరావు, యాగంటి శ్రీనివాసరావు, దివ్వె రామాంజనేయులు, వెంకట్రావు, గోవిందు, వీరయ్య పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథపాలకుడు, ఉపాధ్యాయులు దాతలు

చినగంజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాఖ గ్రంథాలయం చినగంజాంలో నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాలను పురస్కరించుకొని గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, తెలుగు పద్యాలు లెమన్‌స్పూన్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథపాలకుడు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో బి.అజయ్‌బాబు, చినగంజాం, రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నతపాఠశాలల హెచ్‌ఎంలు కె.శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్.పోతురాజు, రిటైర్డ్ ఆంధ్రాబ్యాంకు మేనేజర్ పర్వతరెడ్డి కాంతారావు, రిటైర్డ్ ఈ.ఈ కుర్రి రామసుబ్బారావు, భావనారాయణస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకట రామానుజన్‌లు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివవెంకటపోతురాజు ఉపాధ్యాయులు చుండూరి వెంకట్, వై.రామాంజనేయులు, దామోదర్‌రెడ్డి, ఎన్.రామాంజనేయులురెడ్డి, బ్రహేంద్ర కుమార్‌రెడ్డి, శాంత కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టుకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

చినగంజాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టుకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పలువురు ఎంపికైనట్లు హెచ్‌ఎం. కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కనిగిరి మండలం కంచర్లవారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన అండర్-17, అండర్-14 జిల్లా కబడ్డీ జట్లు ఎంపికైనట్లు పీడీ గంటా అంకమ్మ తెలిపారు. జిల్లా జట్టు ఎంపికలో ప్రతిభ చూపిన మేడికొండ హర్ష, వేణుగోపాల్‌రెడ్డిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న హర్ష అండర్-17 ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టుకు, 8వ తరగతి చదువుతున్న వేణుగోపాల్ రెడ్డి అండర్-14 జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించే అంతర్ జిల్లాల అండర్-17 కబడ్డీ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు తరుపున హర్ష, మచిలీపట్నంలో జరిగే అండర్-14 కబడ్డీ పోటీలలో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో నూరుశాతం అక్షరాస్యత సాధించాలి

ఎంపీడీవో స్వరూపారాణి



వయోజన వాచకాన్ని అందజేస్తున్న ఎంపీడీవో

పంగులూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం అమలు ద్వారా నూరుశాతం అక్షరాస్యత సాధించాలని ఎంపీడీవో కే.స్వరూపారాణి అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లకు అక్షరఆంధ్ర అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో చదువుకు నోచుకోని 15సంవత్సరాల వయస్సు పైబడిన వయోజనులకు వారి దైనందిన జీవితంలో ఉపయోగపడేలా చదవడం, రాయడంతో పాటు సంఖ్యా పరిజ్ఞానం నేర్పించాలన్నారు. మండలంలో ఉపాధిహామీ పథకంలో పనిచేసే శ్రామికులలో 640 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించి వారికి 64మంది వలంటీర్లు చదువు నేర్పేవిధంగా కార్యక్రమం రూపొందించినట్లు పర్యవేక్షకులు కొణిదన మనోరంజన్ బాబు తెలిపారు. శిక్షణకు హాజరైన వలంటీర్లకు అక్షరఆంధ్ర వాచకంతో పాటు బోధనకు ఉపకరించే ఇతర సాధనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో సంతోషం, ఎఫ్‌ఏలు మేట్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ



ఆర్థిక సాయం అందజేస్తున్న చైర్మన్

చీరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివ రావు అన్నారు. పేరాలకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త, చేనేత కార్మికుడు జగ్గారపు శ్రీనివాసరావు(50) ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందారు. ఈక్రమంలో స్థానిక శాసన సభ్యుడు ఎంఎం.కొండయ్య ఆదేశాల మేరకు చైర్మన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఉపాధి అవకాశాలు కల్పించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. చైర్మన్ వెంట నాయకులు అప్పల శ్రీనివాసరెడ్డి, శరత్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న బాలమ్మ

చినగంజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతగా భావించి అపరిశుభ్రతకు తావు ఇవ్వకుండా మసులుకోవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా డిప్యూటీ సీఈవో పావులూరి బాలమ్మ అన్నారు. చినగంజాం గ్రామంలో తడిచెత్త, పొడిచెత్త సేకరించే విధానం, చెత్త సంపద కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయాన్ని పెంచుకోవాలని డిప్యూటీ సీఈవో సూచించారు. గ్రామంలో తడి, పొడి చెత్తను సేకరించే విధానాన్ని ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ రాయని ఆత్మారావు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి సీ.హెచ్.పూర్ణచంద్రరావు, గ్రామ కార్యదర్శి కె.అంజయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస ముగింపు పూజలు



పర్చూరు శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పర్చూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ముగింపు వేడుకలను భక్తిశ్రద్ధలతో మండలంలో భక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం చివరి రోజు కావడంతో ఆయా శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకొని స్వామివార్లకు దీపోత్సవం నిర్వహించుకొని భక్తిని చాటుకున్నారు. మండలంలోని ఉప్పుటూరు వేంకటేశ్వరస్వామి, వీరన్నపాలెం వేణుగోపాలస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామివార్ల ఆలయాల్లో దీపోత్సవం నిర్వహించారు. కార్తీకమాసం వేడుకల సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంక రించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పంగులూరు : మండలంలోని కొండమూరు గ్రామంలోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గురువారం స్వామివారికి పంచామృత ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం, అర్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు అర్చకస్వామి కొండకావూరి శివయ్యశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సమయంలో గ్రామస్థుల సహకారంతో నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో కొండమూరు పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



కొండమూరులో అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు

పంగులూరు: మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన శ్రీరామలింగేశ్వర స్వామి సన్నిధిలో నేడు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు అర్చకస్వామి వెంకటేష్ తెలిపారు. పోలిస్వర్గం సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు మహాగణపతి పూజతో పూజా కార్యక్రమాలు జరుగుతా యన్నారు. సాయంత్రం 6.30 నిముషాలకు అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు భక్తులు అధికసంఖ్యలో పాల్గనాలని కోరారు.

రేపు శ్రీహర్షిణిలో జాబ్ మేళా

మార్టూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 18 బహుళజాతి కంపెనీలు వస్తున్నాయని, 10 వతరగతి, ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఐటిఐ, తదితర కోర్సులు చదివిన నిరుద్యోగులైన యువత జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలను పొందాలని కోరారు.

22న కశ్యాపురంలో స్వామిత్వ గ్రామసభ

పంగులూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కశ్యాపురం గ్రామంలో ఈ నెల 22న స్వామిత్వ ప్రత్యేక గ్రామసభ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయితీ కార్యాలయం వద్ద జరిగే ఈ గ్రామసభలో గ్రామస్థులు తమ నివాసగృహాలు, స్థలాల కొలతలు, హద్దులు సరిచూసుకోవలసిందిగా డిప్యూటీ ఎంపీడీవో సుమంత్ కోరారు.

27న రోటరీక్లబ్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

పంగులూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయిలో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావు తెలిపారు. మండలంలోని కోటపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 27న సాయంత్రం 2 గంటల నుంచి 4గంటల వరకు ఈ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థుల బృందం పాల్గొనవచ్చన్నారు. 6, 7, 8 తరగతుల సిలబస్‌తో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పేర్ని వీరనారాయణ (9099980916) నంబరును సంప్రదించాలని కోరారు.

నేడు గొనసపూడిలో పారిశుధ్య కార్యక్రమాలు

చినగంజాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామంలో శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.ధనలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎల్ఎస్‌డీఎన్ క్లీన్‌అండ్‌గ్రీన్ విలేజెస్'లో భాగంగా గొనసపూడి గ్రామాన్ని క్లీన్‌అండ్‌గ్రీన్ గ్రామ పంచాయతీగా గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలోని వార్డుల వారీగా మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులను వార్డు సమన్వకర్తలను నియమించినట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శులు తమ పరిధిలోని పారిశుధ్య కార్మికులను, పారిశుధ్య వాహనాలను తీసుకొని కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

- ద్విచక్ర వాహనాలపై పక్కపక్కనే వెళుతుండగా ఘటన



కాలువలోకి దూసుకుపోయిన ద్విచక్రవాహనం

కొత్తపేట(చీరాల), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి వెంబడి బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు గాయపడిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో గురువారం కూడా మరో ఘటన పునరావృతమైంది. చీరాల పరిసర ప్రాంతాలకు చెందిన నలుగురు బీటెక్ విద్యార్థులు పరీక్ష రాసి రెండు ద్విచక్ర వాహనాలపై జాతీయ రహదారిలో నుంచి చీరాల వైపునకు వస్తున్నారు. అయితే రెండు వాహనాలు పక్కపక్కన ఉండడంతో ఒకదానికి మరొకటి తగిలి వాహనాలు రోడ్డు పక్కన కాలువల్లోకి దూసుకు వెళ్లాయి. దీంతో ఇద్దరు స్వల్పంగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరు ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.

అద్దంకిలో విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

అద్దంకి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు, విద్యుత్ సిబ్బంది, అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈఈ నల్లూరు మస్తాన్‌రావు, అద్దంకి, మార్టూరు డీఈఈలు దామోదరరావు, సురేంద్ర బాబు, విజిలెన్స్ ఈఈ భాస్కర్, డీఈఈ విజయశ్రీనివాస్ ఆధ్వర్యంలో 32 బృందాలు 2,315 సర్వీస్‌లను పరిశీలించారు. 90 మంది అనుమతికి మించిచి లోడ్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించి 3 లక్షల రూపాయలు, అనుమతి పొందిన క్యాటగిరి కాకుండా వేరే క్యాటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 8 మందికి 37వేల రూపాయలు అపరాద రుసుము విధించారు. విద్యుద్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే 7780456319, 8331024029 నెంబర్లుకు సమాచారం ఇవ్వాలన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ దొంగ పట్టివేత

- పోలీసులకు అప్పగించిన కార్మికులు



కార్మికుల అదపులో ఉన్న నిందితుడు

బల్లికురవ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ ఫ్యాక్టరీలలో సెల్ ఫోన్లను చోరీ లు చేసే దొంగను గురువారం వేమవరం గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు పట్టుకు న్నారు. జార్ఖండ్‌కు చెందిన జహిన్నాద్‌బెహం అనే యువకుడు చోరీలకు అలవాటు పడి మూడు నెలల నుంచి బల్లికురవ మార్టూరు తదితర ప్రాంతాలలో చోరీలకు పాల్పడుతున్నాడు. గురువారం వేమవరం వద్ద ఒక గ్రానైట్ ఫ్యాక్టరీలలో కార్మికులకు చెందిన సెల్‌ఫోన్లు చోరీ చేస్తుండగా అక్కడ ఉన్న వారు గుర్తించి వెంటనే అతనిని పట్టుకున్నారు. ఆయన వద్ద సుమారు 10 సెల్ ఫోన్లు ఉన్నట్లు తెలుస్తోంది. చోరీకి పాల్పడిన దొంగను గ్రానైట్ కార్మికులు అదుపులోకి తీసుకొని బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వేటపాలెం(చీరాల), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలన్నారు.

సోమశిలకు తగ్గిన వరద ప్రవాహం

అనంతసాగరం నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. బుధవారం 6,343 క్యూసెక్కులు వస్తుండగా గురువారానికి 5,880 క్యూసెక్కులకు పడిపోయింది. డ్యాంలో 74.199 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 300, పవర్ టన్నెల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సోమశిల ఆప్రాన్ బాగుకు అవకాశమిదే..! 8

మీన.. మీన... కాసుల వాన!







నెల్లూరు చేపల పులుసు అంటే ఎవరైనా లొట్టలు వేయాల్సిందే. అందులోనూ రాగి సంగటితో కలిపి అంటే ఇక ఆ గిన్నె ఖాళీ కావాల్సిందే. కొరమీను, మట్టగిడసల పులుసుకు ఎవరైనా ఆహా.. అనాల్సిందే. వివిధ కార్యాల విందు మెనూలో చేపల పులుసును తప్పనిసరిగా జోడిస్తున్నారు. జిల్లా వాతావరణం, నేల స్వభావం, నీటి అనుకూలతే ఇందుకు కారణమని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు. దేశ, విదేశాల్లోనూ ఎంతో పేరు గడించిన నెల్లూరు చేపల్లో రెండే రెండు రకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఒకటి గెండి.. మరొకటి బొచ్చ. దాదాపుగా 75 శాతం మంది సాగుదారులు వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ తరువాత మోసు, రూప్‌చంద్ రకం చేపల సాగుకు కొంతమంది ముందుకొస్తున్నారు. అయితే జలాశయాలు, చెరువులు, కాలువలు, నదుల్లో మాత్రం సహజ సిద్ధంగా పెరుగుతున్నవి మాత్రం కొరమీను, పైలట్, మట్టగిడసలు. ఇవి ఆయా ప్రాంతాల్లో వినియోగానికే సరిపోతున్నాయి. శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, వ్యాపార లావాదేవీలపై ప్రత్యేక కథనం..

- రొయ్యల కంటే చేపలకే ప్రాధాన్యత
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- సహజ సిద్ధంగా పెరిగే పైలెట్, కొరమీను, మట్టగిడసలు
- గెండి, బొచ్చ రకం చేపలకూ ఆదరణ
- ఏటా 1.7 లక్షల టన్నుల ఉత్పత్తి
- పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి
- సంవత్సరానికి రూ.2వేలకోట్లకు పైగా టర్నోవర్
- నెల్లూరు పులుసు అంటే లొట్టలు వేయాల్సిందే!
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

వివరాలు 8లో..

బుల్లెట్ ట్రైన్ కోసం రైల్వే లైను

- మనుబోలు వద్ద మట్టి నమూనాల సేకరణ



మడమనూరు వద్ద మట్టి నమూనాలు తీసే యంత్రం

మనుబోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇప్పుడున్న రైల్వేలైను కాకుండా రాష్ట్రంలో అదనపు రైల్వేలైన్లకు అడుగులు పడనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బెంగళూరు రాష్ట్రాలను కలుపుతూ రైల్ కారిడార్ రానుంది. ఈ మార్గంలో హైస్పీడు, బుల్లెట్ రైళ్లు వెళ్ళే విధంగా లైన్లు వేయనున్నట్లు తెలిసింది. దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (సర్వే) శ్రీవాత్సవ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పలుచోట్ల రైల్వే ఇంజనీరింగ్, సర్వే అధికారులు మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు గురువారం మనుబోలు మండలం మడమనూరు వద్ద మట్టి పరీక్షలు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతమున్న విజయవాడ-గూడూరు రైల్వే లైన్‌కు మూడు కి.మీ దూరంలోని భూమిలో 100 అడుగుల లోతు వరకు మట్టి, స్థితి కనుగొని ఆ నమూనాలను రైల్వే ఉన్నతాధికారులకు పంపునున్నట్లు ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి!

- ట్రాఫిక్‌పై ప్రజల్లో అవగాహన కల్పించండి
- స్పీడ్ బ్రేకర్లు, రేడియం పెయింట్ వేయండి
- అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం

8 లో..

వ్యవసాయం, జీవనోపాధికి సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి అత్యవసరం

- వివరాలు 8లో..

ఏచ...!

నామమాత్రంగా పేరెంట్, టీచర్ సమావేశాలు

అది కూడా నెలనెలాకాదు.. ఎప్పటికో!

విద్యాశాఖ అధికారుల చొరవ అంతంతే!

నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద ఉన్న కృషినగర్ జడ్పీ హైస్కూల్లో 400 మంది విద్యార్థులు ఉన్నారు.మూడు నెలలకొకసారి మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. పాఠశాల ఉనికిని తెలిపే బోర్డును కూడా మూలనపడేశారు. రెగ్యులర్ హెచ్‌ఎం లేక ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు. ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్ల కొరత ఉంది. తాగునీటి ప్లాంట్ పనిచేయడం లేదు. ఇలా ఎన్నో సమస్యలు విద్యార్థులను వెంటాడుతున్నాయి

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



తరగతి గదులు చాలకపోవడంతో చెట్లకింద విద్యార్థులు



ఉదయగిరి ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న శుద్ధిజల కేంద్రం


నెల్లూరు (విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ చేపట్టిన పీటీఎం కార్యక్రమం నామమాత్రంగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు, పాఠశాల అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చి ఈ ఏడాది జులై 5వ తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం 2.0) పేరుతో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 3,221 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. అది విజయవంతం కావడంతో క్రమం తప్పకుండా ప్రతీ నెలా పీటీఎం నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జిల్లాలో మొక్కుబడి సమావేశాలే నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా చర్చించాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదని ఆరోపిస్తున్నారు.

- విద్యా ప్రమాణాల పెంపు ఏదీ..

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థుల ప్రవర్తన, అలవాట్లు, క్రమశిక్షణ వంటి అంశాలన్నీ పరిగణలోకి తీసుకుని తప్పనిసరిగా నిర్వహించాల్సిన పీటీఎంను మొక్కుబడిగా మార్చేశారు. కొన్ని పాఠశాలల్లో అయితే ఈ సమావేశాలను మూడు నెలలకో లేదా వారికి తీరిక సమయం ఉన్నప్పుడో నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, సమావేశాలను నిర్వహించాలన్న ఆలోచన హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు లేకపోవడంతో పేరెంట్స్ కమిటీ సభ్యులు కూడా మిన్నకుండిపోతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి అన్ని పాఠశాలల్లో నిబంధనల ప్రకారం తల్లిదండ్రుల సమావేశాలను ప్రతినెలా కచ్చితంగా నిర్వహించాలని కోరుతున్నారు.

ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 339 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది జూలై 10న మెగా పేరెంట్, టీచర్ సమావేశం జరిగింది. అప్పటి నుంచి ఒక్క సమావేశం కూడా జరగలేదు. మంచినీరు, తరగతి గదుల కొరత, ప్రహరీ నిర్మాణం ఇలా అనేక సమస్యలు ఈ పాఠశాలలో నెలకొని ఉన్నాయి

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



అల్లూరులోని ఆర్‌డీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులు ఉన్నారు. దాదాపు 8 నెలల క్రితం ఏర్పడిన పాఠశాల విద్యా కమిటీ సభ్యులు సక్రమంగా హాజరు కాకపోవడంతో ఒక్కసారి మాత్రమే తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అప్పటినుంచి అతీగతీ లేదు. స్కూలులో వసతులు లేవు. కనీసం పిల్లలు తాగేందుకు నీరు కూడా లేదు. అసంపూర్తి భవనాలు, టీచర్ల కొరత ఉంది.

- అల్లూరు (ఆంధ్రజ్యోతి)



సంగ మండలం దువ్వూరు మెయిన్‌లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికైన తరువాత ఒకటీ రెండు సార్లు సమావేశాలు నిర్వహించినా మొక్కుబడిగానే సాగింది. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రస్తావన లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

అమీబిక్.. అప్రమత్తం!

- వైరస్ విస్తృతితో ప్రభుత్వం ఆదేశాలు
- జాగ్రత్తగా ఉండాలని అయ్యప్ప భక్తులకు సూచనలు
- పీహెచ్‌సీల వారీగా అవగాహన కార్యక్రమాలు



నెల్లూరు (వైద్యం) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమీబిక్ మెనింగో ఎన్సెఫాలిటిస్ (అమీబిక్ బ్రెయిన్ ఫీవర్) వైరస్ కేరళను వణికిస్తోంది. ఇప్పటికే ఈ వైరస్ బారిన 80 మంది పడగా, 19 మంది మృత్యువాత పడ్డారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై వైద్య ఆరోగ్య శాఖకు పలు ఆదేశాలు జారీ చేశాయి. ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు జాగ్రత్తలు తెలియజేయాలని సూచించాయి. జిల్లాలోని పలు ఆసుపత్రులతోపాటు నర్సింగ్ కళాశాలల్లో వేల సంఖ్యలో కేరళకు చెందిన విద్యార్థినులు నర్సింగ్ చదువుతున్నారు. అంతేగాక అయ్యప్ప భక్తులు కేరళకు వెళ్లి వస్తున్నారు. దీంతో జిల్లావాసులు ఎవరూ అమీబిక్ వైరస్ బారిన పడకుండా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలుషిత నీటి ద్వారానే వైరస్ వ్యాప్తి చెందుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శబరిమలలోని పంపానదిలో తలతో కూడా మునగ వద్దని కేరళా ప్రభుత్వం హెచ్చరిస్తుంది. ముక్కు ద్వారా అమీబిక్ వైరస్ మెదడుకు చేరుతుంది. వాంతులు, తల తిరగడం, తలనొప్పి, వాంతులు, జ్వరం, కంటి దృష్టిలో లోపం, మూర్ఛ తదితర లక్షణాలు బయటపడతాయని వైద్యులు తెలిపారు. ఈ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే వ్యాధిని నయం చేయవచ్చని చెబుతున్నారు. శబరిమలకు వచ్చే భక్తులు వేడిచేసిన నీరే తాగాలని, కాళ్లు, చేతులు శుభ్రం చేసుకున్నాకే భోజనం చేయాలని, నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదని కేరళ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి వెళ్లే అయ్యప్ప భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

అయ్యప్ప భక్తులను హెచ్చరిస్తున్నాం!

కేరళలో వెలుగు చూసిన అమీబిక్ వైరస్‌పై ప్రభుత్వ నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లా నుంచి అయ్యప్ప భక్తులు ఎక్కువ మంది శబరిమలకు వెళుతున్నారు. వారు ఆ వైరస్ బారిన పడకుండా ఉండాలని, ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నాం. పీహెచ్‌సీ పరిధిలోని అయ్యప్ప భక్తులకు వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు. నీటిలో ముక్కు వరకు మునగ వద్దని చెబుతున్నాం.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కేరళలో అమీబి ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పంపా నదిలో పూర్తిగా మునగ కూడదు, ముక్కు ద్వారా వైరస్ మెదడులోకి చేరి మెదడును తినేసే ప్రమాదం ఉంటుంది. పరిశుభ్రంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కేరళ నుంచి వచ్చే భక్తులు, నర్సులు అనుమానితులు వైద్యుల సూచనలు పాటించాలి.

- డాక్టర్ బెన్‌హర్, జీజీహెచ్ జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ

సచివాలయాలకు ప్రత్యేకాధికారులు

- 36 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

నెల్లూరు (జడ్పీ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాలకు మండల స్థాయి ప్రత్యేకాధికారి ఏర్పాటు కానున్నారు. సచివాలయ వ్యవస్థను పటిష్ఠం చేసి ప్రజలకు విస్తృత సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. ఇందుకోసం మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవోలను నియమించాలని నిర్ణయించింది. జిల్లాపరిషత్‌లోని సీనియర్ అసిస్టెంట్లు, పంచాయతీల్లోని గ్రేడ్-1 కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 20మంది జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్లకు, పంచాయతీ శాఖలోని 16మంది కార్యదర్శులకు పదోన్నతులు లభించాయి. వీరిని నెల్లూరుతో పాటు తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. అలాగే ఇతర జిల్లాల నుంచి నెల్లూరు జిల్లాకూ కేటాయించారు. ఇకపై సచివాలయాల్లో ప్రత్యేక అధికారుల పాలన ఏర్పాటు కానుంది.



ఫైళ్లు ఎక్కడండి!

కలెక్టరేట్ అధికారులను ప్రశ్నించిన ఆడిట్ బృందం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి నాలుగురోజుల క్రితం ఏజీ ఆడిట్ అధికారులు కలెక్టరేట్‌కు వచ్చి రికార్డులు ఇవ్వాలని సెక్షన్‌ల అధికారులను కోరారు. గన్ లైసెన్సు రిజిస్టర్, భూరికార్డులు కనిపించక పోవడంతో సెక్షన్ అధికారుల గొంతులో వెలక్కాయ పడినట్లైంది. ఆడిట్ అధికారులు రికార్డులను తనిఖీ చేసి, అందులోని ఖర్చుల బిల్లులు నిబంధనల ప్రకారం ఉన్నాయా? అక్రమాలు చోటు చేసుకున్నాయా...? అనే వివరాలతో నివేదిక తయారు చేస్తారు. ఆడిట్ బృందానికి ఏయే సెక్షన్‌ల్లో అక్రమాలకు అవకాశం ఉందో తెలుసు. అందుకే పలానా రికార్డులు కావాలని, పలానా రిజిస్టర్‌లు కావాలని అడుగుతారు. తొలుత కలెక్టర్, జేసీలను సంప్రదించిన తరువాత వారు ఫైళ్ల ఆడిట్‌కు ఉపక్రమించారు.



కలెక్టరేట్‌కు వచ్చిన ఆడిట్ అధికారులు

- నీళ్లు నమిలిన అధికారులు

విజయవాడ ఏజీ కార్యాలయం నుంచి సీనియర్ ఆడిట్ అధికారి ఎస్.బాలాజీసింగ్, ఆడిట్ అధికారులు రాకేష్, సౌమిక్ రికార్డులు ఆడిట్ చేయడానికి వచ్చారు. కలెక్టరేట్‌లో వివిధ సెక్షన్‌లు ఉన్నాయి. గన్‌లైసెన్స్‌కు సంబంధించి ఒక సెక్షన్ ఉంది. సెక్షన్‌లకు సంబంధించి రిజిస్టర్లను, ఫైళ్లను ఆడిట్ కోసం ఇవ్వాలని ఆడిట్ అధికారులు అడగ్గా, సంబంధిత సెక్షన్ హెడ్‌లు ఆడిట్ అధికారులకు సమాధానం ఇవ్వలేదని తెలిసింది. 2017కు ముందు గన్‌లైసెన్స్‌ల రికార్డులను సమర్పించాలని ఆడిట్ అధికారులు అడగ్గా, ఇంతవరకు ఆ రికార్డులను వారికి సమర్పించలేదు. ఆ రికార్డులు అసలు ఉన్నాయా? మాయం అయ్యా యా... అనే విషయాన్ని ఉన్నతాధికారులు తేల్చాలి. 2017కు ముందు రికార్డుల వివరాలు మాన్యువల్‌గా ఉండేవి. ఆ తరువాత కంప్యూటరీకరణ జరిగింది. 2017కు ముందు భూసంబంధ, గన్ లైసెన్స్ రిజిస్టర్లలో చాలా వ్యవహారం నడించిందనే ఆరోపణలు ఉన్నాయి.

- ఇస్తారా... లేదా..?

కాగా ఈనెల 16న ఆడిట్ అధికారులు కలెక్టరేట్‌కు వచ్చారు. వచ్చిన నాటి నుంచి రికార్డులు ఇవ్వాలని అడగ్గా, ఇవ్వలేదని తెలిసింది. ఈ నెల 27తో వారి ఆడిట్ ముగుస్తుంది. అప్పటికైనా రికార్డులను అధికారులు ఇస్తారో, కాలయాపన చేస్తారో వేచి చూడాలి. ఆడిట్ అధికారులు మాత్రం తాము పాలనా రికార్డులు కావాలని ఆడిగామని, ఇచ్చినప్పుడే వాటిని ఆడిట్ చేస్తామని చెప్పారు.

పంచాయతీల్లో రేపు గ్రామసభలు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించాలని డ్వామా పీడీ గంగాభవాని అధికారులను ఆదేశించారు. గురువారం నెల్లూరులోని తన కార్యాలయం నుంచి ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ గ్రామ సభలకు ఉపాధి హామీ కూలీలు హాజరై కొత్త జాబ్‌కార్డులకు, పని కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈకేవైసీ సమస్య వల్ల రద్దయిన జాబ్‌కార్డులను పరిశీలించి, శ్రామికులకు ఈకేవైసీ చేయించి, గ్రామసభల్లో జాబ్‌కార్డులు అందించాలన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 660

డ్రాగన్ ఫ్రూట్స్ సాగు లాభదాయకం

కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరు దొండపాడు రైతుసేవా కేంద్రంలో ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్ పంటల సాగుపై రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు మండల ఉద్యాన అధికారి బీ జ్యోతి తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఉద్యాన రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగు మొక్కల కొనుగోలు ఖర్చు, సిమెంట్ స్తంభాల ఖర్చు, సాగు కలిపి రెండేళ్ల పాటు సబ్సిడీ మొత్తం రూ.2,70,000 ప్రభుత్వం అందిస్తుందన్నారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కల మధ్య 10 అడుగులు దూరం పెట్టి నాటుకోవచ్చని, సాగులో మెలకువలు తెలిపారు. అదేవిధంగా నీటి వసతి అనుకూలంగా ఉన్న నేలల్లో ఆయిల్ పామ్ సాగు కూడా చేపట్టవచ్చని సూచించారు. డ్రిప్ అనుసంధానం చేసుకుంటే మేలైన దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది జగదీష్, ఆయిల్ పామ్ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలపై పర్యవేక్షణ ఏదీ..!?

- ఎంఆర్‌సీకే పరిమితమైన ఎంఈవోలు
- అడ్రస్ లేని సీఆర్‌ఎంటీలు
- సమయపాలన లేని ఉపాధ్యాయులు
- ప్రభుత్వ బడుల్లో మెరుగుపడని విద్యా ప్రమాణాలు
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- అమలు కాని మధ్యాహ్న భోజనం మెనూ
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వలేటివారిపాలెం ఎంఆర్‌సీ కార్యాలయం

వలేటివారిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఎంఈవోలు, సీఆర్‌ఎంటీలు మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయానికే పరిమితమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. దీంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో విద్యా ప్రమాణాలు దిగజారుతోన్నాయని, మధ్యాహ్న భోజన పథకంలో సైతం మెనూ సక్రమంగా అమలు జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో 41 ఎంపీపీ స్కూళ్లు, 4 ఎంపీయూపీ స్కూళ్లు, 4 ఉన్నత పాఠశాలలు, 1 మోడల్ స్కూల్, 1 కేజీబీవీ ఉన్నాయి. ఆ పాఠశాలలో సుమారు 3,500 మందికి పైగానే విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. ఈ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు నిత్యం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన ఇద్దరు ఎంఈవోలు ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి వచ్చి వెళుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఒక్కో ఎంఈవో రోజుకు రెండు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేసి అక్కడి పరిస్థితులను పర్యవేక్షించాలి. అయితే అలాంటి పరిస్థితి మండలంలో జరుగుతున్న దాఖలాలు లేవని తెలిసింది. అలాగే మండలానికి ఉన్న ఇద్దరు క్లస్టర్ రిసోర్స్ మానిటరింగ్ టీచర్లు (సీఆర్‌ఎంటీ)లు కూడా నిత్యం పాఠశాలలను తనిఖీలు చేయాలి. అయితే వీరు ఎప్పుడు ఎక్కడ ఉంటారో కూడా తెలియదని ఉపాధ్యాయ వర్గాలే బహిరంగంగా చర్చించుకొంటున్నారు. విధులు నిర్వహించకుండానే సొంత పనులు చేసుకుంటూ ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యా ప్రమాణాలు, వసతులు మెరుగుపడకపోగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, బోగస్ హాజరు మాత్రం నమోదవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి పాఠశాలలపై పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

న్యూస్ బాక్స్

నేడు లింగసముద్రంలో ప్రజాదర్బార్

లింగసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దారు ఎం కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అర్జీలను ఎమ్మెల్యేకి అందజేయాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ మండల కమిటీ నియామకం

వలేటివారిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఆర్‌సీలో గురువారం అంగన్‌వాడీ మండల నూతన కమిటీ ఏర్పడింది. జిల్లాలో వలేటివారిపాలెం పైలట్ మండలంగా ఎంపికైన సందర్భంగా ఎంఈవో మాల్యాద్రిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో అంగన్‌వాడీ మండల అధ్యక్షుడుగా ఎంఈవో 1 మాల్యాద్రిరెడ్డి, కోచైర్మన్‌గా సీడీపీవో ఉషారాణి, సభ్యులుగా సూపర్‌వైజర్లు సునీత, రుబీనా, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, కార్యకర్తలు ఎస్తేరమ్మ, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, ఎంఈఓ 2 మల్లికార్జునరావును సభ్యులుగా ఎన్నుకున్నారు.

పోలినేనిపాలెంలో నేడు పరిశుభ్రతపై శిక్షణ

వలేటివారిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ శిక్షణ తరగతులకు క్లాప్ మిత్రాలు, షెడ్ మిత్రలు, తదితరులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

ప్రణీత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

కావలి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రిష్ణాపురం నవోదయ పాఠశాల విద్యార్థిని కత్తి ప్రణీత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని వివిధ గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగులు పేర్కొన్నారు. పట్టణంలోని అడవిరాజుపాలెంలో గురువారం జరిగిన ప్రణీత అంత్యక్రియల్లో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బ్రహ్మయ్య, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హజరత్, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పెంచలయ్య, రాపూరి క్రిష్ణయ్య, విద్యారంగం పోరాటసాధన కమిటీ కన్వీనర్ శ్యామల తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. మృతురాలి తండ్రి ఎంఈవో రవికుమార్, కుటుంబ సభ్యులతో రామర్శించారు. ఈ మృతిపై కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన రాష్ట్ర మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఈ సంఘటనపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు రుద్రాభిషేకం

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో వెలసి ఉన్న జ్ఞాన ప్రసున్నాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం కార్తీక మాస రుద్రాభిషేక పూజలు జరిగాయి. వేదపండితులు వేదగిరి ఆంజనేయవరప్రసాదాచార్యులు కార్తీక మాస చివరి రోజున శాస్త్రోక్తంగా పూజాభిషేకాలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లతో పాటు నందీశ్వరుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ పూజల్లో కోవూరుపల్లి, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన భక్తులు, ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర దంపతులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'దళితుల ఇళ్ల స్థల పట్టాలు నా దగ్గర లేవు'

వలేటివారిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండసముద్రం జగనన్న కాలనీలో దళితులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు నా దగ్గర లేవని గ్రామ పంచాయతీ సర్పంచు భర్త మన్నం వెంకటరమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వారి పట్టాలు నావద్ద ఉన్నాయని సీపీఐ నేత సురేష్‌బాబు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 86 మంది దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు ఇచ్చారని తెలిపారు. వాళ్లందరికీ ఇళ్లు మంజూరు కాగా కొందరికీ మొదటి బిల్లు డబ్బులు కూడా వచ్చినట్లు తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా నిందారోపణలు చేయడం తగదని పేర్కొన్నారు.

సాగర తీరంలో మెరైన్ పోలీసుల మాక్ డ్రిల్



వాహనాలను తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీస్ అధికారులు

ఉలవపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడ్లూరు, ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు సముద్ర తీర ప్రాంతంలో గురువారం సాగర్ కవచ్ నిర్వహించినట్లు మెరైన్ సీఐ జీ శివన్నారాయణ తెలిపారు. సాగర్ కవచ్‌లో భాగంగా కోస్టల్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్(మాక్ డ్రిల్)లో ఇండయన్ కోస్ట్ గార్డు, ఇండియన్ నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, ఇంటలిజెన్స్, మత్స్య శాఖ, వివిధ భద్రతా విభాగాలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ మాక్ డ్రిల్ శుక్రవారం కూడా కొనసాగుతుందని చెప్పారు. నెల్లూరు ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఒంగోలు నోడల్ అధికారి డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావుల పర్యేక్షణలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. వీవీపాలెం, ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు ఎస్ఐలు మరిదినాయుడు, కే.అంకమ్మ, బీ.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

మెప్మా మై స్టోర్ ప్రొడెక్ట్ డెలివరీ



స్వయం సహాయక సభ్యులకు చెక్కు అందిస్తున్న కాంతయ్య

కావలి(టౌన్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ మెప్మా కార్యాలయంలో గురువారం ఓఎన్‌డీసీ మైస్టోర్ ప్రొడెక్ట్ డెలివరీ జరిగింది. స్వయం సహాయక సభ్యులు స్వయంగా తయారు చేసిన 90 రకాల వస్తువులను ఓఎన్‌డీసీ మైస్టోర్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ నందు ఆన్‌బోర్డింగ్ చేశారు. జిల్లా టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కాంతయ్య పాల్గొని మాట్లాడుతూ కావలి మున్సిపాలిటీ మెప్మా పరిధిలో ఈపాటి 756 ఆర్డర్లు వచ్చాయన్నారు. వీటికి సంబంధించిన తయారీదారులకు మెప్మా ద్వారా రూ.47,450 చెక్కును అందజేశామన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త అనే నినాదంలో భాగంగా మెప్మా స్వయం సహాయక సభ్యులకు ఆర్థిక తోడ్పాటుగా ఓఎన్‌డీసీ మైస్టోర్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసి పొదుపు సభ్యులు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఎంఎం భారతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు కొండయ్య, అరుణ, సునీత, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వలేటివారిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పాకల హైస్కూల్‌లో, కనిగిరి మండలం కంచర్లవారిపాలెం హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన వలేటివారిపాలెం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ కత్తి ఐజక్ తెలిపారు. 14, 17 ఏళ్ల విభాగాల్లో కబడ్డీ, ఖోఖోకు ఎంపికైన చప్పిడి అశ్విత, చొప్పర లోకేష్, ఈర్ల పూజిత, మర్రి మణివిష్ణు, గూడూరు సంతోష్‌లు కర్నూలు, మచిలీపట్నంలలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని హెచ్‌ఎం కమల్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ పాఠశాలగా ఇస్కపల్లి జడ్పీ హైస్కూల్

● స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి ● ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



కంప్యూటర్ గదిని పరిశీలిస్తున్న రవిచంద్ర

అల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సహకారంతో ఇస్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని ఇస్కపల్లి శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ఇంటర్మీడియట్ కోర్సును ప్రవేశపెట్టిన నేపథ్యంలో ల్యాబ్‌లు, తరగతి గదులను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అన్ని మజరా గ్రామాల నుంచి వచ్చే 422 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, వంటగది, భోజనశాలలను నిర్మించేందుకు తన మిత్రుడు హరిశ్రీనివాస్ ముందుకొచ్చారన్నారు. రాజ్యసభ సభ్యుడి నిధులు రూ.25 లక్షలతో కంప్యూటర్ తరగతి ఏర్పాటు చేశామన్నారు. మంత్రి లోకేష్, దాతల భాగస్వామ్యంతో రూ.4 కోట్లు వెచ్చించి 20 తరగతి గదులను నిర్మించి వచ్చే విద్యా సంవత్సరానికి అందించే విధంగా ప్రణాళికలు రచించామన్నారు. ఇప్పటికే 3 ఎకరాలను ఆట స్థలానికి సేకరించామని, రెండేళ్లలో మోడల్ స్కూల్‌గా రూపొందుతుందన్నారు. ఈ పాఠశాలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా 2027 జూన్ నాటికి అభివృద్ధి చేసేలా గత కలెక్టర్ ఆనంద్ మాస్టర్ ప్లాన్ చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, బండి శ్రీనివాసులురెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, పాపనబోయిన జగన్, హెరూన్ రషీద్, పాటి రంజిత్, ఎంపీడీవో రజనీకాంత్, డీటీ ప్రవీణ్‌కుమార్, ఎంఈవో రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, దీనిలో భాగంగా పేదలకు సొంత ఇంటి కలలను నిజం చేస్తున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కందుకూరు అర్బన్ పరిధిలో 417 మందికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. వారిలో కొటారెడ్డినగర్, బృందావనం సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు గురువారం అనుమతి పత్రాలు అందచేశారు. సొంత స్థలాలు ఉండి ఇల్లు కట్టుకోలేని వాళ్లు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అర్హులైన వారి గృహ నిర్మాణానికి అనుమతి పత్రాలు అందేలా రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ అధికారులు కలికట్టుగా పనిచేయాలన్నారు. సొంత స్థలాలు లేనివారికి అవసరమైతే ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, హౌసింగ్ ఈఈ మాధవరావు, డీఈ నారాయణ, ఏఈ సుబ్బారావు, తహసీల్దారు లావణ్య, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పోకూరి రాంబాబు, చిలకపాటి మధుబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి కొలతల్లో తేడాలు

● అధికారులపై ఎమ్మెల్యే కాకర్ల ఆగ్రహం



రహదారి కొలతలు తీయిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి 167బీజీ విస్తరణ పనుల్లో భాగంగా కలిగిరి పట్టణంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం తహసీల్దారు కార్యాలయం కూడలి నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడా వరకు పరిశీలించారు. ఈ క్రమంలో నాలుగైదు చోట్ల రోడ్డు విస్తరణ కొలతలు తీయించారు. కేవలం అరకిలో మీటరు నిడివిలో కొన్ని ప్రదేశాలలో 82 అడుగులు, 62 అడుగులు వంతున ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్న ప్రదేశాల వద్ద డ్రైనేజీలను పగులకొట్టి తిరిగి 82 అడుగులు నిర్మాణం చేయాలన్నారు. నిడివి తక్కువగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది కాబట్టి రోడ్డు, డ్రైనేజీలు కలిపి మొత్తం 82 అడుగుల మేర కొలతలు కచ్చితంగా ఉండాలని, అలాచేయలేని పక్షంలో పనులు ఆపివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన దీపికలు

అల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞానాన్ని ప్రసాదించే దీపికలని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. అల్లూరు బాపూజీ పార్కులోని గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరు జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం చెంచయ్య, గ్రంథాలయ నిర్వాహకురాలు కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

● **గుడ్లూరు:** గ్రంథాలయం ద్వారా అందిస్తున్న సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎర్రాప్రగడ గుడ్లూరు శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం గ్రంథపాలకుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. చిత్రలేఖనం, పాటలు, వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోవర్ధన్, హైస్కూల్ హెచ్‌ఎం రామోహన్‌రావు పాల్గొన్నారు.

సురేష్‌రెడ్డికి ఆదినారాయణరెడ్డి స్మారక అవార్డు



సురేష్‌రెడ్డికి ఆదినారాయణరెడ్డి స్మారక అవార్డు అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు, తదితరులు

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అజ్ఞాత రక్తదాత స్వర్గీయ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి స్మారక అవార్డును జిల్లాలో అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసిన కోవూరుకు చెందిన దేవిరెడ్డి సురేష్‌రెడ్డికి అందచేశారు. కావలి రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్‌లో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆ అవార్డును మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సురేష్ రెడ్డికి అందచేశారు. ఈ కార్యక్రమంలో కావలిరెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే. హరినారపరెడ్డి, ఏరియా వైద్యశాల మాజీ సూప రింటిండెంట్ డాక్టర్ కే.సుబ్బారావు, నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్ కలికి శ్రీహరిరెడ్డి, పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్న కుమార్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, గోసల గోపాలరెడ్డి, పూనూరు మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మెగా రక్తదానం, అన్నదానం

కావలి(టౌన్) : మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి కాటంరెడ్డి ఆదినారాయణ రెడ్డి 44వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఏరియా వైద్యశాల ప్రాంగణంలో మెగా రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కాటంరెడ్డి ఆదినారాయణ రెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించి ఆయనతో పాటు ఆయన సతీమణి శివప్రియలు స్వయంగా రక్తదానం చేశారు. రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేసి ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోసల గోపాలరెడ్డి, బాలకృష్ణంరాజు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాసంఘాల ప్రతినిధులు, విష్ణు అభిమానులు పాల్గొన్నారు.


బాధితురాలికి బంగారు గడియారం అప్పగింత



బంగారు వాచీని చాముండేశ్వరికి అప్పగిస్తున్న ఆలయ సిబ్బంది

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కావలి పాతూరు శివాలయంలో చాముండేశ్వరి అనే భక్తురాలు 14 గ్రాముల బంగారు గడియారాన్ని పోగొట్టుకోగా దానిని గురువారం ఆలయ సిబ్బంది ఆమెకు అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. పట్టణంలోని గాయిత్రినగర్‌కు చెందిన చాముండేశ్వరి గత సోమవారం ఆలయానికి వచ్చి కార్తీక దీపాలు వెలిగించింది. అక్కడ నెలకొన్న రద్దీ సమయంలో తన బంగారు గడియారాన్ని పోగొట్టుకుంది. ఇంటికి వెళ్లిన తరువాత తన వాచీ పోయిందని తెలుసుకున్న ఆమె ఎక్కడ పోయిందో తెలియక ఆందోళన చెందింది. ఈ క్రమంలో ఆలయంలో పడి ఉన్న బంగారం వాచీ శివాలయం సేవకుడు పోలు వెంకటేశ్వర్లుకు దొరకటంతో ఆయన ఆలయ ఈవో అరవ రాధాక్రిష్ణకు అప్పగించి మైక్‌లో అనౌన్స్ చేయించారు. అయితే అప్పటికే ఆమె వెళ్లి పోవడంతో ఆ వాచీని ఆలయంలో భద్రపరిచారు. గురువారం మళ్లీ శివాలయానికి వచ్చిన చాముండేశ్వరి తన వాచీ పోయిన విషయాన్ని అక్కడ సిబ్బందితో, భక్తులతో చెప్పారు. దీంతో సిబ్బంది తమ వద్ద వాచీ ఉందని తెలిపి ఆ వాచీకి సంబంధించిన సరైన ఆధారాలు చూపమని కోరడంతో ఆమె చెప్పిన ఆధారాలతో ఆలయ సిబ్బంది ఆమె దగ్గర లిఖిత పూర్వకంగా రాయించుకుని బంగారం వాచీని అందజేశారు. దీంతో ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో శేషారెడ్డి

వలేటివారిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేసి చట్ట ప్రకారం చర్యలకు సిఫార్సు చేస్తామని ఏవో శేషారెడ్డి తెలిపారు. వలేటివారిపాలెంలోని హరిత పుత్ర వెజిటల్ అండ్ మిలెట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ షాపును గురువారం ఆయన తనిఖీ చేశారు. షాపులోని రికార్డులు, ఎరువులు, పురుగుమందులను పరిశీలించారు. అనుమతిలేని మూడు కంపెనీలకు చెందిన 36.09 మెట్రిక్ టన్నులు డీఏపీ, అమ్మోనియం సల్ఫేట్, యూరియా ఎస్‌ఎస్‌పీకి సంబంధించిన రూ.4,25,480 విలువ కలిగిన ఎరువులను నిలుపుదల చేశారు. మండలంలోని అన్ని దుకాణాలలో ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దారు కోటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

లింగసముద్రం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతినిత్యం ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలకు అధికారులకు అనుసంధానంగా ఉన్న గ్రామ సేవకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండలంలోని వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సుదీర్ఘ కాలం నుంచి పని చేస్తున్న వీఆర్‌ఏలకు పే స్కేలు ఇచ్చి, జీతాలు పెంచాలన్నారు. అర్హత గల వీఆర్‌ఏలకు వీఆర్‌వోలుగా, రికార్డు అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, ఏళ్ల తరబడి నామినీలు పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని, అటెండరు, నైట్ వాచ్‌మ్యాన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుంచి 70 శాతానికి పెంచాలన్నారు. అక్రమ నైట్ డ్యూటీలను, అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు జడ చంద్రశేఖర్, షేక్ నబీసాహెబ్, ఏ కొండయ్య, జీ.కొండయ్య, జీ.దత్తుకుమార్, కే.వేణుగోపాల్, శ్రీనివాసులు, సీహెచ్ నరసింహం, రహీంబీ, జంగమయ్య, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

● ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సంఘం సభ్యులు

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టీటీడీ విజిలెన్స్ అధికారిగా పని చేసి ప్రస్తుతం గుంతకల్లు డివిజన్‌లో జీఆర్పీ సీఐగా పనిచేస్తున్న వై.సతీష్‌కుమార్ మృతిపై ఉన్నత దర్యాప్తు సంస్థలచే సమగ్ర విచారణ జరిపించాలని కావలి కుమ్మర శాలివాహన సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి ఆర్డీవో ఎం. వన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కుమ్మర శాలివాహన సంఘం నేతలు మాట్లాడుతూ నిజాయితీ కలిగిన అధికారి సతీష్‌కుమార్ మృతికి కారణమైన దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబానికి తగిన పరిహారం ఇచ్చి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు యోగూరు పెద పుల్లయ్య, గుడ్లూరు మాల్యాద్రి, యోగూరు చిన పుల్లయ్య, బెజవాడ ప్రసన్న కుమార్, అభిసాగర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉలవపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు, ఉలవపాడు గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. సంబంధిత ఎరువుల కంపెనీలకు చెందిన శాంపిల్స్‌ను తీసుకొని నాణ్యతా ప్రమాణాల నిర్ధారణకు ప్రయోగశాలకు పంపించారు. ధ్రువీకరించిన కంపెనీలకు సంబంధించిన ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

కావలి(టౌన్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో జేబీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న పరిసరాల పరిశుభ్రత స్పెషల్ క్యాంపు రెండవ రోజు పరిసరాలు పరిశుభ్రం చేశారు. కాలనీలోని చెత్తాచెదాలు తొలగించి రోడ్డుకిరువైపులా తేమ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అయూబ్ అహ్మద్, నాగేశ్వరరావు, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై లోతుగా విచారణ

మర్రిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం మృతి చెందిన ప్రణీత ఘటనపై నవోదయ విద్యాలయ సమితి అధికారులు గురువారం లోతైన విచారణ నిర్వహించారు. విద్యార్థినిది హత్యగా అనుమానించి తండ్రి రవి కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ దిశగా హైదరాబాద్ నుంచి వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి, కర్నూలు నవోదయ ప్రిన్సిపాల్ పద్మావతి, ఆత్మకూరు డీఎస్పీ కే.వేణుగోపాల్, సీఐ గంగాధర్ ఘటన తీరును పరిశీలించారు. విద్యార్థిని హాస్టల్ గదిలో ఉన్న పుస్తకాలను, ఆమె వాడుతున్న వస్తువులను పరిశీలించారు, తోటి విద్యార్థినులను, సిబ్బందిని విచారించారు. కాగా భయంతో అత్యధికశాతం విద్యార్థులు గురువారం ఇంటిబాట పట్టారు. తల్లిదండ్రులు కోరుతున్నా, 10, ఇంటర్ విద్యార్థులను మాత్రం అధికారులు ఇళ్లకు పంపడం లేదు.


జవహర్ నవోదయ విద్యాలయం నుంచి ఇంటిబాట పట్టిన విద్యార్థినులు

వ్యవసాయం, జీవనోపాధికి సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి అత్యవసరం

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పాదకత పెంపు, గ్రామీణ జీవనోపాధి మెరుగుదలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం అత్యంత అవసరమని డెవలప్‌మెంట్ మానిటరింగ్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫీస్(డీఎంఈవో) నీతి ఆయోగ్ డైరెక్టర్ మహమ్మద్ జుబైర్ అలీహస్నీ పేర్కొన్నారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను గురువారం ఆయన సందర్శించారు. అక్కడ చేపడుతున్న విస్తరణ కార్యక్రమాలు, ఆధునిక వ్యవసాయం, సాంకేతికతపై శిక్షణ తదితరాలను అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సుమతి ఆయనకు వివరించారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని వారికి చేరువ చేసేలా చర్యలు తీసుకోవాలని హస్నీ సూచించారు. అనంతరం రైతులతో పలు అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివ జ్యోతి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, కోవూరు ఏడీఏ అనిత, శాస్త్రవేత్త విజయ్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.


రైతులతో బృంద చర్చలో డీఎంఈవో నీతి అయోగ్ డైరెక్టర్ మహమ్మద్ జుబైర్ అలీహస్నీ



సంగం : పడమటిపాళెంలో చేపల సాగు చెరువు

మీన.. లాభాల్లోన!

- రొయ్యల కంటే చేపలకే ప్రాధాన్యత
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- సహజ సిద్ధంగా పెరిగే పైలట్, కొరమీను, మట్టగిడసలు
- గెండి, బొచ్చ రకం చేపలకూ ఆదరణ
- ఏటా 1.7 లక్షల టన్నుల ఉత్పత్తి
- తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, కేరళలకు ఎగుమతి
- నెల్లూరు పులుసు అంటే లొట్టలు వేయాల్సిందే!
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రొయ్యల పెంపకానికి ఒకప్పుడు నెల్లూరు ప్రసిద్ధి. అయితే, అందులో ఒడిదొడుకులు ఎక్కువగా ఉండటంతో సాగుదారులు చేపల పెంపకంపైనే మొగ్గు చూపుతున్నారు. సాగు ఖర్చులు తక్కువ, ధర స్థిరంగా ఉండటమే ఇందుకు కారణం. గడిచిన మూడేళ్లలో పోలిస్తే జిల్లావ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో సాగు పెరిగిందని అధికారులు చెబుతున్నారు. గెండి, బొచ్చ, మోసు, రూప్‌చంద్ వంటి రకాల చేపలే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఏడాదికి సరాసరి 1.7 లక్షల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి అవుతున్నట్లు మత్స్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. 2023-24లో 1,66,578 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి రాగా 2024-25లో మాత్రం 1,80,255 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఈ లెక్కన ఈ ఏడాది మరింత ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

గెండి, బొచ్చ రకాలే ఎక్కువ

జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కోవూరు, ఇందుకూరుపేట, నెల్లూరు రూరల్, పొదలకూరు, కలువాయి, ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల తదితర మండలాల్లో 5వేల ఎకరాల్లో చేపల పెంపకం జరుగుతోంది. వీటితోపాటు 276 చెరువులు, కండలేరు, గండిపాళెం, రాళ్లపాడు, కనిగిరి రిజర్వాయర్లలో లీజు చొప్పున చేపలు పెంచుతున్నారు. ఇంకా సర్వేపల్లి, సోమశిల జలాశయాలతోపాటు నెల్లూరు చెరువుల్లోనూ చేపల సాగుకు మత్స్యశాఖ లైసెన్సులు మంజూరు చేసి, అనుమతులు ఇస్తోంది. మొత్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1,80,255 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చినట్లు మత్స్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. అందులో 40శాతం అంటే 72,102 మెట్రిక్ టన్నులు గెండి చేపలే ఉత్పత్తి అయ్యాయి. ఆ తర్వాత 35 శాతం అంటే 63,089 మెట్రిక్ టన్నులు బొచ్చ, మరో 20శాతం అంటే 36,051 మెట్రిక్ టన్నులు మోసు, 9012.75 మెట్రిక్ టన్నుల రూప్ చంద్ చేపలు సాగు అయ్యాయి. కొరమీను, జిలేబి, మట్టగిడసలు సహజ సిద్ధంగా పెరుగుతున్నా స్థానిక అవసరాలకే సరిపోతున్నాయి. బొచ్చ, గెండి చేపలు సరాసరి 900 నుంచి 1200 గ్రాముల వరకు ఉన్నవి పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. సంవత్సరానికి రూ.2 వేల కోట్లకుపైగా టర్నోవర్ జరుగుతున్నట్లు అంచనా.



ఈయన పేరు అల్లూరు శ్రీధర్‌రెడ్డి, సంగం మండలం కోలగట్ల గ్రామం. మోటార్ల కింద ఈయనకు 13 ఎకరాల పొలం ఉంది. మొదట్లో వరిసాగు చేసేవారు. పెద్దగా ఆదాయం రాకపోవడంతో 1996 నుంచి చేపల సాగు చేపట్టారు. ఎకరా పొలంలో 2,500 చేప పిల్లలను విడుదల చేస్తారు. అందులో 2,200 గెండి, కట్ల (బొచ్చి) 300, గెడ్డి చేపలు 50 విడుదల చేస్తామన్నారు. తొమ్మిది నెలలకు ఒక్కో చేప బరువు ఒకటిన్నర కిలో నుంచి రెండు కిలోల వరకు వస్తుంది. ఎకరా విస్తీర్ణంలో 2 టన్నుల వరకు చేపల దిగుబడి వస్తుంది. ఒక్కో టన్ను రూ.1.10 లక్షలు చొప్పున ఆదాయం వస్తుంది. ఒక ఎకరాకు పెట్టుబడి (చేప పిల్లలు, మేత) రూ.1.5 లక్షలు అవుతుంది. పెట్టిన పెట్టుబడికి రూ.20 వేలు వడ్డీ కింద తీసేసినా పెట్టుబడి పోను రూ.50 వేల వరకు మిగులుతుంది.


గెండి చేపలు

నేడు వేడుక

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నెల్లూరు పురమందిరంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ కే.శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, మత్స్యరంగం అభివృద్ధి లక్ష్యంగా జరుగుతున్న ఈ కార్యక్రమంతో జిల్లాలోని మత్స్యకారులు, సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు, ఆక్వా రైతులు, బోటు యజమానులు, మత్స్య రంగంతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్య ప్రయోజనాలివి!

చేపలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. గుండెతో పాటు మెదడుకు ఎంతో మేలు చేస్తుంది. చేపలో ఉండే ఒమేగా- 3 ఫ్యాటీ యాసిడ్స్ గుండెకు బలం చేకూరుస్తాయి. ఆస్తమాను తగ్గిస్తుంది. అంతేకాదండోయ్.. సీవీపీడీ వంటి వ్యాధులు, అతిసార, చర్మ అలెర్జీను తగ్గిస్తాయి. ఒమేగా 3 ఆమ్లాలు కంటి చూపును మెరుగు పరుస్తాయి. కొవ్వు ఆమ్లాలు మెదడుకు ఎంతో మేలు చేకూరుస్తాయి. వృద్ధులలో వచ్చే మతిమరుపు రోగాన్ని నివారిస్తాయి. గర్భిణులు చేపలు తినడం వల్ల పుట్టే పిల్లల మెదడు పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. విటమిన్ డి, బి12, ఐరన్, జింక్, అయోడిన్, మెగ్నీషియం, పొటాషియం వంటి ఆరోగ్య ప్రయోజనాలు చేపలో ఉంటాయి.



కడలి చేపలు ఎగుమతులకే

జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో ఏడాదికి దాదాపుగా 45వేల మెట్రిక్ టన్నుల సముద్రపు చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మాత్రం 47,772 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ ఉప్పు చేపలు దాదాపుగా చెన్నై, బెంగళూరు, బెంగాల్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మొత్తం ఉత్పత్తిలో 10 శాతం మాత్రమే జిల్లా అవసరాలకు వినియోగిస్తున్నారు. కోవూరు మండలం సాలుచింతల ప్రాంతం కేవలం ఉప్పుచేపల వ్యాపారానికి ప్రసిద్ధి. దూరప్రాంతాల నుంచి వ్యాపారులు, ప్రజలు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

ఆంధ్రా వంటకాల్లో..

ఆంధ్రా వంటకాల్లో చేపల పులుసుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా దీని వాసన, రంగు, రుచితో ప్రత్యేక వంటకంగా గుర్తింపు పొందింది. కూరలో మామిడికాయ వేయడం వల్ల ప్రత్యేక రుచి వస్తుంది. కాస్త చింతపండు కూడా వేయడంతో పులుసు చక్కగా కుదురుతుంది. భోజనప్రియులు పోషక విలువలకంటే కూడా రుచికే ప్రాధాన్యం ఇస్తారు కాబట్టి నెల్లూరు చేపల పులుసంటే ఆహా అనాల్సిందే. ప్రత్యేక కార్యక్రమాలు, పండుగలు ఇతరత్రా కార్యక్రమాల్లో చేపల పులుసు లేని మెనూ ఉండదు. అంతేకాదండోయ్.. ప్రత్యేక ప్యాకింగ్‌లో విదేశాల్లోని ఆత్మీయులకు కూడా పంపుతున్నారంటే నెల్లూరు చేపల పులుసు ఎంత ప్రాచుర్యం పొందిందో అర్థమవుతోంది.

పెట్టుబడే కీలకం



చేపల పెంపకంలో పెట్టుబడి చాలా కీలకం. అవసరానికి తగ్గట్టు ఖర్చులు పెచ్చిస్తేనే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయి. ఐదేళ్లుగా చేపలు పెంచుతున్నా. ముందుగా చేప పిల్లలు పెంచి రైతులకు విక్రయించాలని సిద్ధపడ్డాను. అయితే పెట్టుబడి ఎక్కువగా ఉండటంతో పెంపకంపైనే దృష్టి పెట్టాను. నష్టం రాకపోయినా అధిక లాభాలు మాత్రం రావు. మార్కెట్లో చేపలకు గిరాకీ ఉన్నా ధరలు మాత్రం ఆశాజనకంగా ఉండవు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సూచనల ప్రకారం యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నా. తద్వారా కొంతమేర ఫలితాలు వస్తున్నాయి.

- గోళ్ల వెంకటేశ్వర్లు, అల్లూరు.

చేపల సాగే జీవనాధారం



మాది తూర్పు గోదావరి జిల్లా కాకినాడ. అనంతసాగరం మండలం గౌరవరం వద్ద గుంతలు లీజుకు తీసుకొని చేపలు పంచుతున్నాం. మొదటి నుంచీ ఇదే మా వృత్తి. చేపల పెంపకంలో ఒడిదుడుకులు ఉంటాయి. అన్నీ తట్టుకుని చేపలు పెంచుతున్నాము. లీజు, పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరాకు ఏడాదికి రూ.30 వేల నుంచి 50 వేలు ఆదాయం వస్తోంది.

- పెంచల నరసయ్య, అనంతసాగరం


బొచ్చ

చిన్నారులు దేశానికి సంపద : ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్

నెల్లూరు(హరనాథపురం),(ఆంధ్రజ్యోతి) : చిన్నారులు సమాజానికి, దేశానికి సంపద అని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జడ్పీ హైస్కూల్లో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారుల భద్రత, సంరక్షణ, అభివృద్ధికి అందరూ ప్రాధాన్య మివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మురళీధర్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభా రాణి, బాలల సంరక్షణ సమితి చైర్మన్ టీ మాధవి, జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్ పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం సీసాల స్వాధీనం

● బాటిల్‌పై రూ.1000 అధికంగా విక్రయం

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆం ధ్రజ్యోతి): అతనో రి టైర్డ్ ఆర్మీ ఉద్యోగి. అతని క్యాంటీన్ కా ర్డుతోపాటు మరికొందరి కార్డుల ద్వా రా డిఫెన్స్ మద్యం కొనుగోలు చేసి ధరలకు విక్రయించ డం ప్రారంభించా డు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు పథకం ప్రకారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులోని బీవీనగర్ బ్యాంకు కాలనీకి చెందిన బసివిరెడ్డి జగదీశ్వరరెడ్డి డిఫెన్స్ మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు మధ్యవర్తులను పంపి మద్యం కావాలని అడిగించారు. జగదీశ్వరరెడ్డి బాటిల్ ఎమ్మార్పీపై రూ.1000 అధికంగా తీసుకొని మద్యం విక్రయిస్తుండగా బుధవారం రాత్రి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 750 ఎంఎల్ 12 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. విచారించగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో ఎక్సైజ్ నె ల్లూరు-1 స్టేషన్ ఎస్ఐ డీ శ్రీధర్ గురువారం కేసు నమోదు చేసి అరె స్ట్ చేశారు.

అత్యాచారానికి పాల్పడిన యువకుడి అరెస్టు

ఉదయగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం అ టవీ ప్రాంతంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన వింజమూరు ప ట్టణానికి చెందిన యువకుడు సాధిఖ్‌ను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ఎస్ వెంకటరావు తెలిపారు. ఈమేరకు అతన్ని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి అంజయ్య వచ్చేనెల 3వ తేదీ వరకు రిమాండ్ విధించారన్నారు. దీంతో అతన్ని జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

రైల్లో నుంచి పడి ప్రయాణికుడి మృతి

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ 3లో కాకినాడకు వెళ్లే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికుడు రేకాడి నూకరాజు(55) బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మృతి చెందాడు. కావలి జీఆర్పీ ఎస్ఐ వెంకటరావు, రైల్వే పో లీ సులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి ఈస్ట్‌గోదావరి జిల్లా ఐ పో లవరం మండలం టీ కొత్తపల్లికి చెందిన రేకాడి నూకరాజు చెన్నై నుం చి స్వగ్రామానికి వెళ్లేందుకు సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరాడు. రైలు బిట్రగుంట రైల్వే స్టేషన్లో ఆగే సమయంలో డోర్ వద్ద నిలుచుని ఉండగా ప్రమాదవశాత్తు జారి రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య పడి మృతి చెందాడు. ఈ సంఘటనతో ఆయనతో పాటు ప్రయాణిస్తున్న బం ధు వులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడటమే లక్ష్యం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్ర మాదాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవనంలో గురువారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటికే ఎంపిక చేసిన బ్లాక్‌స్పాట్లపై ఎన్‌హెచ్ అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, రేడియం పెయింటింగ్ వేయాలన్నారు. బుజబుజనెల్లూరు నుంచి భగత్‌సింగ్ కాలనీ వరకు 9 ప్రమాదభరిత ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అన్నీ నివారణ చర్యలు సత్వరమే తీసుకోవాలన్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్ద బస్సులు లోపలికి, బయటకు వచ్చే ప్రాంతాల్లో బస్సులు నిలపకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగర పరిధిలోని మద్రాసు బస్టాండు, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్‌లు ఆక్రమణలు గురికాకుండా చూడాలన్నారు. వీధి వ్యాపారులు ఎక్కువ సమయం ఉండకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని తెలిపారు. నగరంలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, మున్సిపల్ కమిషనర్ నందన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రామకృష్ణ, డీటీసీ చందర్, ఎన్‌హెచ్ఏ పీడీ ఎంకె చౌదరి, డీపీవో శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, ఆత్మకూరు ఆర్డీవో పావని, తదితరులు పాల్గొన్నారు.

● రోడ్డు భద్రత- ప్రమాదాల నియంత్రణపై వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత-ప్రమాదాల నియంత్రణ అనే అంశంపై రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి గురువారం అడిషనల్ డీజీపీ రోడ్‌సేఫ్టీ కేటీ ఉజేలా, డీఐజీ రోడ్ సేఫ్టీ విజయరావు నేతృత్వంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్టేట్ హైవే, నేషనల్ హైవేలపై గుర్తించిన బ్లాక్ స్పాట్లలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న కార్యక్రమాలు, ఇతర అంశాల గురించి అడిషనల్ డీజీపీ చర్చించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ గిరిధర్, కావలి డీఎస్పీ శ్రీధర్, సీఐలు రామారావు, భక్తవత్సలరెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహకార సేవలను విస్తృతం చేయాలి

● కలెక్టర్ హిమాన్షు శుక్లా ● ముగిసిన సహకార వారోత్సవాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల ద్వారా సేవలను విస్తృతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సహకార శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవ ముగింపు సభ గురువారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాల సభ్యుల మధ్య అవగాహన ఉన్నప్పుడే ప్రజలకు అనుకున్న స్థాయిలో సేవలు అందించవచ్చని చెప్పారు. సంఘాలలో వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతీ మూడు నెలలకుగానీ, ఆరు నెలలకుగానీ సమావేశం ఏర్పాటు చేసుకుని వచ్చిన ఆదాయాన్ని సభ్యులందరికీ సమపాళ్లలో పంచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా సహకారశాఖాధికారి గురప్ప మాట్లాడుతూ డీసీసీబీలు సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇందుకు డైరెక్టర్‌లు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్యుత్తమ సేవలందించిన సహకార సంఘాలు, సహకారశాఖ సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందచేశారు.

వరదకు విరామం

- వడివడిగా పనులకిదే సమయం
- ఇకనైనా చేస్తారా... లేదా!?
- సోమశిల ఆప్రాన్ బాగుకు అవకాశమిదే..!


సోమశిల జలాశయం ముందు అప్రాన్ దుస్థితి

అనంతసాగరం నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సోమశిలకు వరద జలాలు ఆగిపోయాయి. అభివృద్ధి పనులకు ఇదే మంచి తరుణం. వర్షాకాలం పూర్తయింది. పనులు చేసేందుకు ఆటంకాలు తొలిగాయి. ఇక పనులు చేయడమే తరువాయి. కాగా ఈ సీజన్‌లో పనులు పూర్తిచేస్తారా? అనే సందేహం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

● కట్టడాల ధ్వంసం

నాలుగేళ్ల క్రితం ఎగువ నుంచి వచ్చిన ఆకస్మిక వరద కారణంగా జలాశయం ముందు కట్టడాలు ధ్వంసమయ్యాయి. ఆ పనులపై గత వైసీపీ నిర్లక్ష్యం చూపింది. రూ. 100 కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపారేకానీ, ఒక్క రూపాయి విడుదల కాలేదు. డ్యాం పరిధిలో అధికారికంగా, అనధికారంగా సుమారు 10 లక్షల ఎకరాల వరిసాగవుతోంది. చిత్తూరు, నెల్లూరుతోపాటు పొరుగు రాష్ట్రం చైన్నైకి తాగునీరు అందిస్తున్న బహుళార్థసాధక ప్రాజెక్టు ఇది. ఇలాంటి ప్రాజెక్టు భద్రతపై ఎంతో శ్రద్ధ వుండాలి. గత వైసీపీ నేతలు ప్రాధాన్యత ఇవ్వలేదు.దీంతో రైతుల వ్యతిరేకతను చవిచూశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులపై శ్రద్ధ చూపారు. సుమారు రూ.30 కోట్ల మేరకు విడుదల చేశారు. కొంత కాలంగా వివిధ కారణాలతో ఆగిన పనులకు నేడు అనుకూలత ఏర్పడింది. ఇక పనులు చేసేలా ఇప్పటి నుంచి చొరవ చూపితే ఈసీజన్‌లో పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. ఆదిశగా అప్రాన్, డౌన్‌స్ట్రీమ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పనులు చేసేలా చర్యలు

జలాశయం వద్ద అభివృద్ధి పనులు చేసేలా దృష్టి సారించాం. గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించాం. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

- వెంకటరమణారెడ్డి, ఎస్ఈ సోమశిల

25 నుంచి అపస్మా క్రీడలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : అపస్మా ఆధ్వర్యంలో మైథిలి మనోహర్‌రెడ్డి మెమోరియల్ క్రీడాపోటీలు ఈనెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. క్రీడల నిర్వహణకు పీఈటీలను కేటాయించాలని, క్రీడలకు హాజరు కావాలని కోరుతూ గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ఆర్ బాలాజీరావుకు వినతిపత్రం ఇచ్చారు. తొలుత నియోజకవర్గ స్థాయిలో ఈనెల 25 నుంచి 30వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు.